# Ḍiṇḍi Maṇḍala Jānapada Gēyālu: Prākr̥utika viznānam

A thesis submiited to the university of Hyderabad in
partial fulfilment of the requirement for the award of

**MASTER OF PHILOSOPHY**

in

**TELUGU**

By


**NUNE MAHESH**

(Reg. No.20HTHL02)

**Department of Telugu**

**School of Humanities**

**University of Hyderabad**

**Hyderabad – 500046**

**Telangana**


**November – 2022**

# డిండి మండల జానపద గేయాలు : ప్రాకృతిక విజ్ఞానం

ఎం.ఫిల్ పట్టాకోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి

సమర్పించిన

పరిశోధనాగ్రంథం


పరిశోధకులు

నూనె మహేష్

Reg. No. 20HTHL02

పర్యవేక్షకులు

ఆచార్య డి. విజయలక్ష్మి

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500 046

తెలంగాణ


నవంబర్ –2022

**Mr.Nune Mahesh**
M.Phil Research Scholar
Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad – 500 046

# DECLARATION

I, **Nune Mahesh** hereby declare that this Dissertation entitled "**Ḍiṇḍi Maṇḍala Jānapada Gēyālu : Prākr̥tika viznānam**" submitted by me under guidance and supervision of **Prof**. **D**. **Vijayalakshmi** is my bona fide research work and is free from plagiarism. I also declare that it has not been submitted previously in part or in full to this university or any other university or institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in shodganga /INFLIBNET.

Signature :
(Nune Mahesh)
Reg No : 20HTHL02
Research Scholar

Date:

# CERTIFICATE

This is to certify that the dissertation entitled "**Ḍiṇḍi Maṇḍala Jānapada Gēyālu : Prākr̥tika viznānam**"submitted by Mr. **Nune Mahesh** bearing Registration No.**20HTHL02** in partial fulfilment of the requirements for the award of **Master of Philosophy in Telugu** is a bona fide work carried out by him under my supervision and guidance.

The Dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

Further the student has passed the following courses towards fulfillment of course work required for M.Phil. (Recommended by the Doctorial Committee) on the basis of the following courses passed during his M.Phil., programme.

| Course Code | Name of the Course | Course Credits | Pass/Fail |
|---|---|---|---|
| HT600 | Research Methodology | 4 | Pass |
| HT601 | History of Telugu Research | 4 | Pass |
| HT602 | Research And Publication Ethics | 4 | Pass |
| HT603 | Broad Field And Specialized Area | 4 | Pass |

**(D. Vijayalakshmi)**
Research Supervisor

**Head**
Department of Telugu

**Dean**
School of Humanities

# కృతజ్ఞతలు


"డిండి మండల జానపదగేయాలు : ప్రాకృతిక విజ్ఞానం" అనే అంశంపై ఎమ్.ఫిల్. చేసేందుకు అనుమతిచ్చిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం అధికారులకి, విశ్వవిద్యాలయంలో చేరిననాటినుండి తమ బోధనలతోనూ సామాజిక చైతన్య దృక్పథంతోనూ నన్ను వెన్నుతట్టి పరిశోధనస్థాయికి నిలబెట్టిన తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారికి...

నా పరిశోధనకు పర్యవేక్షణ బాధ్యత వహించి, పరిశోధనాశం దగ్గరనుండి సిద్ధాంత వ్యాసం పూర్తి అయ్యే వరకు పరిశోధన విధానంలో అమూల్యమైన సలహాలందిస్తూ తమ విలువైన సమయాన్ని వెచ్చించి సహకరించిన పర్యవేక్షకులు ఆచార్య డి. విజయలక్ష్మిగారికి...

ఆచార్య యస్.శరత్ జ్యోత్స్నారాణి(విశ్రాంతాచార్యులు)గారికి, ఆచార్య తుమ్మలరామకృష్ణ (విశ్రాంతాచార్యులు)గారికి, ఆచార్య జి.అరుణకుమారి(విశ్రాంతాచార్యులు)గారికి, ఆచార్య పిల్లలమర్రి రాములుగారికి, ఆచార్య ఎం.గోనానాయక్ గారికి, అకాలమరణం చెందిన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, ఆచార్య రేమిళ్ళవెంకటశాస్త్రి(విశ్రాంతాచార్యులు)గారికి, ఆచార్య పమ్మిపవన్ కుమార్ గారికి, డా. బాణాల భుజంగరెడ్డిగారికి, డా. డి.విజయకుమారిగారికి...

సంప్రదింపు గ్రంధాలను సేకరించుకోవడంలో సహకరించిన హైదరాబాదు విశ్వవిద్యాలయ ఇందిరాగాంధీ మెమోరియల్ గ్రంథాలయం అధికారులకు....

నేను డిండిమండల జానపదగేయాలమీద పరిశోధనచేస్తూ "మీరు పాడే పాటలు" కావాలని అడగగానే చేరదీసి, తమ విలువైన సమయాన్ని కేటాయించి పాటలు పాడిన డిండిమండల వాసులకు....

విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన దగ్గరనుండి నేటివరకు నన్ను ప్రోత్సహించిన నా తోటి పరిశోధక మిత్రులకు... తెలుగు శాఖ బోధనేతర సిబ్బంది రావులపల్లి మధుసూదన్, తలారపు కృష్ణగార్లకు..

నాకు జన్మనిచ్చిన నా తల్లిదండ్రులు శ్రీనూనె ఖరీమమ్మ, నూనె వల్లయ్యలకు, పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయం వరకు చదువు నేర్పించిన గురువులకి, మా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుని సహాయాపడిన శ్రీ బొజ్జాఅల్వాల్ రెడ్డి –శ్రీమతి విమలమ్మలకు ....

పేరు పేరునా కృతజ్ఞతాభివందనాలు.

**నూనె మహేష్**

# విషయసూచిక

**ముందుమాట**

**అధ్యాయం-1**

**డిండి మండలం – భౌగోళిక  స్వరూపం** **1-9**

1.0. పరిచయం

1.1. డిండి ప్రాజెక్ట్ పరిచయం

1.2. భూ స్వరూపం

1.3. శీతోష్ణస్థితి

1.4. జనాభా వివరాలు

1.5. అడవులు

1.6. ఖనిజాలు

1.7. నేలలు– పంటలు

1.8. త్రాగునీరు

1.9. విద్య సౌకర్యాలు

1.10. సమాచార, రవాణా సౌకర్యాలు

1.11. మార్కెటింగ్, బ్యాంకింగ్

1.12. ఆరోగ్యం, పోషణ

1.13. విద్యుత్తు

1.14. భూమి వినియోగం

1.15. పారిశుధ్యం

1.16. పర్యాటక ప్రదేశాలు

1.17. అజీంఘడ్

1.18. సాయిబాబా ఆలయం

**అధ్యాయం-2** 10-26

**జానపద సాహిత్యం పరిచయం**

2.0. పరిచయం

2.1.0. జానపద విజ్ఞానం వర్గీకరణం

2.1.1. రిచర్డ్ డార్సన్

2.1.2. ఆర్.ఎస్.బాగ్స్

2.1.3. ఆర్.వి.ఎస్. సుందరం

2.1.4. బిరుదురాజు రామరాజ

2.1.5. తంగిరాల సుబ్బారావు

2.1.6. నాయని కృష్ణకుమారి

2.1.7. జి.యస్.మోహన్

2.1.8. డిండి మండల జానపదగేయ సాహిత్య వర్గీకరణ

**అధ్యాయం-3**

**డిండి మండల జానపద జీవనం** 27-54

3.0. ఉపోద్ఘాతం

3.1. కుటుంబ వ్యవస్థ

3.2. ఆహారపు అలవాట్లు

3.3. వ్యవసాయం

3.4. వృత్తులు3.5. కులాలు

3.6. మతాలు

3.7. భాషలు

3.8.0. జానపద ఆచారాలు

3.8.1. డిండి మండలంలోని సాంఘికాచారాలు

3.8.2. పుట్టుక

3.8.3. కానుపు

3.8.4. రసజ్వల

3.8.5. వివాహం
3.8.6. పెండ్లి చూపులు
3.8.7. నిశ్చితార్థం
3.8.8. ప్రధానం
3.8.9. పెండ్లి
3.8.10. అప్పగింతలు
3.8.11. సీమంతం
3.9.0. పండుగలు
3.9.1. వినాయక చవితి
3.9.2. దసరా
3.9.3. దీపావళి
3.9.4. సంక్రాంతి
3.9.5. హోళీ
3.9.6. రాఖీ
3.9.7. ఉగాది\యుగాది
3.9.8. పీర్ల పండుగ
3.10.0. గ్రామ దేవతలు ఉత్సవాలు
3.10.1. పోచమ్మ
3.10.2. మైసమ్మ
3.10.3. ఎల్లమ్మ
3.10.4. జాతర
3.11.0. డిండి మండలంలోని ఆటలు
3.11.1. కోతి కొమ్మచి
3.11.2. గాలిపటం
3.11.3. తొక్కుడు బిళ్ళ
3.11.4. దాగుడు మూతలు
3.11.5. పులిజూదం

3.11.6. పులిమేక

3.11.7. చెమ్మ చెక్క

**అధ్యాయం – 4**

**డిండి మండల జానపదగేయాల వర్గీకరణ** 55-96

4.0. పరిచయం

4.1. జానపదత్వం

4.2.0. డిండి మండల జానపద స్త్రీల గేయాలు

4.2.1. తొట్టెల పాటలు

4.2.2. పెండ్లి పాటలు

4.2.3. నలుగు పాటలు

4.2.4. మంగళహారతులు

4.2.5. హారతి

4.2.6. అప్పగింతలు

4.3.0 . కుటుంబ సంబంధగేయాలు

4.3.1.అత్తాకోడళ్ళ సంవాదగేయాలు

4.3.2. బావ- మరదళ్లగేయం

4.3.3. వదినా మరదళ్ల గేయం

4.3.4. అన్నచెల్లెళ్ల తలుపుల దగ్గర గేయం

4.4. పారమార్థికాలు

4.5.0. డిండి మండల శ్రామిక గేయాలు [వ్యవసాయ సంబంధమైనవి]

4.5.1. బయట పనుల్లో పాడే పాటలు

4.5.2. వానదేవుడి పాటలు

4.5.3. ఏరువాక పాటలు

4.5.4. నాగలి పాటలు

4.5.5. మోట పాటలు/కపిల పాటలు

4.5.6. నాట్లు పాటలు

4.5.7. కలుపు పాటలు

4.5.8. కోత పాటలు

4.5.9. చేల కావలి పాటలు

4.5.10. పశువుల కాపరి గేయం

4.6.0. ఇంటిపనుల్లో పాడే పాటలు

4.6.1. విసుర్రాయి పాటలు

4.6.2. దంపుడు పాటలు

4.7.0. కుల సంబంధ గేయాలు

4.7.1. గౌండ్ల వారి గేయం

4.7.2. గొల్లవారి గేయం

4. 8. 0 ఇతరాలు

4.8. 1. పాముపాట

**అధ్యాయం– 5**

**డిండి మండల జానపద గేయాలు ప్రాకృతిక విజ్ఞానం 97 –106**

5.0. పరిచయం

5.1. సహజాలు

5.1.1. జల వనరులు

5.1.2. జల సంబంధాలు

5.1.3. చెట్లు

5.1.4. పూలు

5.1.5. కాయలు

5.1.6. పండ్లు

5.1.7. పంటలు

5.1.8. తోటలు

5.1.9. చేన్లు

5.1.10. అపరాలు

5.1.11. మణులు

5.1.12. జంతువులు

5.1.13. జలచరాలు

5.1.14. పక్షులు

5.1.15. సరీసృపాలు

5.1.16. మైపూతలు

5.2.0. నిర్మితాలు

5.2.1. ఇంటిలోపలి వస్తువులు

5.2.2. కొలమానాలు

5.2.3. ద్రవ్యం

5.2.4. ఆభరణాలు

5.3.0. అంగీకృతాలు

5.3.1. స్థలనామాలు

5.3.2. సంఖ్యావాచకాలు

పరిశోధనా ఫలితాలు 107-108

ఉపయుక్త గ్రంథసూచి 109-109

అనుబంధం -1

జానపదగేయాలు పాడిన వారి వివరాలు 110-111

అనుబంధం-2

క్షేత్రపర్యటన ఛాయాచిత్రాలు 112-113

# ముందు మాట

తెలంగాణ రాష్ట్రంలోని దేవరకొండ నియోజకవర్గం చాలావరకు అటవీప్రాంతం. అటవీ ప్రాంతానికి చెందిన భూభాగంలోని మండలం డిండి. ఇక్కడి వాతావరణం నాగరిక సమాజానికి కొంత దూరంగా ఉంటుంది. చాలావరకు ఆటవిక గ్రామీణ జీవనంతో ఉట్టిపడుతుంటుంది. ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థిగా ఈ ప్రాంతపు వాడుకలో ఉన్న జానపద గేయ సాహిత్యాన్ని నా అభిరుచికి మేరకు పరిశోధన అంశంగా ఎనుకున్నాను. నా పరిశోధనాంశం డిండి మండలం జానపద గేయసాహిత్యం : ప్రాకృతిక విజ్ఞానం. డిండి మండలంలోని గ్రామాలన్నీ తిరిగి 80కి పైగా జానపద గేయాలను సేకరించగలిగాను. అందులోనుంచి అవసరమైనమేరకు పరిశోధన వ్యాసంలో పొందు పరిచాను.

డిండి మండలంలో 38 గ్రామపంచాయితీలు ఉన్నాయి. ఈ పంచాయితీలలో పాటలు పాడేవారిని గుర్తించడం, వారినుండి జానపదగేయాలను సేకరించడంకై ప్రణాళిక వేసుకోవడం జరిగింది. క్షేత్రపర్యటనకు వేసుకున్న ప్రణాళిక ప్రకారం మొదటగా మా స్వగ్రామమైన గోనకొల్ లో జానపదగేయాలను సేకరించడం ప్రారంభించాను. అటునుండి తక్కిన పంచాయితీలలో జానపద గేయ గాయకులను వెతుక్కుంటూ సేకరణ సాగించాను. ఆ క్రమంలో చెరుకుపల్లి గ్రామం లోను, కందుకూరు గ్రామంలోను, గోనబోయినపల్లిలోను, ప్రతాప్ నగర్ లోను, బొగ్గులదోనలోను, వీరబోయినపల్లిలోను, తవుక్లాపూర్ లోను, రామంతాపూర్ లోను ఇంకా చుట్టుపక్కల గ్రామాలలోనూ పర్యటించి స్త్రీలు పాడుకునే గేయాలను సేకరించాను. జానపద గేయాల సేకరణవల్ల డిండి మండలంలోని జానపదుల కష్ట నష్టాలను, సుఖదు:ఖాలను తెలుసుకునే అవకాశం చిక్కింది. ఆ సమయంలో వారు చేసుకునే పండగలు,

వారి ఆహారపు అలవాట్లు, అచారాలు, నమ్మకాలు మొదలైన ఎన్నో విషయాలను ఆకళింపు చేసుకోగలిగాను.

ఈ పరిశోధనకు జానపద గేయాలను సేకరించుకున్న తర్వాత పర్యవేక్షకులతో చర్చించి ఐదు అధ్యాయాలుగా విభజించుకోవడమైంది. డిండి మండలంలో సేకరించిన పాటలలో ఆయా అధ్యాయాలకు అవసరమయ్యే గేయాలను ఎన్నుకొని పరిశీలించి విశ్లేషించడం జరిగింది.

మొదటి అధ్యాయంలో డిండి మండలాన్ని పరిచయం చేస్తూ ఆప్రాంతంలోని భూస్వరూపం, భూ వినియోగం, శీతోష్ణస్థితి, జనాభా వివరాలు, అడవులు, ఖనిజాలు, నేలలు, పంటలు, త్రాగు నీరు, విద్య సౌకర్యాలు, సమాచార రవాణా సౌఖర్యాలు, మార్కెటింగ్, బ్యాంకింగ్, ఆరోగ్యం–పోషణ, విద్యుత్, పారిశుద్ధ్యం, పర్యాటక ప్రదేశాలు వంటి వాటిని పరిశీలనలో భాగంగా ఇవ్వడం జరిగింది.

రెండవ అధ్యాయంలో జానపద సాహిత్య పరిచయం చేస్తూ రిచర్డ్ డార్సన్ , బాగ్స్, అ.ర్.వి.ఎస్ సుందరం గార్లు జానపద విజ్ఞానాన్ని విభజన విభజించిన తీరుతెన్నులను తెలియజేశాను. జానపద గేయసాహిత్యాన్ని ఆర్.వి.ఎస్.సుందరం, బిరుదురాజు రామరాజు, తంగిరాల సుబ్బారావు, నాయని కృష్ణకుమారి, జి.యస్. మోహన్ గార్లు చేసిన వర్గీకరణను తెలియజేయడంతోపాటు డిండిమండలంలో సేకరించిన జానపదగేయ వర్గీకరణ గురించి వివరించడం జరిగింది.

మూడవ అధ్యాయంలో డిండి మండల జానపదుల జీవనవిధానంలో కుటుంబ వ్యవస్థ, ఆహారపు అలవాట్లు, వ్యవసాయం, వృత్తులు, కులాలు, మతాలు, భాషలు, జానపదుల

ఆచారాలు, పండుగలు, గ్రామ దేవతలు– జాతరలు, ఆటలు మొదలైన వాటితో పరిశోధనా క్షేత్రంలోని జీవనశైలిని చూపడం జరిగింది.

నాల్గవ అధ్యాయంలో డిండి మండలంలోని జానపదగేయాలను స్త్రీలపాటలు, పురుషులపాటలు, వృత్తికారులపాటలు, ఇతరాలు అని విభజన చేసి అందులో స్త్రీలపాటల్లో తొట్టెలపాటలు, పెండ్లిపాటలు, నలుగుపాటలు, మంగళహారతులు, అప్పగింతలపాటలు, సంవాదగేయాలు, పారమార్థికగేయాలు కుటుంబ సంబంధంగా పాడుకునేవి పరిచయం చేయడం జరిగింది. అలాగే పురుషులు పాడుకునే శ్రామిక గేయాలలో వ్యవసాయ సంబంధంగా వానపాటలు, ఏరువాకపాటలు, నాగలిపాటలు, మోటపాటలు, కోతలపాటలు, చేలకావలి పాటలు, పశువులకాపరి పాటలు పరిచయం చేయడం జరిగింది. శ్రామిక గేయాలను స్త్రీలుకూడా పాడుతారు. వారు ఇంటి ఆవరణలోనూ పొలాలలోనూ పాడుకునే శ్రామిక గేయాలున్నాయి. వాటిలో పొలాలలో పాడుకునే నాట్లుపాటలు, కలుపుపాటలు, ఇంటికి పరిమితమైన విసరురాతి, దంపుడుపాటలు ఈ కోవకు చెందినవి పరిచయం చేయడం జరిగింది. కులాలకు సంబంధించిన గేయాలలో గౌండ్ల, గొల్లవారి పాటలు లభించాయి. ఇతరాలలో పాముపాట లభించింది. అందులోని విశేషాలను ప్రోదిచేస్తూ వివరించి చూపడం జరిగింది.

ఐదవ ఆధ్యాయం డిండిమండల జానపదగేయాలు ప్రాకృతిక విజ్ఞానంలో సహజాలు నిర్మితాలు, అంగీకృతాలు అని మూడువిధాలుగా విభజించుకొనడం జరిగింది. జానపదగేయాలలో లభ్యమైనటువంటి ప్రాకృతిక విజ్ఞానంలోని సహజాలను జలవనరులు, జలచరాలు, చెట్లు, పూలు, కాయలు, పండ్లు, పంటలు, తోటలు, చేన్లు, అపరాలు,మణులు, జంతువులు, పక్షులు, సరీసృపాలు, మైపూతలుగా వర్గీకరించి పరిశీలించడం జరిగింది.

నిర్మితాలలో కొలమానాలు, ద్రవ్యం, ఆభరణాలను. అంగీకృతాలలో స్థలనామాలు, సంఖ్యావాచకాలను ఈ అధ్యాయంలో భాగంచేసి పరిశీలించడం జరిగింది. చివరగా పరిశోధనా ఫలితాలులో ఐదు అధ్యాయాలలో పరిశీలించిన విశేషాలను క్లుప్తీకరించి చెప్పడం జరిగింది. పరిశోధనకు ఉపయుక్తమైన గ్రంథాలను ఉపయుక్త గ్రంథసూచిలో అందించాను. అనుబంధంలో డిండిమండలంలో క్షేత్రపర్యటనలో భాగంగా తిరిగిన ఊర్లలో గేయసేకరణకు తోడ్పడిన జానపద గేయగాయకుల వివరాలను, జానపద గాయకులతో తీసుకున్న ఛాయాచిత్రాలను, అందించటం జరిగింది.

# అధ్యాయం-1

# డిండి మండలం – భౌగోళిక స్వరూపం

## 1. 0. పరిచయం

ఒక మండల సాహిత్యచరిత్ర, భౌగోళిక పరిస్థితులననుసరించి ఉంటుంది అనగా శీతోష్ణస్థితులు అక్కడగల కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు, నదులు ఆ ప్రాంతంలో నివసించు ప్రజల జీవనసరళిని నిర్దేశించును. ప్రజల వస్త్రధారణ, ఆహారపు అలవాట్లు, ఆచార సంప్రదాయములు వారి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అక్కడి భౌగోళిక పరిస్థితులచే ప్రభావితం అయివుంటాయి.

(డిండి – గుండ్లపల్లి) తెలంగాణరాష్ట్రం, నల్గొండజిల్లా గుండ్లపల్లి మండలం. ఇది సమీప పట్టణమైన నల్గొండనుండి 100 కి.మీ. దూరంలోవుంది. డిండిమండలం నల్గొండజిల్లా దేవరకొండ తాలూకాలో కలదు. ఈ మండలం నల్గొండజిల్లాకు నైరుతిదిక్కున అత్యంత చివరి మండలంగా ఉంది. నాగర్ కర్నూల్ జిల్లాతో సరిహద్దును కలిగివుంది. నల్గొండజిల్లాలో ఈ మండలం పశ్చిమాన ఉంది. ఈ మండలానికి ఈశాన్యాన దేవరకొండ మండలం, తూర్పున చందంపేట మండలం, మిగతావైపుల నాగర్కర్నూల్ జిల్లా సరిహద్దులుగా ఉన్నాయి. ఈ మండలం $16^{o}–31^{'}–00$ ఉత్తర అక్షాంశరేఖలకు, $78^{o}–41^{'}–00$ తూర్పు రేఖాంశాలకు మధ్యనవుంది.

డిండిమండలం దక్షిణ సరిహద్దుగుండా డిండినది ప్రవహిస్తుంది. మండల పరిధిలోనే ఈ నదిపై డిండి ప్రాజెక్ట్ నిర్మించబడింది. గుండ్లపల్లి మండలంలో దుందుబి నది ప్రవహిస్తుంది. ఈ నదిపై గుండ్లపల్లి మండలంలో డిండిప్రాజెక్ట్ ఉండటం వల్ల ఈ ప్రాంతానికి డిండిమండలం అని పేరు వచ్చింది. రాష్ట్రప్రభుత్వ అధికారిక స్థలనామాలల్లో గుండ్లపల్లి అనే ఉంది.

## 1.1. డిండి ప్రాజెక్ట్

మహబూబ్ నగర్, నల్గొండజిల్లాలలో ప్రవహించే నది దుందుభీనది. ఇది కృష్ణానదికి ఉపనది. దుందుభీ నది తదనంతరకాలంలో డిండినదిగా మారినది. మహబూబ్ నగర్ జిల్లా పురుసంపల్లి కొండలలో జన్మించింది. ఈ నదిపై నల్గొండజిల్లాలో డిండి రిజర్వాయర్ నిర్మించబడింది. ఈ ప్రాజెక్ట్ క్రీ.శ.1940 మార్చిలో ప్రారంభమై క్రీ.శ. 1943 జూలై మాసంలో పూర్తి అయినది. ఈ ప్రాజెక్టును కట్టించినది నిజాం రాజు "ఖాజా అజ్మోద్దీన్". ఈ ప్రాజెక్ట్ ఖర్చు ఆనాడు 34 లక్షల 36 వేలు. సున్నపు రాయి, గచ్చుతో దీనిని నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్ట్. 35 అడుగుల ఎత్తు, 3 ప్రధాన తలుపుల ద్వారా 8 కిలోమీటర్లు కాలువ కలిగి చుట్టుఉండే పొలాలకు సాగునీటిని అందిస్తుంది.

ఈప్రాజెక్ట్ నాగర్ కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం, డిండి మండలంలో 12,800 ఎకరాలకు సాగునీరును అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ 4 టి.ఎం.సి.ల నీటి సామర్థ్యం కలిగి ఉంది. డిండి మండలం దక్షిణ సరిహద్దు గుండా డిండినది ప్రవహిస్తుంది. అడవులలో ప్రవహించుకుంటూ నాగార్జున సాగర్లో కలుస్తుంది. డిండి నదినే "దుందుభీ నది" అని కూడా పిలుస్తారు. దుందుభీతీరాన మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న అతి ప్రాచీన క్షేత్రంగా మామిళ్ళపల్లిని దుందుభీక్షేత్రంగా వ్యవహారిస్తారు. జడ్చర్ల మండలంలో దుందుభీతీరాన ప్రాచీనమైన పరశవేదీశ్వరాలయం ఉంది. ఈ డిండి ప్రాజెక్టుకే తెలంగాణ రాష్టం ఏర్పడిన తరువాత "శ్రీరామరాజు విద్యాసాగర్ రావు లిఫ్ట్ స్కీమ్" అని 2018వ సంవత్సరంలో నామకరణం చేశారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వల్ల మునుగోడు, దేవరకొండ ఫ్లోరైడ్ ప్రాంతాలకు తాగునీరు అందించాలనే దృక్పథమే ఈ స్కీమ్ ముఖ్యోద్దేశం. ఈ ప్రాజెక్ట్ పొడవు 3 కిలోమీటర్లు. డిండి మండలంలో 22 రెవెన్యూ గ్రామాలు, 38 గ్రామ పంచాయితీలు కలవు. ప్రముఖ కవి కందుకూరు రుద్రకవి ఈ మండలానికి చెందినవారే. 10 పైన గిరిజన తండాలు, ఐదారు గూడెంలు ఉన్నాయి.

## 1. 2. భూస్వరూపం

డిండి మండలం భౌతికంగా దక్షిణ భారతదేశ పీఠభూమి అయిన "దార్వార్" వ్యవస్థకు చెందినది. ఈ మండలం తూర్పు దార్వార్ వ్యవస్థలో ఉన్న అగ్నిశిలలను కలిగి ఉన్నది. ఇది జిల్లా

కేంద్రమైన నల్గొండ నుండి 100 కి.మీ. దూరంలో ఉన్నది. ఈ మండలం సముద్ర మట్టానికి 545 మీటర్ల ఎత్తులో ఉంది. ఇచ్చట వర్షపాతం తక్కువ. కరువు, కాటకాలు ఎక్కువ. ఇచ్చట వర్షపాతం తక్కువైనప్పటికి ఖనిజ సంపద అపారంగా ఉంది. దక్కన్ పీఠభూమిలో ఎత్తైన, నిస్సారమైన ప్రాచీన కఠిన శిలాప్రాంతం. ఈ మండల భౌగోళిక వ్యాసం 66,713 ఏకరాల విస్తీర్ణం.

## 1. 3. శీతోష్ణస్థితి

దక్షిణ భారతదేశంలోని వాతావరణ పరిస్థితులను నాలుగు రకాలుగా పేర్కొనవచ్చును. డిసెంబర్ నుండి ఫిబ్రవరి వరకు చలికాలం ఉంటుంది. మార్చి నెల నుండి మే నెల వరకు ఎండకాలం ఉంటుంది. ఇక్కడ 6.2 సెంటిమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. ఇక్కడ చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అమ్రాబాద్ అడవులకు సమీపాన ఉండటంతో ఇక్కడ చలి తీవ్రంగా ఉంటుంది. ఒక్కసారి అతివృష్టిగా వర్షాలు కురవడం జరుగుతుంది. ఒక్కోసారి వర్షాలు ఏ మాత్రం కురువవు. అనావృష్టి పరిస్థితులు ఏర్పడి కరువుకు దారితీస్తుంది. క్షామం తాండవమాడుతుంది. డిండి ప్రాంతంలో ఋతుపవనాల ఉనికిని జిల్లాలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే భిన్నంగా కన్పిస్తుంది. అక్కడి ప్రజల భాషాసంస్కృతులు ఆచార వ్యవహారాల్లోనే కాక భౌగోళిక వాతావరణ పరిస్థితులల్లో కూడా జిల్లాలలోని ఇతర ప్రాంతాలకు డిండి ప్రాంతానికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుంది.

## 1. 4. జనాభా వివరాలు

2011 జనాభా లెక్కల ప్రకారం, డిండి మండలం యొక్క మొత్తం జనాభా 46,381. వీరిలో పురుషులు 23,168, మరియు స్త్రీలు 23,213. అక్షరాస్యత శాతంలో ఈ మండలం చాలా వెనుకబడి ఉంది. మొత్తం అక్షరాస్యత శాతం కేవలం 48.11% గా ఉన్నది. దీనిలో పురుషుల అక్షరాస్యత 59.28%, స్త్రీల అక్షరాస్యత 28%గా ఉన్నది. స్త్రీల అక్షరాస్యత సాధించడంలో ఈ మండలం చాలా వెనుకబాటుకు గురయ్యింది.

| | | |
|---|---|---|
| అక్షరాస్యులు | – | 22,317 |
| మొత్తం ఓటర్లు | – | 36,448 |

| | | |
|---|---|---|
| మగవారు | – | 18,294 |
| స్త్రీలు | – | 18,104 |
| రేషన్ కార్డుదారులు | – | 13,025 |
| రేషన్ షాపులు | – | 34 |
| భూమి పట్టాదారులు | – | 33,995 |
| దళితులు | – | 3,814 |
| గిరిజనులు | – | 7,924 |
| ఇతరులు | – | 33,995 |
| పింఛను దారులు | | |
| ఒంటరి మహిళలు | – | 236 |
| వికలాంగులు | – | 699 |
| వితంతువులు | – | 2,760 |
| నేత కార్మికులు | – | 22 |
| కల్లు తీసేవారు | – | 33 |

1. 5. అడవులు

డిండి మండలంలో అడవులను జిల్లా విస్తీర్ణపరంగా చూస్తే 6.03%అత్యల్పంగా ఉన్నాయి. ఈ అడవులలో సీతాఫలం, బ్రహ్మజెముడు, నాగజెముడు, జామచెట్లు, కలిమిపండ్లచెట్లు, బలుజుపండ్ల చెట్లు, నక్కరిపండ్లచెట్లు, నెరేదుపండ్లచెట్లు, వేపచెట్లు, కానుగుచెట్లు, కంపచెట్లు మొదలైన చెట్లు పెరుగుతాయి.

### 1. 6. ఖనిజాలు

రాష్ట్రంలోనే అత్యధికంగా సున్నపురాయి నిక్షేపాలు, శుద్ధి కర్మాగారాలు, ఫెర్రో సిలికాన్, గ్రానైట్, యురేనియం ఉన్న ప్రాంతంగా ఉమ్మడి నల్గొండజిల్లా పేరుగాంచింది. కృష్ణానది పరివాహక ప్రాంతంతోపాటు దానికి అనుకొని ఉన్న నల్లమల్ల అటవీప్రాంతంలో అపారమైన వజ్ర, బంగారం, గ్రానైట్ లాంటి విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని గతంలోనే పలు ఆధారాలు లభ్యమయ్యాయి. తాజాగా ప్రభుత్వం జిల్లాల వారిగా సహజవనరులపై నివేదిక రూపొందించి, ఎక్కడెక్కడ ఏ ఖనిజాలు లభ్యమవుతాయో, ఆ ప్రాంతంలో దానికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దశాబ్దమన్నర క్రితమే యూరేనియం కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (U.C.I.)వారు నల్లమల్లలో యూరేనియం శుద్ధిపరిశ్రమను ఏర్పాటుకు సన్నాహాలు చేయగా, అక్కడి స్థానికులనుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఆ ప్రతిపాదనపై U.C.I.వెనక్కి తగ్గినా ఇప్పటికీ వారికి ప్రతిమండలంలో బేస్ క్యాంపు ఉంది. నెలనెలా ఇకడ పరీక్షలు చేసి నమూనాలను సేకరిస్తున్నారు. “అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్” వారు నిర్వహించిన యురేనియం సర్వేలో దేవరకొండ, చందంపేటతోపాటుగా డిండి మండలంలో కూడా నిక్షేపాలు ఉన్నట్లు బయటపడింది.

దేవరకొండ, భువనగిరి, ఆలేరు, సూర్యాపేట, తుంగతుర్తి, చేటుప్పల్, మునుగోడు, చింతపల్లి ప్రాంతాల్లో స్టోన్ క్రషింగ్ పరిశ్రమ ఏళ్ళుగా నడుస్తోంది. ఈ నేలల్లో ఇటుకలుకూడా తయారుచేస్తారు. వీటిద్వారా అనేకమంది ఉపాధి పొందుతున్నారు.

### 1. 7. నేలలు – పంటలు

డిండిమండలం భౌగోళికంగా 66,713 ఏకరాలలో విస్తరించివుంది. ఇక్కడ జనాభాలో ప్రధానంగా ఎక్కువమంది వ్యవసాయంపైన ఆధారపడి జీవనం సాగిస్తారు. భూములన్నీ వర్షాధారము. చెదురుమదురుగా చెఱువులు, బావులు, వాగులు, కుంటలద్వారా వ్యవసాయం జరుగుతుంది. ఈ మండలంలో ప్రధానంగా అగ్నిశిలలనుండి ఏర్పడిన నల్లరేగడినేలలు విస్తరించి ఉన్నాయి. ఇవి పత్తి పంటకు చాలా అనువైనవి. పత్తితోపాటు, మిర్చి, పొగాకు, పసుపులాంటి వాణిజ్య పంటలు కూడా అధికంగా పండుతాయి. ఈ ప్రాంతంలో ప్రధానంగా పండించే పంటలు:

వరి – 6,051 ఎకరాలు

పత్తి – 2,981 ఎకరాలు

వేరుశనగ – 514 ఎకరాలు

1. 8. త్రాగునీరు

గ్రామంలో కుళాయిలద్వారా రక్షిత మంచినీటి సరఫరా జరుగుతోంది. కుళాయిలద్వారా శుద్ధి చేయని నీరుకూడా సరఫరా అవుతుంది. గ్రామంలో ఏడాది పొడుగునా చేతిపంపులద్వారా నీరు అందుతోంది. బోరు బావులద్వారా ఏడాది పొడుగునా నీరు అందుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ మండలంలోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ పథకంద్వారా అన్ని గ్రామాలలోనూ ఇంటింటికీ తాగునీటి సౌకర్యం ఏర్పాటుచేశారు. ఇది అందరికీ ఆమోదయోగ్యమైన పథకంగా పేరుగాంచింది.

1. 9. విద్యా సౌకర్యాలు

డిండి మండలంలో 40 ప్రాథమిక పాఠశాలలు, 04 ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలు, 08 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 01 ప్రైవేట్ పాఠశాల, 01 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. సమీప ప్రభుత్వ ఆర్ట్స్/సైన్స్ డిగ్రీకళాశాల, ఇంజనీరింగ్ కళాశాల దేవరకొండలో ఉన్నాయి. పాలిటెక్నిక్ కళాశాల దేవరకొండలోనూ, మేనేజ్ మెంట్ కళాశాల నల్గొండలోనూ ఉన్నాయి. సమీప వృత్తివిద్యా శిక్షణ పాఠశాల, అనియతవిద్యాకేంద్రం దేవరకొండలోనూ, దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల నల్గొండలోనూ ఉన్నాయి. 01 ఐ.టి.ఐ.కాలేజీ ఉంది. 03 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లు, 02 సంక్షేమ వసతిగృహాలున్నాయి.

1. 10. సమాచార, రవాణా సౌకర్యాలు

గుండ్లపల్లిలో పోస్టాఫీసు సౌకర్యంవుంది. సబ్–పోస్టాఫీసు సౌకర్యం గ్రామానికి 5 కి.మీ.లోపు దూరంలోవుంది. పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ ఆఫీసు గ్రామంనుండి 10 కి.మీటర్లకి పైబడిన దూరంలో ఉంది. లాండ్ లైన్ టెలిఫోన్, పబ్లిక్ ఫోన్ గ్రామానికి 5 కి.మీ.లోపు దూరంలోవుంది. ఇంటర్నెట్ కేఫ్/సామాన్య సేవాకేంద్రం, ప్రైవేట్ కొరియర్ గ్రామంనుండి 10 కి.మీ. లకు పైబడిన దూరంలో ఉన్నాయి. సమీప గ్రామాలనుండి ఆటోల సౌకర్యంఉంది. ప్రభుత్వరవాణాసంస్థ బస్సుసౌకర్యం, ట్రాక్టర్ సౌకర్యం లాంటివి గ్రామానికి 5 కి.మీ.లోపు దూరంలో ఉన్నాయి. ప్రధాన జిల్లారహదారి, జిల్లారహదారి గ్రామంగుండా పోతున్నాయి. జాతీయరహదారి, రాష్ట్రరహదారి

గ్రామంనుండి 10 కి.మీ.కు పైబడిన దూరంలో ఉన్నాయి. గ్రామంలో తారురోడ్లు, కంకరరోడ్లు, మట్టిరోడ్లు ఉన్నాయి.

## 1. 11. మార్కెటింగ్, బ్యాంకింగ్

డిండిమండలంలో రెండు నేషనల్ బ్యాంకులు, వ్యవసాయ పరపతిసంఘం ఉన్నాయి. ప్రతి గ్రామంలో స్వయం సహాయక బృందం, పౌరసరఫరాల కేంద్రం, వారంవారం సంత, వ్యవసాయ మార్కెటింగ్ సోసైటీ ఉన్నాయి. సహకార బ్యాంకుగ్రామంనుండి 5 నుండి 10 కి.మీ.ల దూరంలో ఉంది. ఎ.టి.ఎం.లు గ్రామంనుండి 10 కి.మీటర్లకి పైబడిన దూరంలో ఉంది.

## 1. 12. ఆరోగ్యం, పోషణ

గ్రామంలో సమీకృత బాలల అభివృద్ధి పథకం, అంగన్ వాడీ కేంద్రం, ఇతర పోషకాహార కేంద్రాలు, ఆశాకేంద్రాలు ఉన్నాయి. ప్రతిగ్రామంలో వార్తాపత్రిక పంపిణీ జరుగుతుంది. శాసనసభ పోలింగ్ కేంద్రం, జననమరణాల నమోదు కార్యాలయం ఉన్నాయి. సినిమాహాలు, గ్రంథాలయం 10 కి.మీటర్లకి పైబడిన దూరంలో ఉన్నాయి. ప్రభుత్వ హాస్పిటల్ ఒకటి మరియు పశువైద్యశాలలు మూడు, అంగన్ వాడీ కేంద్రాలు – 72 ఉన్నాయి.

## 1.13. విద్యుత్తు

గ్రామంలో గృహావసరాల నిమిత్తం విద్యుత్ సరఫరా 17.00 గంటలపాటు వాణిజ్య అవసరాలకోసంకూడా విద్యుత్ సరఫరా చేస్తున్నాయి.

## 1. 14. భూమి వినియోగం

డిండి మండలంలో భూ వినియోగం కింది విధంగా ఉంది.

| | | |
|---|---|---|
| అడవి | = | 288 హెక్టార్లు |
| వ్యవసాయేతర వినియోగంలో ఉన్న భూమి | = | 395 హెక్టార్లు |
| నికరంగా విత్తన భూమి | = | 2100 హెక్టార్లు |
| నీటి సౌకర్యం లేని భూమి | = | 1804 హెక్టార్లు |
| వివిధ వనరుల నుండి సాగునీరు | | |

లభిస్తున్న భూమి = 306 హెక్టార్లు

## 1. 15. పారిశుద్ధ్యం

గ్రామంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఉంది. మురుగునీరు బహిరంగ కాలువల ద్వారా కూడా ప్రవహిస్తుంది. మురుగునీరు బహిరంగంగా, కచ్చా కాలువలద్వారాకూడా ప్రవహిస్తుంది. మురుగునీటిని శుద్ధిచేసే ప్లాంటులోకి పంపిస్తున్నారు.సామాజిక మరుగుదొడ్డి సౌకర్యంలేదు. ఇంటింటికి తిరిగి వ్యర్థాలను సేకరించే వ్యవస్థ లేదు. సామాజిక బయోగ్యాస్ ఉత్పాదక వ్యవస్థలేదు. చెత్తను వీధుల పక్కనే పారబోస్తారు.

## 1. 16. పర్యాటక ప్రదేశాలు

డిండి మండలం ప్రధానంగా గుట్టలలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ మండలానికి అతి చెరువలో "అమ్రాబాద్ ఫారెస్ట్" ఉంది. ఈ ఆడవులలో అడవి పందులు, చిరుతలు, పులులు, జింకలు, సరీసృపాలు, నెమళ్ళకు నివాసయోగ్యంగా ఉండి పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇక డిండి ప్రాజెక్ట్ మండల పర్యాటక కేంద్రంగా ఉనికిని పొందింది. వర్షాకాలంలో నిండు కుండలా మరి అలుగు పోస్తున్న డిండి ప్రాజెక్టును చూడటానికి పర్యాటకులు నల్గొండ జిల్లానుండే కాకుండా హైదరాబాద్ పరిసరాలు ప్రాంతాలనుండి వస్తూపోతూ సందడి చేస్తుంటారు. ఇక్కడ కట్టమైసమ్మతల్లిని మొక్కుకుంటే అనుకున్నది జరుగుతుందని ఇక్కడి ప్రజల బలమైన నమ్మకం.

## 1. 17. అజీంగఢ్ (బాపన్ కుంట)

అజీంగఢ్ డిండి మండల కేంద్రానికి 6 కి.మీ. దూరంలో ఉంటుంది. నిజాం రాజులు డిండి ప్రాజెక్ట్ నిర్మించే సమయంలో ఇక్కడ విశ్రాంత భవనాన్ని నిర్మించుకున్నారు. దీనిని సున్నపురాయి గచ్చుతో నిర్మించారు. దీనిని బాపన్ కుంట "బంగ్లా" అని కూడా అంటారు. డిండి – దేవరకొండ రహదారిలో ఈ బంగ్లా పర్యాటకులను మంచిగా ఆకర్షిస్తుంది.

## 1. 18. సాయిబాబా ఆలయం

శ్రీశైలం–హైదరాబాద్ రోడ్డు ప్రక్కనే "సాయిబాబా ఆలయం" ఉంది. ప్రశాంతమైన వాతావరణం, విశాలమైన ప్రాంగణంలో డిండి మండల వాస్తవ్యులు నిర్మించిన షిర్డీ సాయిబాబా

ఆలయం మనస్సుకు ప్రశాంతతను కలిగిస్తోంది. ఈ ఆలయం షిరిడీలోని సాయిబాబా ఆలయానికి ఏ మాత్రం తీసిపోదు.

ఇలా డిండి మండలం చారిత్రకంగానూ, సామాజికంగానూ, క్షేత్రపరంగానూ, పర్యాటక కేంద్రంగానూ, ఆధ్యాత్మికంగానూ, భూగర్భవనరులతో నిండిఉంది. ఇక్కడి ప్రజలు ప్రశాంతజీవనాన్ని ఆస్వాదిస్తూ నిరంతరం వ్యవసాయపనులతో సతమతమౌతుంటారు.

# అధ్యాయం–2
# జానపద సాహిత్యం పరిచయం

2. 0. పరిచయం

జానపద విజ్ఞానమంటే కేవలం మౌఖికంగా ఒక తరంనుండి మరొక తరానికి సంక్రమించే వాగ్రూపక సాహిత్యం. జానపదవిజ్ఞానం సంస్కృతిలో భాగం. జానపదసంస్కృతి (Folk Culture), జానపదజీవనం (Folk Life), జానపదవిజ్ఞానం (Folk Lore) వేర్వేరు కాదు. జానపదవిజ్ఞానం ఒక సమూహానికి సంబంధించిన విలువైన సంపద. ఈ పదాన్ని మొదటగా W.J. Thoms 1846సం॥లో రూపొందించాడు. ("The Athenaeum" అనే పత్రికకు రాసిన ఉత్తరంలో థామ్స్"ఫోక్లోర్" అనే పదాన్ని వాడాడు) [1] ఇది ఒక తరంనుంచి మరోతరానికి, ఒక సమూహంనుంచి మరో సమూహానికి, ఒక ప్రదేశంనుంచి మరో ప్రదేశానికి మారుతూ తరగనిసంపదగా మనమధ్య నిలిచింది. ఇది సమూహాలకు సంబంధించిన జీవనవిధానాలను అందించే గనిగా భావించవచ్చు. జానపదవిజ్ఞానం అత్యంత ప్రాచీనకాలానికి సంబంధించిన సాంప్రదాయకజ్ఞానమని మరోవిధంగా చెప్పాలంటే అది 'సజీవశిలాజం'అని కొందరు అభిప్రాయపడ్డారు.

"జానపదులంటే ఏదైనా ఒక విషయంలోనైన భావసామ్యం కలిగిన జన సముదాయం అని జానపద విద్వాంసుడు అలన్ అండస్ పేర్కొనడం జరిగింది. Those materials in culture that circulate traditionally among members of any group in different versions, whether in oral form or by means of customary example (బ్రున్వాన్డ్ : The Study of American Folklore). పై నిర్వచనాన్ని పరిశీలిస్తే జానపదవిజ్ఞానాన్ని సంస్కృతికి సంబంధించిన విషయాలు ఏ సముదాయంలోనైనా సాంప్రదాయకంగా ప్రసారమయ్యేవి.

వివిధ రూపాంతరాలు చెంది మౌఖికంగాగాని, మరోకరూపంగాగాని ఒక తరంనుంచి మరో తరానికి సంక్రమించేవి జానపద విజ్ఞానంలో చేరతాయని చెప్పవచ్చు"[1.] జానపద విజ్ఞానం చాలా విశాలమైంది. జీవితానికి, సంస్కృతికి సంబంధించిన అన్ని విషయాలను ఇముద్చుకోగలిగినంత విస్తృత పరిధి కలిగినది.

జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం ఒక భాగమని, ఇది గేయ సాహిత్యాన్ని కంటే విస్తృతమైనదని అర్థం చేసుకుంటే సరిపోతుంది. "సాహిత్యం" అంటే జానపద గేయాలు, కథాగేయాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు చెప్పవచ్చు.

ప్రసిద్ధ జానపద విద్వాంసుడైన అలన్ డండెస్ ప్రకారం జానపదులంటే ఏదైనా ఒక్క విషయంలోనైనా భావస్వామ్యం కలిగిన సముదాయం. వీరు ఒక భాషకు సంబంధించినవారు కావచ్చు. ఒక ప్రదేశంలో నివసిస్తున్నవాడు కావచ్చు. ఒకే జాతికి, మతానికి, వృత్తికి సంబంధించినవారు కావచ్చు. అయితే జన సముదాయం తమదేఅనిచెప్పుకోగల్గిన కొన్ని సంప్రదాయాలను కలిగి ఉండాలి. జన సముదాయం అన్నప్పుడు'ఫోక్' అనిపించుకోవాలంటే కనీసం ఇద్దరైనా ఉండాలని చెప్పాడు. అయితే జానపద సముదాయంలో ఎక్కువ మంది వ్యక్తులుంటారు. ఈ విధంగా జానపదాల్ని నిర్వచించడం వల్ల ఫోక్ అన్న దానికి అర్థం ఒక కుటుంబం అయినా కావచ్చు. ఒక దేశమైనా కావచ్చు. 'మా ఇంటి జానపద విజ్ఞానంఅనడం ఎంత అర్థవంతమో భారతీయ జానపద విజ్ఞానం అనడం అంటే అర్థవంతమే. ఒక కుటుంబంలోని పద్ధతులు, నమ్మకాల వారి ఇంటి పేరును గురించి కథాకమామిషూ మొదలైనవి ఇంటింటి జానపద విజ్ఞానమైతే, భారతీయుల సంప్రదాయాలు, నమ్మకాలు, పండుగలు మొదలైనవి భారతీయ జానపద విజ్ఞానమని పించుకుంటాయి. జానపదులను ఆధునికంగా నిర్వచిస్తే సమాన సంప్రదాయాలు కలిగిన ఆటవికులైన, గిరిజనులైనా, నగరవాసులైనా జానపదులే అవుతారని చెప్పవచ్చు.

## 2. 1.0. జానపద విజ్ఞానం వర్గీకరణ :

ఏ శాస్త్రాన్నయినా అధ్యయనం చెయ్యాలంటే దాన్ని విశ్లేషించి వర్గీకరించాలి. జానపద విజ్ఞానం స్వరూప స్వభావాలను బాగా అర్థం చేసుకోవాలంటే ఈ అధ్యయన విషయంలోని వివిధ విభాగాలను సూక్ష్మంగా పరిశీలించాల్సి ఉంది. జానపద విజ్ఞానంలో ముఖ్యంగా 1)

1. సుందరం, ఆర్వీయస్; ఆంధ్రుల జానపద విజ్ఞానం: పుట:1

శాబ్ధిక జానపద విజ్ఞానం (Verbal Folklore), 2) శాబ్దికేతర జానపద విజ్ఞానం (Non-verbal Folklore) అనే రెండు విభాగాలున్నాయి. మౌఖికంగా, శబ్ద రూపంలో వెలువడేది మొదటి విభాగానికి చెందినవైతే, తదితరమైనన్మకాలు, ఆచారాలు, దుస్తులు, అలంకారాలు, ప్రదర్శన కళలు మొదలైనవి రెండవ విభాగానికి చెందుతాయి.

### 2. 1. 1. రిచర్డ్ డార్సన్

రిచర్డ్ ఎం. డార్సన్ (Richard M. Dorson) జానపద విజ్ఞానాన్ని స్థూలంగా నాలుగు శీర్షికల కింద విభజించాడు (డార్సన్, 1972). అవి

1) జానపద విజ్ఞానం (మౌఖిక సాహిత్యం) (Oral Literature)
2) వస్తు సంస్కృతి (భౌతిక జీవనం) (Material Culture)
3) జానపదాచారాలు (Social Folk Customs)
4) జానపద కళలు (Folk Arts)

### జానపద విజ్ఞానం (మౌఖిక సాహిత్యం) (Oral Literature)

మౌఖికం అనగా ముఖము ద్వారా వెలువడిన పాట, మాట, పలుకు మొదలైనవి. ఇందులో రకరకాల కథాగేయాలు, గాథలు, కథ విరహితమైన అనేక విధాల పాటలు, గద్యరూపాలు, వచన రూపములో ఉండే కథలు, సామెతలు, పొడుపు కథలు, మారుమూల పదములు, మాండలికాలు, మాసలు, తిట్లు, నుడికారాలు మొదలైనవి ఈ విభాగంలోనికి వస్తాయి.

### వస్తు సంస్కృతి (భౌతిక జీవనం) (Material Culture)

భౌతిక జీవనానికి సంబంధించిన అన్ని వస్తువులు ఈ విభాగంలో చేరతాయి. కళారూపాలు కూడా వస్తు రూపంలో ఉంటే ఈ విభాగంలోనే స్థానం పొందుతాయి. చిత్రకళ, శిల్ప, వాస్తుకళ, వివిధ వృత్తుల పరికరాలు, దుస్తులు, అలంకరణ, ఆభరణాలు, ఆహార సామాగ్రి, పూజా సామాగ్రి, శిలావిగ్రహాలు, దారు విగ్రహాలు మొదలైనవాటిని ఈ విభాగంలో పరిశీలించడం జరిగింది.

### జానపద ఆచారాలు (Social Folk Customs)

జానపద కళలు కూడా చాలా ప్రాచుర్యం పొందినవి. సంగీత, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలని ఈ విభాగంలో చేరతాయి. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, తోలు బొమ్మలాటలు, యక్షగానం, వీధిభాగోతం, కోలాటం, పగటి వేషాలు, బహురూపులు, గారడి విద్యలు మొదలైనవి ఈ విభాగంలో చేరుతాయి.

### జానపద కళలు (Folk Arts)

జానపదులలో ఆచార, వ్యవహారాలు ఎక్కువగా ఉంటాయి. మూఢ నమ్మకాలను ఎక్కువగా నమ్ముతారు. పుట్టుక, వివాహం, మరణం వరకు మొదలైన ఆచారాలు, కుటుంబం, సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వినోదాలు, ఆటలు, జానపద వైద్యం, మతం, నమ్మకాలు మొదలైనవి ఈ విభాగంలో చేరుతాయి.

డార్సన్ పైన చేసిన విభజన స్థూలమైనదైన శాస్త్రీయంగా ఉంది. జానపద కళల్లో చేరాల్సిన శిల్పం, చిత్రకళ మొదలైనవి వస్తు సంస్కృతిలో చేరాయి. ఏది ఏమైనా జానపద విజ్ఞానానికి సంబంధించిన స్థూల వర్గీకరణలలోడార్సన్ వర్గీకరణమే అత్యుత్తమైనది.

### 2.1.2. ఆర్.ఎస్. బాగ్స్ (R.S. Boggs)

జానపద విజ్ఞాన వర్గీకరణ క్షేత్రంలో 1937 సం॥ నుండి వినిపిస్తున్న పేరు బాగ్స్. ఈయన Pan American మరియు స్పానీషు జానపద విజ్ఞాని. జానపద విజ్ఞానాన్ని సమగ్రంగా అధ్యయనం చేసేటప్పుడు సూక్ష్మాతి సూక్ష్మమైన అంశాల్ని కూడా పరిశీలించాలి. ఇలాంటి పరిశీలనకు ఆర్.ఎస్. బాగ్స్ (R.S. Boggs) విభజన ఉపయోగపడుతుంది. జానపద విజ్ఞానంలని ముఖ్య విభాగాలను బాగ్స్ ఇంగ్లీష్ లోని పెద్ద అక్షరాలతో సూచించాడు. వాటిని Groups అన్నాడు. ఈయన జానపద విజ్ఞనాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళిన ఘనత ఆర్.ఎస్. బాగ్స్ కి, రిచర్డ్ ఎమ్. డార్సన్ కు చెందుతుంది.

బాగ్స్ విభజన

A. సామాన్య జానపద విజ్ఞానం (General Folklore).

B. గద్య కథనం (Prose Narrative).

C. కథాగేయం (Ballad)
- గేయం (Song)
- నృత్యం (Dance)
- ఆట (Game)
- సంగీతం (Music)
- గద్య (Verse)

D. నాటకం (Drama)

E. ఆచారం (Custom)

F. ఉత్సవం (Festival)

G. భూగోళం (Geography)

H. భాష (Language)

I. కళ (Art)
- చేతి పనులు (Crafts)
- వాస్తు (Architecture)

J. ఆహారం (Food)

K. పానీయం (Drink)

L. వాక్కు (Speech)

M. సామెత (Proverb)

N. పొడుపు కథ (Riddle)

పై గణాలలో ఒక్కొక్క దాన్ని బాగ్స్ కొన్ని వర్గాలుగా విభజించారు.

ఇది వర్గీకరణలో మొదటిదశ. ఈ గుంపులు మళ్ళీ వర్గాలుగా వర్గీకరించబడ్డాయి. ఇవి 000–900 సంఖ్యలో సూచించబడతాయి. వర్గాలు మళ్ళీ నమూనాలుగా విభజించబడతాయి. ఇవి 00–90 సంఖ్యలో సూచింపబడతాయి. ఇవి 0–9 సంఖ్యతో సూచింపబడతాయి. ఆ తర్వాత ప్రక్రియలు విభాగాలుగా విభజింపబడతాయి. అవి 0.9 సంఖ్యగా సూచింపబడతాయి. ఈ విభాగాలు మళ్ళీ ఉప విభాగాలుగా విభజింపబడతాయి.

## 2. 1.3. ఆర్వీయస్. సుందరం

ఆర్వీయస్ సుందరంగారు తమ ఆంధ్రుల జానపద విజ్ఞానం అను గ్రంథంలో జానపద విజ్ఞానాన్ని మానవుని సంస్కృతిలో ఒక భాగమంటూ జానపదుల జీవనానికి సంబంధించిన సమస్త అంశాలు ఇందులో భాగస్వామ్యం అవుతాయని తెలియజేశారు. జానపద సాహిత్యంలో జానపద గేయాలు, కథలు, సామెతలు, పొడుపుకథలు ఉన్నాయని విభజించి చూపారు. జానపదుల సాంఘిక ఆచారాలలో కుటుంబ సంబంధ ఆచారాలు, పండుగలు, ఆటలు, వైద్యం, నమ్మకాలు ఇలా అనేక అంశాల సమాహారంగా ఉంటుందని వివరించారు. వస్తుసంస్కృతిలో చిత్రకళ, శిల్పం, వాస్తుకళ, వృత్తి సాధనాలు, దుస్తులు, అలంకరణ సామగ్రి, ఆభరణాలు, ఆహార సామగ్రి, విగ్రహాలు ఇలా అనేకం ఉన్నాయని వివరించారు. జానపద కళలకు సంబంధించి జానపదులు వినోదంకోసం వేసుకునే వీధినాటకాలు, తోలుబొమ్మల ఆటలు, యక్షగానాలు, పగటివేషాలు, గారడీలు అనేక రకాల వాయిద్యపు ధ్వనులు ఇలా ఎన్నింటినో వర్గీకరించి చూపటం జరిగింది.

జానపద విజ్ఞానం

| జానపద సాహిత్యం | సాంఘిక జానపదాచారాలు | వస్తు సంస్కృతి | జానపద కళలు |
|---|---|---|---|
| జానపద గేయాలు | జీవన చక్రానికి సంబంధించిన ఆచారాలు | చిత్రకళ, శిల్పం, వాస్తు కళ | వీధి భాగోతం |
| కథాగేయాలు | కుటుంబసంబంధబాంధవ్యాలు | వృత్తి సాధనాలు | తోలుబొమ్మలు |
| కథలు | పండుగలు | దుస్తులు | వాద్య సంగీతం |
| సామెతలు | ఆటలు | అలంకరణసామాగ్రి | గాత్ర సంగీతం |
| పొడుపు కథలు | జానపద వైద్యం | ఆభరణాలు | యక్షగానం |
| | జానపదుల మత | ఆహారసామాగ్రి | బహురూపులు |
| | నమ్మకాలు మొదలైనవి | విగ్రహాలు | పగటి వేషాలు |
| | | మొదలైనవి | గారడి విద్య మొదలైనవి |

**ఆర్వీయస్. సుందరం జానపద సాహిత్యం విభజన**

ఆర్వీయస్ సుందరంగారు జానపదవిజ్ఞానాన్ని వర్గీకరించినరీతిలోనే జానపదసాహిత్యాన్నీ వర్గీకరించిచూపారు. జానపద సాహిత్యం మొత్తాన్ని 4 విధాలుగా విభజించారు.

జానపద సాహిత్యం (Folk Literature)

లేదా

మౌఖిక సాహిత్యం (Oral Literature)

లేదా

శాబ్దికకళ లేక వాగ్రూపకళ (Verbal Art)

లేదా

అభివ్యక్తి (భావప్రకాశిక) సాహిత్యము (Expressive Literature)

- గద్యాఖ్యానములు
  - పుక్కిటి పురాణాలు
  - ఐతిహ్యములు
  - జానపదకథలు
- జానపద కవిత్వము
  - జానపదగేయములు
  - జానపద గేయకథలు
- సామెతలు
- పొడుపు కథలు

ఆదిమ మానవునినుంచి నేటి నాగరిక మానవునివరకు ఆయాకాలాలలో మానవులు తమ అభ్యున్నతికోసం చేసినటువంటి కృషిని పాటల రూపంలోనూ కథల రూపంలోనూ నిక్షిప్తం చేశారు. దానినే మనం ఇపుడు జానపదసాహిత్యం అంటున్నాం. జానపదుల జీవనానికి సంబంధించిన గేయాలు, కథలు, సామెతలు, భాష, నమ్మకాలు, కళలు, దుస్తులు, ఆటలు, వంటలు జానపద సాహిత్యంలో నిక్షిప్తభాగాలు. జనపదుల సాహిత్యాన్ని జానపదసాహిత్యం అంటారు. జానపద సాహిత్యంలో ప్రధానంగా గేయాలు, కథలు ఉంటాయి.

గ్రామీణ వాతావరణంలో చదువుకోడానికి అవకాశాలు లేని కాలంలో వారివారి జ్ఞానాన్ని జానపదసాహిత్యంగా నిక్షిప్తం చేసి అందించారు. జానపదసాహిత్యం అంటే పల్లెపదాలు దీనిని ఆంగ్లంలో 'Oral Literature' అంటారు. తదనంతరకాలంలో Folk Literature అను పేరుతో స్థిరపడింది. ఈ సాహిత్యాన్ని ప్రజావాఙ్మయము, అనాదృత వాఙ్మయము, మధుర కవితలు, దేశి సారస్వతము మొదలైన పేర్లతో వ్యవహరిస్తున్నారు.

### 2.1.4. బిరుదురాజు రామరాజు :

డా॥ బిరుదురాజు రామరాజుగారు తమ తెలుగు జానపద గేయ సాహిత్యములో గేయ సాహిత్యం మొత్తానికి పదకొండు రకాలుగా విభజించారు. అవి: 1) పౌరాణిక గేయములు – రామాయణ సంబంధములు, భారత సంబంధములు, భాగవత సంబంధములు 2) చారిత్రక– చారిత్రములు, అస్పష్ట చారిత్రములు, 3) మత సంబంధ గేయములు, 4) పారమార్థిక గేయములు, 5) స్త్రీల పాటలు, 6) శ్రామిక గేయములు, 7) పిల్లల పాటలు, 8) శృంగార గేయములు, 9) అద్భుత రస గేయములు, 10) కరుణరస గేయములు, 11) హాస్యపు గేయాలు. ఈయన వర్గీకరణ విధానంలో గేయాలు, గేయ కథలు ప్రత్యేకంగా వర్గీకరించబడలేదు.

### 2.1.5. తంగిరాల సుబ్బారావు :

డా॥ తంగిరాల వెంకటసుబ్బారావుగారు జానపద సాహిత్యాన్ని ఐదు భాగాలుగా విభజించారు. 1) గద్యాఖ్యానాలు, 2) జానపద గేయాలు, 3) వీరగాథలు, 4) పొడుపు కథలు, 5) సామెతలు. గద్యాఖ్యానములను పుక్కిటి పురాణములు, ఇతిహాసములు, జానపద కథలు అని, వీరగాథలను, లఘు వీరగాథలు, వీరగాథా చక్రములని విభజించారు. వీరి దృష్టిలో గేయకథలే వీరగాథలు. వీరగాథ అనే శబ్దంలోనే వీరగాథలలో వీరత్వానికే ప్రాధాన్యం ఉందని తెలుస్తుంది. గేయ కథలన్నింటిలో మనం వీరత్వాన్ని చూడలేం. స్త్రీల కథల పాటల్లో వీరత్వనికి ప్రాధాన్యం లేదు. ఆంగ్లంలో 'Ballad'అంటే వీరగాథ అని అర్థము. కాబట్టి గేయ కథల్లో వీరగాథల్ని ఒక శాఖగా గుర్తించవచ్చు. తంగిరాల వారి ఉద్దేశ్యంలో స్త్రీల పాటలు జానపద సాహిత్యం కంటే ఉన్నతమైన జాతికి సంబంధించినవి. కాని నేటి అమెరికా విద్వాంసులు మౌఖిక సంప్రదాయంలో ఉండే ప్రతి గీతాన్ని జానపద గీతమంటున్నారు.

### 2.1.6. నాయని కృష్ణకుమారి :

డా॥నాయని కృష్ణకుమారిగారు జానపద వాఙ్మయం అంతటిని ఈ క్రింది విధంగా విభజించినారు. ఈమె గేయ శాఖలో రెండు విభాగాలు ఉన్నాయి. అవి

1) కథావిరహిత గేయాలు,

2) కథాసహిత గేయాలు.

ముందుగా జానపద సాహిత్యానికి చెందిన కథావిరహితగేయశాఖను పరిశీలిస్తే దానికి సంబంధించిన విభాగాలు క్రింది విధంగా ఉంటుంది.

కథాసహిత శాఖలోని స్త్రీల పాటల్ని వ్రతకథలు, పౌరాణిక కథలనీ, వృత్తి పదాలను వీరగాథలు, అద్భుత గాథలు, మతగాథల. చారిత్రక గాథలు, స్త్రీ సంబంధిత గాథలని, మతగాథలు, పురాణ గాథలు, గ్రామదేవతకథలనీ, చారిత్రక గాథల్ని స్పష్ట చారిత్రాకాలు, అస్పష్ట చారిత్రకలని విభజించారు.

వచన శాఖను కూడ కథావిరహితం, కథాసహితమని విభజించి పొడుపు కథలు, సామెతల్ని, కథారహితంలోను, నీతి కథలు, వీరకథలు, అద్భుత కథలు, పురాకథలు, పురాకల్పిత కథలు, పెదరాశి పెద్దమ్మ కథలను కథా సహితంలో చేర్చినారు.

దృశ్యశాఖను మనుషులు ఆడే ప్రక్రియలనీ, మనుషులు ఆడించే ప్రక్రియ అని విభజించి పగటి వేషాలు, వీధి నాటకం, యక్షగానాల్ని మనుషులు ఆడే ప్రక్రియగా, తోలు బొమ్మలాట, చిక్కు బొమ్మలాటను మనుషులు ఆడించే ప్రక్రియలో చేర్చారు. జానపద వాఙ్మయ స్వరూపాన్ని స్థూల దృష్టిలో పరిశీలించినప్పుడు ఈమె నిర్ణయం సరైనదని అంగీకరించవచ్చును. (చూడు చిత్రం–పుట: 20–23)

### 2.1.7. జి.ఎస్.మోహన్ :

జానపద గేయాలను పురుషులపాటలు, స్త్రీలపాటలు, ఉభయులపాటలు, పిల్లలపాటలు అని ప్రధాన విభజన చేశారు. పురుషులపాటలను వర్గీకరిస్తూ భావోద్వేగాలు, ధార్మికాలు, క్రియాన్వితాలు, వినోదసంబంధాలు అని విభజించారు. భావోద్వేగాలను వలపుపాటలు, హాస్యపుపాటలు, కన్నీటి పాటలు అని విభజించారు. క్రియాన్వితాలను మతసంబంధాలు, పారమార్థికాలు అని విభజించారు. వినోదసంబంధాలను శ్రామికగీతాలు, క్రీడాగీతాలు, నృత్యగీతాలు అని విభజించారు.

స్త్రీలపాటలను లాలి/జోలపాటలు, వేడుక పాటలు, భక్తి పాటలు, శ్రమజీవనపు పాటలు అని వర్గీకరించారు. ఇందులో వేడుకపాటలను సమర్తపాటలు, పెండ్లిపాటలు, సీమంతపుపాటలు అని విభజించారు. భక్తిపాటలను మేలుకొలుపులు, పూజపాటలు, మంగళహారతులు అని విభాగించారు. శ్రమజీవనపు శ్రామికపాటలను ఇంట్లో పాడుకునే విసుర్రాతిపాటలు, దంపుడుపాటలుఅనీ పొలాలలోపాడుకునే నాట్లుపాటలు, కలుపుపాటలు అని విభజించారు. స్త్రీపురుషులు ఉభయులు పాడుకునే పాటలను పురుషులు పాడుకునే పాటల అంతర్విభాగాలకు ఆపాదించి వర్గీకరించారు. పిల్లల పాటలను తల్లులు పిల్లలకోసం పాడేపాటలనీ, పిల్లలు తమకోసం తాము పాడుకునేవి అని వర్గీకరించారు. (చూడు చిత్రం– పుట:24–26)

## 2.1.8. డిండిమండల జానపద గేయ సాహిత్యం వర్గీకరణ :

డిండిమండల జానపద గేయ సాహిత్యాన్ని అధ్యయనం చేసినపుడు అందులో స్త్రీలపాటల్లో సీమంతంపాటలు, హోలీపాటలు, తొట్టెలపాటలు, పెండ్లిపాటల్లో నలుగుపాటలు, మంగళారతులపాటలు, హారతిపాటలు, అప్పగింతలపాటలు ఉన్నాయి. ఇందులోనే మరొక వర్గమైన కుటుంబ సంబంధ గేయాలలో అత్తాకోడళ్ళ సంవాదాలు, బావామరదళ్ళ సంవాదాలు, వదినామరదళ్ల సంవాదాలు అన్నాచెల్లెళ్ల తలుపుదగ్గరి సంవాదాలు ఉన్నాయి. పారమార్థిక గేయాలు లభ్యమయ్యాయి. శ్రామిక గేయాలలో పురుషులు పాడుకునే వానదేవుడిపాటలు, ఏరువాక పాటలు, నాగలి పాటలు, మోటపాటలు, కోతపాటలు, చేలకావలి పాటలు, పశువులకాపరిపాటలు లభించాయి. స్త్రీల శ్రామికగేయాలలో నాట్లు పాటలు, కలుపుపాటలు లభించాయి. ఇంటి పనుల్లో పాడే విసుర్రాయిపాటలు, దంపుడుపాటలు లభించాయి. వృత్తిసంబంధగేయాలలో గౌండ్లవారిగేయం, గొల్లవారిగేయం లభించాయి. ఇతరాలలో గ్రహణ గతులను తెలిపే పాముపాట ఒకటి లభించింది.

ఈ అధ్యాయంలో జానపద విజ్ఞానాన్ని, జానపద సాహిత్యాన్ని, జానపద గేయసాహిత్యాన్ని పూర్వపరిశోధకులు వర్గీకరించిన విధానాలను తెలియజేస్తూ డిండిమండలంలో జానపదగేయాలను సేకరించినపుడు లభ్యమైన గేయాలను పైన విద్వాంసులు అందించిన కోణంతో పరిశీలించి వర్గీకరించి చూపడం జరిగింది.

**I.** నాయని కృష్ణకుమారి:


జానపద వాఙ్మయ స్వరూపం


- 1) గేయశాఖ
- 2) వచనశాఖ
- 3) దృశ్యశాఖ


1) గేయశాఖ


- 1) కథా విరహితము
- 2) కథాసహితము

## 1.1 ) కథా విరహితం


శ్రామిక గేయాలు
పారమార్థిక గేయాలు
కౌటుంబిక గేయాలు
శృంగార ప్రధానములు
హాస్య ప్రధానములు
కరుణ ప్రధానములు
మార్మిక గేయాలు
(Mystic Songs)
తాత్త్విక గేయాలు
(Philosophic Songs)
బంధుత్వ ప్రదర్శకములు
ఆచార ప్రదర్శకములు
(Ceremonious Songs)
పెద్దలకు సంబంధించినవి
పిల్లలకు సంబంధించినవి
క్రీడాత్మకములు
జోలపాటలు


1.2) కథా సహితం
శ్రామిక గేయాలు
స్త్రీల పాటలు
కొన్ని కులములవారు పాడునవి
(వృత్తిపరములు)
వ్రత కథలు
పౌరాణిక కథలు
వీరగాథలు
అద్భుతగాథలు
మతగాథలు
చారిత్రకగాథలు
స్త్రీసంబంధగాథలు
పురాణగాథలు
గ్రామదేవతల కథలు
స్పష్ట చారిత్రకములు
అస్పష్ట చారిత్రకములు



2) వచనశాఖ
కథా రహితం
కథా సహితం
పొడుపు కథలు
సామెతలు
నీతికథలు (Dialectics)
వీరకథలు (Epics)
అద్భుతకథలు (Fairy Tales)
పురాణకథలు (Myths)
కల్పితకథలు (Legends)
పెద్దరాశి పెద్దమ్మ కథలు (Fables)


3) దృశ్యశాఖ
మనుష్యులు ఆడు ప్రక్రియ
మనుష్యులు ఆడించు ప్రక్రియ
పగటి వేషాలు
వీధి నాటకం
యక్షగానం
తోలుబొమ్మలాట
చెక్కబొమ్మలాట

II. జి.యస్. మోహన్ వర్గీకరణ:

1) జానపద గేయాలు
- 1) పురుషుల పాటలు
- 2) స్త్రీల పాటలు
- 3) స్త్రీపురుషోభయులు
- 4) పిల్లల పాటలు

1) పురుషుల పాటలు
- భావోద్వేగాలు
- ధార్మికాలు
  - వలపు పాటలు
  - హాస్యపు పాటలు
  - కన్నీటి పాటలు
- క్రియాన్వితాలు
  - మత సంబంధాలు
  - పారమార్థికాలు
- వినోద సంబంధాలు
  - శ్రామిక గీతాలు
  - క్రీడా గీతాలు
  - నృత్య గీతాలు


2) స్త్రీల పాటలు
లాలి పాటలు, జోల పాటలు
వేడుక పాటలు
భక్తి పాటలు
శ్రమజీవనపు పాటలు
(శ్రామిక స్త్రీల పాటలు)
సమర్త పాటలు
పెండ్లి పాటలు
సీమంతపు పాటలు
మేలుకొలుపులు
పూజ పాటలు
మంగళహారతులు
ఇంట్లో పాడేవి
బయట పాడేవి
విసుర్రాతి పాటలు, దంపుడు పాటలు
నాటు పాటలు, కలుపు పాటలు

3) స్త్రీ పురుషోభయుల పాటలు

- భావోద్వేగాలు
- ధార్మికాలు
  - వలపు పాటలు
  - హాస్యపు పాటలు
  - కన్నీటి పాటలు
- క్రియన్వితాలు
  - మత సంబంధాలు
  - పారమార్థికాలు
- వినోద సంబంధాలు
  - శ్రామిక గీతాలు
  - క్రీడా గీతాలు
  - నృత్య గీతాలు

4) పిల్లల పాటలు

- తల్లులు పిల్లల కోసం పాడే పాటలు
- పిల్లలు తమ కోసం పాడుకొనే పాటలు

# అధ్యాయం–3

# డిండి మండల జానపద జీవనం

## 3.0. ఉపోద్ఘాతం:

జానపదుల జీవన విధానం గురించి తెలుసుకునే ముందు జానపదులు అంటే ఎవరో తెలుసుకుందాం. జనపదాలలో నివసించేవారు 'జనపదులు' లేదా 'జానపదులు'. వారి జీవనానికి సంబంధించిన గేయాలు, కథలు, సామెతలు, భాష, నమ్మకాలు, ఆచారాలు, దుస్తులు, ఆటలు, కళలు, వైద్యం మొదలైనవన్నీ జానపద విజ్ఞానంలోని భాగాలు. ఈ జానపద విజ్ఞానానికి ఆంగ్లంలో సమానార్థకం 'ఫోక్ లోర్' (Folklore). ఈ పదాన్ని విలియం జాన్ థామ్స్ (William John Thoms) 1846 సం॥లో రూపొందించాడు. జానపదులకు చెందిన ఆచారాలు, నమ్మకాలు, కథా గేయాలు, సామెతలు మొదలైన విజ్ఞానమే "ఫోక్ లోర్" అని థామ్స్ నిర్వచించాడు. ఈయన దృష్టిలో 'Folk' అంటే నిరక్షరాస్యులైన జనపదులు, 'Lore' అంటే అక్షరజ్ఞానం లేని పల్లె ప్రజల సాంప్రదాయ విజ్ఞానం. ఈ విధంగా జానపదుల్ని నిర్వచించడం వల్ల "ఫోక్" అన్న పదానికి అర్థం ఒక కుటుంబమైనా కావచ్చు, ఒక దేశమైనా కావచ్చు. జానపదులను ఆధునిక దృక్పథంతో నిర్వచిస్తే సమాన సాంప్రదాయాలు కలిగిన ఆటవికులైన, గిరిజనులైన, గ్రామీణులైన, నగరవాసులైన జానపదులే అవుతారు.

ప్రతి మనిషి తన జీవనోపాధికోసం ఏవో పనులలో నిమగ్నం కావలసి ఉంటుంది. ఉత్పత్తిని సాధించడంలో శ్రమ విభజించబడుతుంది. చేసే పనిని బట్టి వృత్తులు ఒక్కొక్క వృత్తి వారిలో ఒక్కొక్క రకమైన ఆచార వ్యవహారాలు ఏర్పడి, అవే ఆయా కుల సాంప్రదాయాలుగా నిలిచిపోతాయి. డిండి మండలంలో ప్రధాన వృత్తియైన వ్యవసాయంతోపాటు వడ్రంగి, కమ్మరి, కుమ్మరి మొదలైన కులవృత్తులు కన్పిస్తాయి.

## 3.1. కుటుంబ వ్యవస్థ:

డిండి మండలంలో మిశ్రమ కుటుంబ వ్యవస్థ కనిపిస్తుంది. గతంలో కనిపించిన ఉమ్మడి కుటుంబాలు నేడు కనిపించడం లేదు. పెళ్ళైన కొత్త జంటలు అని కూడా తమకు పిల్లలు పుట్టగానే వేరు కాపురం పెట్టడం అధికంగా ఉన్నది. ఈ పరిస్థితిని అన్నదమ్ములు

ఎక్కువగా ఉన్న కుటుంబాలలో అధికం. ఒక్క కొడుకు ఉన్న కుటుంబాలు తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు.

పెళ్ళి జరిగే సమయంలో వధువునుంచి వరుడు కట్నం తీసుకునే పద్ధతి కొనసాగుతుంది. ఈ కట్నం ధనరూపంలో, భూమిరూపంలో, వాహనరూపంలో, బంగారంరూపంలో ఉంటుంది. ఈ వరకట్న సమస్య కారణంగా పేదకుటుంబాలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. పెళ్ళిళ్లు ఎక్కువగా మేనరికం మరియు దగ్గరి బంధువుల సంబంధాలను చేసుకోవడం అలవాటు.

కుటుంబ ఆచారాల విషయానికొస్తే ఇంటి దేవతలను కొలవడం అనే ఆచారం చాలా ప్రముఖంగా ఉంది. మైసమ్మ, ఎల్లమ్మ, పోచమ్మవంటి గ్రామదేవతలను ఇంటిదేవతలుగా కొలుస్తుంటారు. పండుగల సమయాల్లో ఇంటి ఆడబిడ్డలను ఆహ్వానించి వారికి ఒడిబియ్యం పోసి, బట్టలు పెట్టి, కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకోవడం ఆచారంగా వస్తుంది. ప్రతి ఇంటి ఆచారంలో మేనరికానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం కనిపిస్తుంది.

### 3.2. ఆహారపు అలవాట్లు:

డిండిమండలంలో ప్రజలు వరిఅన్నం, కూరగాయ వంటలు, మాంసాహారం వంటి సామాన్య ఆహారపు అలవాట్లను కలిగిఉన్నారు. శ్రామికజనం కూరల్లో కారం ఎక్కువగా వాడడం కనిపిస్తుంది. బ్రాహ్మణులు, వైశ్యులు మినహా మిగిలిన కులాల ప్రజలందరూ అన్ని రకాల మాంసాహారాలను తీసుకుంటున్నారు. గ్రామంలోని శ్రామికప్రజలు రోజుకు ఒక కూర, పెరుగు లేదా మజ్జిగతో సరిపెట్టుకుంటున్నారు. కొద్దిగా ధనం కలిగిన కుటుంబాలలో రెండు కూరలు, పప్పు, రసం, పెరుగును తమ ఆహారంలో తీసుకుంటుంటారు.

డిండి మండలంలోని లంబాడీతెగ కుటుంబాలలో జొన్నరొట్టె, గోధుమరొట్టె తీసుకోవడం కనిపిస్తుంది. వీటిని వీరు అన్నంతో కలిపి తీసుకోవటం జరుగుతుంది. ఇక అన్ని కులాల ప్రజలు ఆవకాయను విరివిగా తీసుకోవడం జరుగుతుంది. మామిడికాయ, చింతపండు, టమాట, ఉసిరికాయ, మిరపకాయలతో చేసిన ఆవకాయలను పని దినాలలో అధికంగా వాడుతుంటారు. మాంసాహారంతో కోడిమాంసం, పచ్చిచేపలు, మేకమాంసంతో పచ్చళ్లు పెట్టడం జరుగుతుంది.

ఇక పానీయాల విషయానికి వస్తే మండలంలో తాటికల్లు ఉత్పత్తి అధికంగాఉంది. ఈత కల్లు కొన్ని గ్రామాలలో లభ్యం అవుతుంది. అన్ని కులాలకు చెందినవాళ్లు కల్లును ఉదయం సాయంత్రం పానీయంగా తీసుకునే అలవాటు ఉంది. దీనిని మత్తుపానీయంగా కాకుండా ఆరోగ్య ప్రదాయినిగా స్వీకరించటం ఇక్కడి ఆనవాయితీ. ఇటీవల కాలంలో కిరాణషాపుల్లో దొరికే కూల్ డ్రింకులను (శీతలపానీయాలను) యువత ఎక్కువగా తీసుకుంటున్నారు. ఎండకాలంలో కొబ్బరి బొండాలు, నిమ్మ సోడాలు, పండ్ల రసాలు అధికంగా వాడుతుంటారు. పండుగ సమయాలలో అరిసెలు, బూరెలు, భక్ష్యాలు, పూరీలు, లడ్లు, కర్జా కాయలు, గారెలు (అప్పాలు) వంటి పిండి వంటకాలను అన్ని కుటుంబాల వారు చేసుకుంటారు. భోజనానంతరం తంబాకు తీసుకోవడం పాతతరం ముసలివారిలో కనిపిస్తుంది. తంబాకు, సున్నం, దర్జా, పొగాకు కలిపిన తాంబూలం తీసుకుంటారు. పండుగలు, పెళ్ళిళ్లలో మాంసాహారం, మద్యపానం తప్పనిసరిగా ఉంటుంది. మొత్తంగా చూస్తే ఈ మండల ప్రజలు భోజనప్రియులు అని చెప్పవచ్చు.

### 3.3. వ్యవసాయం:

డిండిమండలంలో అధికంగా మెట్టభూములు ఉన్నాయి. అవన్నీ వర్షాధారితమైనవి మరియు బోరుబావుల కింద పండే భూములు. మండలంలో "డిండి" నీటిపారుదల ప్రాజెక్ట్ ఉన్నా అధికంగా దిగువన ఉన్న మండలాలకు ఉపయోగకరంగా ఉంది. దీనివల్ల మండలంలో వ్యవసాయ బావుల ప్రాధాన్యతే అధికం.

ఇంక పంట విషయానికొస్తే అధికంగా వరి సాగు చేస్తున్నారు. ఇది మొత్తం అధికంగా బోరు బావుల కిందనే సాగవుతుంది. ఆ తర్వాత ప్రత్తిపంటను ఎక్కువగా సాగుచేస్తారు. ఈ మండలంలోని గ్రామాలలో ఈ రెండుపంటలే అధికంగా సాగుచేస్తారు. కందులు, వేరుశనగ, బత్తాయివంటి పంటలు  అక్కడక్కడ కనిపిస్తుంటాయి.

### 3.4. వృత్తులు:

**బ్రాహ్మణులు**:

వీరు జనాభాపరంగా అతి తక్కువగా గ్రామాలలో కనిపించినా, పెళ్ళి, పండుగలు మరియు దేవాలయ పూజా కార్యక్రమాల నిర్వహణతో అధిక ప్రాధాన్యం కలిగి ఉంటారు. ఇతర కులాలలో ఎలాంటి కార్యక్రమాలకైనా ముహూర్తాలు చూసే కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.

**కోమట్లు**:

వీరు కూడా బ్రాహ్మణుల మాదిరిగా తక్కువ జనాభా ఉన్నారు. వీరు నిత్యావసర సరుకుల వ్యాపారం చేస్తూ ప్రజల అవసరాలను తీరుస్తుంటారు. వీరు ఎక్కువగా మండల కేంద్రాలలో నివసిస్తుంటారు.

**గౌండ్లవారు**:

వీరు ప్రధానంగా కల్లుగీతపై ఆధారపడి జీవిస్తుంటారు. తాటిచెట్లు, ఈతచెట్లనుంచి కల్లును తీసి గ్రామీణ ప్రజానీకానికి అమ్ముతారు. వ్యవసాయంలోకూడా వీరు నేడు రాణిస్తున్నారు.

**మాల, మాదిగలు**:

వీరిలో మాల, మాదిగలు ఈ కులాల ఉపకులాలు ఉంటాయి. మాదిగలు (వృత్తి) గతంలో చెప్పులు కుట్టడం, పారిశుద్ధ్య పనులు చేసేవారు. మాదిగలు వ్యవసాయంలో నీటి వాడకానికై తోలుతో పనిముట్లను తయారు చేసేవారు. అలాగే నాగటితాళ్ళు, మోటతాళ్ళు మొదలైన వస్తువులను కూడా పేనిచ్చేవారు. వీరు ఎక్కువగా కాపులదగ్గర పశువుల కాపరులుగాను, జీతగాళ్ళగాను పనిచేస్తుంటారు. మాదిగ స్త్రీలు కాపుల ఇండ్లలో పనులు చేసేవారు.

మాలలు ప్రాచీనంలో ఎక్కువగా వ్యవసాయ కూలీలుగా జీవనం చేసేవారు. వీరు ఎక్కువగా పాలేర్లుగా పనిచేస్తారు. గ్రామాలలో కులాలనుబట్టి వాడలు ఉంటాయి. కావున మాల, మాదిగలకు వేర్వేరుగా వాడలు ఉంటాయి. వీరు ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మలను పూజిస్తారు. నాగరికత పెరుగుతున్న క్రమంలో ఈ కులాలలో మార్పువచ్చింది.

**తెలగ/ముదిరాజు** :

డిండిమండలంలో "డిండి ప్రాజెక్ట్" ఉండటంతో ఇక్కడ చేపల ఉత్పత్తి అధికంగా ఉంది. ఈ కులంవారు ఆయా కాలాల్లో పండేపండ్లను, కాయలను అమ్ముతుంటారు. వాటితోపాటు చేపలు, తేనె అమ్ముతారు. అడవంతా గాలించి అడవిలోని గుట్టలను, చెట్లను, పొదలను, తీగలను వెతికి పట్టుకుని రకరకాల పండ్లను దొరకబుచ్చుకుని తెచ్చి వాటిని అమ్మి జీవనం సాగిస్తుంటారు.

తెలగ కులం వృత్తి చేసుకునే విధంగా మరో కులం బెస్త కులం. వీరి ప్రధాన వృత్తి చేపలు పట్టటం. చుట్టు ప్రక్కల గ్రామాల్లోని చెరువులకు కొంత పన్ను చెల్లించి వాటిలో చేపలు పెంచుతారు. ఆ కాలపరిమితిలో చెఱువుల్లో ఇంకెవరిని చేపలు పట్టనివ్వరు. వానకాలంలో వేసిన చేపపిల్లలు  ఎండకాలంలో పట్టడానికి సిద్దంగా ఉంటాయి. చేపలను పట్టటానికి కొందరిని కూలీలుగా కూడా ఉపయోగించుకుంటారు. ఆ చేపల్ని పెద్దపెద్ద వలలతో పట్టి ఎండబెట్టి సంవత్సరమంతటా అమ్ముతుంటారు. చేపలు పట్టటమే కాక ఊరూరా తిరిగి కోళ్లను కొంటారు. అధిక ధరలకు వాటిని తిరిగి అమ్మి లాభాలను పొందుతుంటారు.

**గొల్ల /యాదవ**:

శ్రీకృష్ణుడు యాదవుల కులస్థుడు కాబట్టి గొల్లలను 'యాదవులు' అని అంటారు. ఈ మండలంలో యాదవ జనాభా తక్కువగానే ఉంది. వీరి ఆచారం ప్రకారం గొల్లస్త్రీలు తమ కొంగును కుడివైపుకు వేస్తారు. పురుషులు మోకాలి వరకు బుడ్డగోచి పెట్టుకొని, భుజాలపై గొంగడి వేసుకొని తలకి ఎర్రని రూమాలు కట్టుకొని జీవాలను మేపడానికి పోతుంటారు. వీరి ప్రధాన ఆస్తి గొర్రెలు, మేకలు. గొర్రెలను, మేకలను కలిపి జీవాలంటారు. రైతులు భూమిలో సారాన్ని పెంచేందుకు వీటి వ్యర్థాలను ఎరువుగా వాడతారు. గొల్లలు రైతుల భూముల్లోని పచ్చికతో జీవాలను మేపుతారు. వీరు గొర్రెలు, మేకలతోపాటు, పశువులను కూడా పెంచుతారు. వీరికి వ్యవసాయంతో కూడా పరిచయం ఉంది. వీరు వారి వారి పొలాల వద్దనే నివసిస్తూ ఉంటారు.

**గిరిజనులు :**

**లంబాడా**:

లంబాడీలు డిండి మండలంలో అధిక జనాభా కలిగి ఉన్నారు. లంబాడీలు గిరిజన తండాలలో నివాసముంటున్నారు. వీరు వ్యవసాయాన్నే ప్రధాన జీవనాధారంగా కలిగి ఉన్నారు.

ఎరుకల : డిండిమండలంలో ఎరుకలతెగకు చెందినవారు ఊరికి ఒకటి రెండు కుటుంబాల వారు ఉంటారు.

## 3.5. కులాలు:

డిండి మండలంలో ప్రధానమైన కులాలు రెడ్లు, కాపులు, కోమట్లు, లంబాడీలు, వెలమలు. వీరిలో రెడ్డికులం వారు మండలం మొత్తం వ్యాపించి ఉన్నారు. డిండిమండలంలో సుమారు 24 కులాలవారు ఉన్నట్లు తెలుస్తుంది. అవి: 1). ముదిరాజ్ (తెలుగోళ్ళు), 2). లంబాడీలు, 3). గౌండ్లు, 4). చాకలివాళ్లు, 5). కటికవాళ్లు, 6). పూసలవాళ్లు, 7). దాసరివాళ్లు, 8). జంగాలు/బుడిగ, 9). కుమ్మరి, 10). కమ్మరి, 11). బలిజ, 12). వెలమ, 13). మాల, 14). మాదిగ, 15). బ్రాహ్మణులు, 16). వడ్డెర, 17). పద్మశాలి, 18). దూదేకుల, 19). తురకలు, 20). రెడ్లు (కాపులు). 21). కోమటివాళ్లు, 22). కోతులోల్లు, 23). గొల్లవాళ్లు ఉన్నారు. పై కులాల వాళ్లలో ఎక్కువమంది ఇతరకులాలకు వెనుకబడిన కులాలకు చెందినవారు ఎక్కువమంది ఉన్నారు. షెడ్యూల్డ్ కులాలలో మాల, మాదిగలు, జంగాలు ఉన్నారు, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించి గిరిజన కులాలుగా లంబాడీలు, ఎరుకల తెగలవారున్నారు.

## 3.6. మతాలు:

ఈ మండలంలో హిందూమతం అత్యధికంగా ఉంది. మొత్తం జనాభాలో 90% హిందువులు, 2% క్రైస్తవ మతస్థులు, 8% ముస్లిం మతస్థులు. మరియు బౌద్ధ మతస్థులు చాలా స్వల్పంగా ఉన్నారు.

హిందూమతం తరువాత చెప్పుకోదగ్గ మతం ఇస్లాంమతం. ఈ మతస్థులనే ముసల్మానులని, తురకలని అంటారు. వీళ్ళలో ముఖ్యమైన కులాలు షేక్, సయ్యద్, మహ్మద్

లు. దూదేకుల కులం షేక్ కులంలోని ఉపకులం. ఈ కులంవాళ్లు ఇస్లాం సాంప్రదాయాన్ని, హిందూసాంప్రదాయాన్ని రెండింటిని పాటిస్తారు. ఇస్లాం మతానికి ప్రత్యేకమైన భాష ఉర్దూ. ఈ మండలంలో క్రైస్తవమతం కూడా గుర్తించదగినదే. చాలావరకు క్రైస్తవులు హిందూమతస్థులుగానే ఉంటూ మతమార్పిడి చేసుకున్నవారే.

### 3.7. భాష:

డిండిమండలంలో ప్రధానంగా మాట్లాడేభాష తెలుగు. 90% ప్రజలు ఈ భాషనే మాట్లాడుతారు. దీనితోపాటు లంబాడ, ఉర్దూ, హిందీ, ఎరుకల వంటి భాషలు కూడా వ్యవహారంలో ఉన్నాయి.

### 3.8.0. జానపదులు ఆచారాలు:

మానవుని సాంఘికాచారాలు ప్రతికులంలోను, ప్రతిమతంలోను, ప్రతిసమాజంలోను తప్పనిసరిగా ఉంటాయి. ఆచారాలు అనేవి ఒక తరంనుంచి మరొక తరానికి మార్పు చెందుతుంటాయి. ఉపయోగకరమైన ఆచారాలు కాలాన్నిబట్టి అభివృద్ధి చెందుతూ, పలుప్రాంతాల్లో విస్తరిస్తూ కొన్ని రకాలైన మార్పులకు లోనవుతూ ఉంటాయి. మతంతో జోడిస్తే ఏ ఆచారమైన ఎక్కువకాలం నిలబడటానికి ఆస్కారముంటుంది. అందుకనే ఆచారాలు ఎక్కువశాతం మతంతో ముడిపడి ఉంటాయి. ఈ ఆచారాలు అనేవి ఒక కాలంలో, ఒక సమయంలో చేసేవి కావు. మానవుని పుట్టుక మొదలు మరణించే వరకు, మరణించిన తరువాత జరిగే కర్మకాండలు అన్ని కూడా జానపద ఆచారాల్లో అంతర్భాగాలే. వీటిలో ముఖ్యమైనవి.

1) కౌటుంబిక ఆచారాలు
2) సాంఘిక ఆచారాలు
3) మత ఆచారాలు

ఇందులో మొదటి విభాగమైన జానపదుల కౌటుంబికాచారంలో ప్రతి ఇంట జరిపే వేడుకలన్నీ భాగమౌతాయి. పుట్టుక, పెండ్లి, చావు సంబంధంగా ఆచరించే ఆచారాలు, అలాగే కుటుంబపరంగా చేసుకునే పండుగలు, నోములు వ్రతాలు ఇవన్నీ కౌటుంబిక వ్యవస్థలో భాగమౌతాయి. రెండవ విభాగమైన సాంఘికాచారాల వర్గంలో జానపదుల

నమ్మకాలు, మూఢ విశ్వాసాలు ఒక వర్గంగాను, రెండవ వర్గంగా కులపరంగానూ, గ్రామపరంగానూ, ప్రాంతపరంగాను చేసే ఉత్సవాలు, జాతర్లు, పండుగలను చెప్పవచ్చు. మతాచారాలుగా హిందువులు హిందూపండుగలను, ఇస్లాం మతస్థులు మహమద్ ప్రవక్త సంబంధ పండుగలను, క్రైస్తవులు ఏసుక్రీస్తు సంబంధ పండుగలను పాటిస్తుంటారు. ఏ కులస్థులైనా కులసంబంధ ఉత్సవాలలో వారికివారు చేసుకుంటారుగానీ మత సంబంధ వేడుకలను మాత్రం సమైక్య దృక్పథంతో అందరూ కలసిమెలసి చేసుకోవడం కన్పిస్తుంది.

### 3.8.1. డిండి మండలంలోని జానపద సాంఘికాచారాలు:

పుట్టుక, కానుపు, పురుడు, సమర్త, పెండ్లి, చావు మొదలైన సందర్భాల్లో డిండిమండల జానపదులు పాటించే ఆచారాలు.

### 3.8.2. పుట్టుక:

స్త్రీకి మాతృత్వం అనేది ఒక వరం. స్త్రీ గర్భిణీగా ఉన్న సమయంలో ఆ స్త్రీ ప్రసవవేదన అనుభవించే సమయంలో, ప్రసవించిన స్త్రీకి సంబంధించిన ఆచారాలు జానపదసంస్కృతిలో భాగమై ఉంటాయి. గర్భిణీగా ఉన్న స్త్రీకి ఆమె కోరుకున్న ఆహారాన్ని, వినోదాల్ని సమకూర్చడం జరుగుతుంది. కారణం తల్లి సంతోషంగా ఉంటే గర్భంలో ఉన్న బిడ్డ ఆనందంగా ఉంటుందని జానపదుల నమ్మకం.

మొదటిసారి గర్భం దాల్చిన యువతికి కొత్త అనుభూతులతోపాటు ఆందోళనలు ఉండటం సహజం. స్త్రీకి ప్రసవం పునర్జన్మలాంటిదే. అందుకే అత్తవారింటికి కొత్తగా వచ్చిన వ్యక్తి కనుక ప్రసవానుకూలమైన వాతావరణం ఉండదేమోనని భావిస్తారు. అందుకు అనుగుణంగా ప్రథమ కానుపు పుట్టినింటిలో జరపడం మంచిదనేది జానపదుల విశ్వాసం. అందువల్ల డిండిమండల జానపదులు తమ ఆడబిడ్డల మొదటి కానుపు పుట్టినింటిలోనే జరిపే ఆచారాన్ని పాటిస్తారు.

భార్య గర్భిణీగా ఉన్న సమయంలో భర్త కూడా ఆచారాలు తప్పక పాటించవలసి ఉంటుంది. పాము, పిల్లి వంటి ప్రాణులను చంపకూడదు. ఎవరైనా మరణించినప్పుడు దహన సంస్కారాలలో పాల్గొనకూడదు. అంటే పాడె మోయడం గాని, అంతిమ సంస్కారాల్లో పాల్గొనడం గాని, పెద్ద కర్మలాంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం గాని చేయరాదు. ఈ విధి విధానాలను తప్పనిసరిగా భర్తలు పాటించవలెననే ఆచారం నేటికీ ఉంది.

గర్భవతిగా ఉన్న మహిళ తోరణాలు కట్టిన గుమ్మంద్వారా గృహప్రవేశం చేయరాదు. మరణించిన వ్యక్తుల పార్థివ దేహాన్ని ముట్టుకోరాదు. నలుగులు, పేరంటాలు, వ్రతాలు మొదలైన పేరంటాళ్ల ఉత్సవాలను నిర్వహించడం గాని, పాల్గొనడం గాని చేయరాదు.

### 3.8.3.కానుపు:

గర్భం దాల్చిన స్త్రీ ఎనిమిది నెలలు పూర్తి అయిన తర్వాత గాని తొమ్మిది నెలలు నిండిన తర్వాత  బిడ్డ ప్రసవించడం సర్వ సాధారణం. ఈ సంఘటననే కానుపు (కాన్పు) అంటారు. కనుట అనే పదం ద్వారా కాన్పు అనే పదం ఉత్పన్నమయ్యింది.  ప్రసవ సమయంలో ఎంతకీ ప్రసవం కాకపోతే టెంకాయతో దిష్టి తీస్తారు. దిష్టి తీసిన టెంకాయను బయట కొట్టి వస్తారు. గర్భిణీ స్త్రీ తన అల్లకం లేని జడతో తనంతకు తానే మూడుసార్లు దిగదీసుకోవడం ద్వారా ప్రసవం తొందరగా జరుగుతుందని నమ్ముతారు.

ప్రసవ సమయంలో జానపద గర్భిణీ స్త్రీలు మంత్రసాని సహాయాన్ని కోరతారు. కాన్పు చేయడానికి సహకరించే మహిళను 'మంత్రసాని' అంటారు. ప్రసవం చేయించడంలో మంత్రసానులు మంచి నైపుణ్యం కలిగిఉంటారు. ఇలాంటి మంత్రసానులు కనీసం ఊరికి ఒకరిద్దరు ఖచ్చితంగా ఉంటారు. మంత్రసానులు ఇచ్చే సూచనలను గర్భిణీ స్త్రీలు తప్పకుండా పాటిస్తారు.

పుట్టిన వెంటనే బిడ్డను ప్రక్కన పడుకోబెట్టడం, తల ఒత్తడం, బిడ్డ మోహాన నీళ్లు చల్లడం, మాయను సుదూరంగా తీసుకెళ్లి పూడ్చడం లాంటివి మంత్రసానులు చేసే పనులు. మాయను బయట ఎక్కడైనా పారవేస్తే కుక్కలు తీసుకు వెళతాయని మాయను పూడ్చే ఆచారాన్ని అనుసరిస్తారు. బిడ్డ పుట్టగానే మోహాన నీళ్లు కొట్టడం మంత్రిసాని పనే. పుట్టిన బిడ్డడకు బొడ్డు కోయడం కూడా మంత్రసాని పనే.  కోసిన బొడ్డును తల్లి పుస్తెలతాడుకు కట్టి ఉంచుతారు. 11 వ రోజున పురిటిస్నానం వేళ దానిని తీసి ఇంటి ఆవరణలో భూమిలో పూడ్చి గుర్తుకు ఒక బండరాయిని దానిపై ఉంచుతారు. స్నానానంతరం బాలింతకు నడుము చుట్టూ గట్టిగా గుడ్డ కడతారు. అంటే భవిష్యత్తులో ఆ మహిళకు పొట్ట ఎత్తుగా రాకుండా ఉండటానికి ఆచారాన్ని జానపదులు పాటిస్తారు.

ఒకప్పుడు ప్రసవం ఇంటి వద్ద జరిగేది కాబట్టి పైన చెప్పిన ఆచారాలు పాటించేవారు. నేటికాలంలో ప్రసవం తప్పనిసరిగా వైద్యశాలలో మాత్రమే జరిపిస్తున్నారు. కాబట్టి పైన

చెప్పిన జానపద ఆచారాలను అనుసరించడం లేదు. చాలామంది నల్గొండ జిల్లా డిండి మండల పరిసర ప్రాంతంలోని జానపదులు ప్రసవ సమయానికి వైద్యశాలలో ప్రసవం చేసుకున్నా అవసరమైన సామాగ్రిని తీసుకెళ్లి కాన్పు సమయంలో తమ ఆచారాలను తప్పనిసరిగా అనుసరించడం కూడా అరుదుగా గమనించవచ్చు.

ప్రసవానంతరం తల్లి బిడ్డని ఇద్దరిని వేడిగా ఉండే గదిలో ఉంచుతారు. చెవుల్లో దూది ఉంచడం, మరియు చెవుల మీదుగా తలకు గుడ్డకట్టడం (మఫ్లర్) లాంటివి చేస్తారు. గర్భిణీ స్త్రీ తన ప్రసవానంతరం విధిగా చెప్పులు వేసుకొని తిరిగటం లాంటివి చేస్తారు. ఇవన్నీకూడా ఆ స్త్రీ చలికి లోనుకాకుండా చేసే ఆచారాలన్ని జానపద ఆచారాలే. వైద్యంతో కూడుకున్న ఆచారాలే. పుట్టిన బిడ్డకి స్నానానికి ముందు ఆముదంనూనెతో బిడ్డశరీరాన్ని రుద్దుతారు. దీనివలన ఎముకలు గట్టిపడటానికి, బిడ్డ పెరుగుదలకు ఉపయోగపడుతుందన్న నమ్మకం. స్నానానంతరం సాంబ్రాణి పొగ వెయ్యడం చేస్తారు. సాంబ్రాణిపొగ వేడివలన బిడ్డకు తలస్నానం చేయించినా తలవెంట్రుకలు త్వరగా అరిపోతాయి. అంతేకాక స్నానానంతరం ఆడపిల్లఅయినా, మగపిల్లవాడైనా ఇరువురికి నొసటన నల్లటిబొట్టు(కాటుక) పెడతారు. ఎడమ అరికాలిలో, ఎడమ చేతిలోకూడా నల్లనిబొట్టు పెడతారు. ఎందుకంటే బిడ్డకు దృష్టిదోషం తగలకుండా కాపాడుతుందని జానపదుల విశ్వాసం. నొసటన బొట్టుపెట్టే సమయంలో తల్లి తప్పనిసరిగా జోలపాట పాడుతుంది. ఆ జోలపాట ఈ విధంగా నల్గొండజిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వినిపిస్తుంది.

**జో ళు ళు ళు ళు ళు ళు ళు ళు ళు ళు హాయీ.....**
**బూసోడు రారా బుట్టలల్లుకోరా.....**
**ఆ బుట్టలో మా అబ్బాయిని (అమ్మాయిని)**
**ఎత్తుకొని పోరా.....**
**జో ళు ళు ళు ళు ళు ళు ళు ళు ళు ళు హాయీ..... నసరమ్మ: ప్రతాప్నగర్**

ఇలా తల్లిపాడుతూ ఉంటే తల్లి నోటిలోని నాలుక ళు ళు ళు ళు ళు ళు ళు ళు ళు ళు అని అంటున్న సమయంలో మెలికలు తిరుగుతుంటుంది. అప్పుడు నాలుకను బొమ్మలా భావించిన బిడ్డ ఆ నాలుకపై మనస్సు కేంద్రీకరించి కదలకుండా ఉండిపోతుంది. అప్పుడు తల్లిబిడ్డకు నొసట సులభంగా బొట్టు, కాటుక పెట్టడానికి సాధ్యం అవుతుంది. కాటుక కండ్లకు

అందాన్ని, చలువను ఇస్తుంది. ఈ విధంగా పుట్టుక సమయంలో, పుట్టుక అనంతరం తల్లిబిడ్డలకు వివిధ రకాలైన ఆచారాలను జానపదులు చేస్తుంటారు. ఇవన్నీ కూడా తల్లిబిడ్డకు ఆరోగ్యానికి ఉపకరించే ఆచారాలుగా కనిపిస్తుంటాయి.

### 3.8.4. రజస్వల :

డిండి మండలంలో స్త్రీ యొక్క ప్రథమ ఋతువును "సమర్త" అంటారు. సమర్త అంటే తొలిసారి "ఋతు" అయిన బాలిక. నల్గొండ జిల్లా డిండి మండల జానపదులు బాలిక ఎదిగిందని, పెద్దమనిషి అయ్యిందని వ్యవహారిస్తారు. ఎదిగింది అని అంటే బాలిక వివాహానికి అర్హురాలు అయ్యిందని అర్థం.

జానపదుల సంప్రదాయంలో సాధారణంగా మూడు లేదా ఐదు రోజులు సమర్త అయిన బాలికను ఒక ప్రత్యేక గదిలో ఉంచుతారు. ఆ గదిలో నేల మీద ఈత చాప పరచడం, దానిపై తెల్లని వస్త్రం, ఆ వస్త్రానికి నలువైపుల పసుపు రాసి తాంబూలం ఉంచుతారు. చాప కింద వస్త్రంపై మంగళ స్నానం చేయించేవరకు కూర్చోవడం, పడుకొని నిద్రపోవడం సమర్త అయిన బాలిక విధి. పెద్ద మనిషి అయిన సమయంలో సదరు బాలిక పూజా కార్యక్రమాలు నిర్వహించరాదు. సమర్త అయిన బాలిక మూడవ లేదా ఐదవ రోజు మంగళ స్నానం చేయిస్తారు. ఋతువయిన బాలికపై దుష్ట శక్తుల ప్రభావం చూపుతాయని, భవిష్యత్తులో ఆమెను సంతానోత్పత్తికి అనర్హురాలిగా చేస్తాయనే భయంతో నల్లని మసిబొట్టు పెడతారు. ఇంటి గడప దగ్గర ఒక కుండలో ఎండిన పేడతో పొగ వేస్తారు. ఇందువల్ల చెడు క్రిమికీటకాలు దరిచేరవని నమ్మకం. డిండి మండల జానపదులలో నివసించే చాకలి, కమ్మరి, కుమ్మరి, కాపు, మాల, మాదిగ, గౌండ్ల, యాదవ కులాల వారి కుటుంబాలలో సమర్తకు సంబంధించిన ఆచారాలు అన్ని ఒకే విధంగా ఉన్నాయి. డిండిమండల జానపద కుటుంబాల్లో నేటికి కూడా సమర్తకు సంబంధించిన వేడుకలను వివిధ ఆచారాలను జరుపుకుంటుంటారు.

### 3.8.5. వివాహం:

జానపదులు ఆచార వ్యవహారాలకు సంబంధించి వివాహంలో అనేక ఉపఘట్టాలున్నాయి. పెండ్లిచూపులు, నిశ్చితార్థం, ప్రధానము, వివాహం, అప్పగింతలు అనే ఉపఘట్టాలు వివాహానికి సంబంధించిన జానపద ఆచార వ్యవహారంలోకి వస్తాయి.

### 3.8.6. పెండ్లిచూపులు:

వివాహానికి సంబంధించి పెండ్లిచూపులు మొట్టమొదటి కార్యక్రమం. యుక్తవయస్సు వచ్చిన స్త్రీ పురుషులకు వివాహం చేయాలనే కోరిక ప్రతి తల్లిదండ్రులకు ఉండటం సహజం. అమ్మాయి తరుపువారు కాని అబ్బాయి తరుపువాళ్లు కాని వారికులాలకు, వారిమతాలకు సంబంధించిన వారికోసం వెదకటం ప్రారంభిస్తారు. అందుకోసం ముందుగా నమ్మకమైన బంధువులకు, స్నేహితులకు తెలియజేస్తారు. కొన్నికులాలలో గోత్రం, నక్షత్రం, రాశికూడా చూసి ఆయా నక్షత్రం, రాశిఫలాలు ఇరువురికి అనుకూలంగా కలిసినపుడు పెండ్లిచూపులు ఏర్పాటు చేయడం ఆచారం. పెండ్లిచూపులు పెండ్లికుమార్తె ఇంట్లోనే జరుగుతాయి. అనంతరం ఇరువురికి ఇష్టమైతే కుల పెద్దల సమక్షంలో కట్నకానుకలు మాట్లాడుకొని నిశ్చితార్థ కార్యాక్రమం మంచిరోజు చూసుకొని పెట్టుకుంటారు.

### 3.8.7. నిశ్చితార్థం:

నిశ్చితార్థ కార్యక్రమం దాదాపు వధువు ఇంట్లో జరుగుతుంది. వరుడి తరుపువారు వధువుకు పట్టుచీర, రవికతోపాటు గాజులు, కుంకుమ, పూలు, పండ్లు తెచ్చి వధువుని అలంకరించుతారు. అదే విధంగా వధువు తరుపువారు వరునికిచ్చే కొత్త బట్టలతో వరుడ్ని అలంకరించి వరుడ్ని, వధువు తరుపున బంధువుల సమక్షంలో కూర్చోబెట్టి వధువు తరుపువారు వరుడికి వరుడు తరపువారు వధువుకి వివాహ సమయంలో ఇవ్వవలసిన మర్యాదల గురించి బంధుమిత్రుల సమక్షంలో చర్చించుకోవటం జరుగుతుంది. ఆ తరువాత పురోహితుడు (అయ్యగారు) ద్వారా వివాహానికి అనువైన ఘడియలు తెలుసుకొని ఫలానా రోజు ఫలాన ముహూర్తానికి వివాహం జరుపుకొనుటకు నిశ్చయం చేసుకుంటారు. ఈ కార్యక్రమాన్నే 'నిశ్చితార్థం" అని అంటారు. ఒక మంచిరోజు చూసుకుని పెండ్లిపత్రికలను ముద్రిస్తారు. ముద్రించిన పెండ్లిపత్రికలకు వరుడు, వధువు తరుపు వారు నాలుగు మూలలా పసుపు రాసి వాటిని ముఖ్యమైన బంధువులకు గ్రామస్థులకు మిత్రులకు పంచి ఆహ్వానం పలుకుతారు.

**పెండ్లి పనులు :**

డిండిమండలంలో ప్రధానం నాటికే వరుడు, వధువు ఇంటిముందలి ప్రాంగణంలో ఆకులతో పందిర్లు వేయటం, మామిడాకులను తోరణాలుగా కట్టడం, ఇండ్లకు సున్నం,

రంగులు వేసి ఎర్రమన్నుతో ఎర్రగా అలికి, ఇంటి పరిసర ప్రాంతం అంత ముగ్గులు వేసి, ఐదుగురు ముత్తైదువులను పిలిచి వారిచే బియ్యం చేయించడం, పెండ్లి జరిపించే సమయంలో కావలసిన సరంజామా నంతటినీ అవసరానుగుణంగా అందుబాటులో ఉంచుతారు.

### 3.8.8. ప్రధానం:

వివాహానికి ముందు రోజు పెండ్లికుమార్తె ఇంట్లో జరిగే ముఖ్యమైన కార్యక్రమం ప్రధానం. వరుడికి సంబంధించినవారు కొంతమంది కలిసి వధువు ఇంటికి వస్తారు. పెండ్లి కుమార్తెకు పట్టుచీర, పట్టు రవిక, గాజులు, బొట్టు, కాటుకతోపాటు కొన్ని ముఖ్యమైన ఆభరణాలను పెట్టెలో పెట్టుకొని పెండ్లికూతురు ఇంటికి వస్తారు. అప్పుడు పెండ్లికూతురు తరుపువారు ఆ 'ప్రధానం పెట్టె'ను చీరజాకెట్టును వధువుకు తొడిగి అక్కడున్న పందిట్లో అందరి ముందు కూర్చోబెట్టి ప్రధానం జరుపుతారు. అనంతరం వధువు కుటుంబీకులు తమ బంధుజనంతో కలసి వరుడు తరుపున వచ్చిన వారందరికి భోజనాలు ఏర్పాటు చేస్తారు.

### 3.8.9.పెండ్లి:

ఇది వివాహ ఘట్టంలో అత్యంత ప్రధానమైంది. పెండ్లి అనేది ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా, అలాగే కొన్ని కులాలలో మాత్రం వధువు ఇంటి దగ్గర లేదా వరుడి ఇంటిదగ్గర జరుపుతారు. పెండ్లికి ముందు వధువు, వరుడు కూర్చునే పీటలను వడ్రంగి వారిచే కొత్తగా చేయించి వారి ఇంటినుండి గౌరవపరంగా తీసుకువస్తారు. పెండ్లిపీటలను చేసినందుకుగానూ వడ్రంగిని గౌరవిస్తూ తాంబూలం సమర్పిస్తారు. కుమ్మరివారి ఇంటినుండి అవిరేణి కుండలు తీసుకొని వస్తారు. అవిరేణి కుండలు తీసుకు వచ్చేముందు ఇంటి ఆడపడుచు కర్తగానూ ఇతర బంధు జన సమూహంతో ఊరి మధ్య ఎంపికచేసుకున్న స్థలంనుండి మేళతాళాలతో ఊరేగింపుగా అవిరేణి కుండలను వివాహ వేదికపైకి తీసుకువచ్చి పూజలు నిర్వహించి కుదుర్లమధ్య పెడతారు. అలాగే కంసాలి (అవసాలి) ఇంటినుండి తాళిబొట్టును కూడా అవసాలికి తాంబూలంగా రెండు శేర్ల బియ్యం, బట్టలు, పసుపు కుంకుమలు, కుడుకలు, డబ్బు సమర్పించి తీసుకొస్తారు. పెళ్లిపీటలపై వధూవరులను కూర్చోబెట్టి తాళికట్టే సమయం వరకు వధూవరులిరువురు ఒకరి నొకరు చూసుకోకుండా ఇద్దరి మధ్య ఒక పంచెను తెరగా ఉంచుతారు. తాళికి ముందే బెల్ల, జీలకర్ర కార్యక్రమం, మేనమామ వధువుకు మెట్టెలు తొడిగించే కార్యక్రమం జరుగుతుంది. ఇవన్నీ జరిగిన తరువాత నిర్ణయించిన ముహూర్తానికి లగ్నం జరుపుతారు. మాంగళ్య ధారణ అనంతరం

కొంగుముడులు, బియ్యం పోసుకోవడం, ఆశీర్వచనాలు అందుకోవడం జరుగుతుంది. అనంతరం అరుంధతీ నక్షత్ర సందర్శనతో పెండ్లితంతు పూర్తి అవుతుంది. విందు వినోదాలు జరుగుతాయి. పెండ్లి వేడుక ముగిసిన తర్వాత వధూవరులు పెండ్లి కొడుకు ఇంటికి పయనమవుతారు. దీనినే అప్పగింతలు అంటారు.

### 3.8.10. అప్పగింతలు :

అప్పగింతలవేళ ఆడపిల్లకు ఒడిబియ్యం పోస్తారు. బంధువులందరి సమక్షంలో ఈ కార్యక్రమం విశేషంగా వేడుకగా భారమైన హృదయాలతో నిర్వహిస్తారు. ఆడబిడ్డను అత్తవారి ఇంటికి పంపడంలోని ఔచిత్యానికి ఈ వేడుక నిదర్శనంగా ఉండటం నేటికీ ఈ ప్రాంతవాసులు దీనిని క్రమం తప్పక పాటిస్తూ ఉండటం ప్రత్యేకం. తెలంగాణ ప్రాంతంలో ఒడిబియ్యం పోయించుకోవటం అనే వేడుక కార్యక్రమం ప్రతి ఇంటా జరగటం ఈ ప్రాంత వైశిష్ట్యాన్ని ఎరుకపరచే అంశం. పెండ్లి వేడుక జరిగిన పదహారు రోజులవరకు పెండ్లికూతురు పెండ్లికొడుకు ఆటుఇటు అత్తారిండ్లకు పయనమౌతూ వస్తూపోతూ ఉంటారు. పదహారురోజులవరకు పెండ్లిపందిరికూడా కదిలించరు. ఈ పదహారు రోజులపాటు సమీప బంధువులు వారి ఇండ్లలో నూతన వధూవరులకు విందుఏర్పాట్లు చేసి కానుకలు సమర్పించుకుంటారు. ఇంతటితో పెండ్లి సందడి ముగుస్తుంది.

### 3.8.11. సీమంతం:

మనిషి జీవితంలో పుట్టుకకు సంబంధించిన ఆచారాలు ప్రతి సమాజంలోనూ కన్పిస్తాయి. ఈ ఆచారాలు కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. వివాహం కాగానే భర్త ఇంటికి వెళ్ళిన స్త్రీకి కడుపు పండితే పుట్టింటికి వెళ్ళాలనే కోరిక కలుగుతుంది. గర్భవతి అయిన కూతురు తమ ఇంటికి వస్తే తల్లిదండ్రులు అన్ని కోరికలు తీరుస్తారు. గర్భం ధరించిన మూడో నెలకు/ఆరోనెలకు తల్లిగారింట "సీమంతం" అనే వేడుక చేస్తారు. గర్భం ధరించిన స్త్రీని కొత్త బట్టలతో అలంకరించి ముత్తైదువుల చేత పసుపు, కుంకుమలు పెట్టించి, అక్షింతలు వేయించి ఆశీర్వదింపజేస్తారు. గర్భిణీ స్త్రీకి ఇష్టమైన వంటకాలను చేసి తీసుకొచ్చి తినిపిస్తారు.

**ఒక్కటో మాసమున నెలత గర్భిణీ**

**ఒనగాయెలడిగే సెలియా**

రెండో మాసమున నెలత గర్భిణీ
దొండపండు కోరే సెలియా
మూడో మాసమున నెలత గర్భిణీ
ములక పండు అడిగే సెలియా
నాలుగో మాసమున నెలత గర్భిణీ
నల్ల ఈత పండ్లు అడిగె సెలియా
ఐదో మాసమున నెలత గర్భిణీ
అరటి పండు అడిగే సెలియా
ఆరో మాసమున నెలత గర్భిణీ
అల్ల నేరడి పండ్లడిగే సెలియా
ఏడో మాసమున నెలత గర్భిణీ
వెలగ పండ్లడిగే సెలియా
ఎనిమిదో మాసమున నెలత గర్భిణీ
నారింజ పండ్లు అడిగే సెలియా
తొమ్మిదో మాసమున నెలత గర్భిణీ
తొలి పండు నడిగే సెలియా
పదో మాసమున నెలత గర్భిణీ
పాపని గన్నాది సెలియా
ఎండి చాట్లో పాపడ్ని ఎండబెట్టి
వెండి కోల చేతికిచ్చే సెలియా బాలకృష్ణమ్మ : కందుకూర్

ఈ గేయంలో గర్భిణీగా ఉన్న జానపద స్త్రీ. తనకు అందుబాటులో లభించే పండ్లనే కోరుకున్నట్లుంది. ఒనగాయలు, దొండ, ములగ, ఈత, అరటి, అల్లనేరడి, నారింజ మొదలైన పండ్లను నెలనెలా కోరుకుంటుంది. ఈ కోర్కెలను గర్భిణీ స్త్రీకి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీరుస్తారు.

మానవజీవితానికి సంబంధించి జననం, వివాహం, మరణం అనేవి మూడు ప్రధానఘట్టాలు. జీవితానికి సంబంధించి మరణం చివరి ఘట్టం. మరణానంతరం

జానపదులు కొన్ని ఆచారాలు పాటిస్తుంటారు. మరణానంతరం ఆ వ్యక్తి దక్షిణం వైపు చూస్తున్నట్లు పండబెడుతారు. తరువాత దహన సంస్కారాలు, శవ దహన కార్యక్రమానికి హాజరైనవారు వారి బంధువులు ఎవరైన గ్రామంలో ఉన్న వారి ఇండ్లకు వెళ్ళరు. అంతేగాక శవదహన కార్యక్రమం అయిన తరువాత ఎవరికీ చెప్పకుండా ఎవరి ఇండ్లకు వారు వెళ్లిపోతారు. చావుకు వచ్చి చెప్పిపోకూడదు అనే ఆచారాన్ని అందరూ పాటిస్తారు. వెళ్లి వస్తాం అనే మాట ఎవరు కూడా వాడరు.

మరణించిన వ్యక్తి ఏ కులంవాడైన, ఏ మతం వాడైన మూడవ రోజు చిన్నకర్మ అని, పదకొండు లేదా పద్నాల్గవ రోజున  పెద్దకర్మ లాంటి కర్మకాండలు జరుపుతారు. భర్త చనిపోయిన భార్య ముఖానికి పసుపు రాసి, బొంద దగ్గరికి తీసుకెళ్లి ఆమె చేతికి ఉన్న గాజులు పగులగొట్టించటం, మెట్టెలు, తాళిబొట్టు తీయించడం వంటి కార్యక్రమాలు చేస్తారు. ఈ చేదు అనుభవాల్ని మరిచిపోవటానికి కర్మకాండలకు వచ్చినటువంటి బంధుమిత్రులకు తీపి పదార్థాలను మరియు మందు పోసి భోజనాలు ఏర్పాటుచేస్తారు. ఈ విధంగా ఇవన్నీ జానపదుల ఆచారవ్యవహారాలలో అంతర్భాగాలుగా నిలిచిపోయాయి. ఇవన్నీ జానపదుల సాంఘికాచారాలు.

### 3.9.0. పండుగలు:

తరతరాలుగా సంఘంలో నిలిచి ఉన్న నమ్మకాలు, సంప్రదాయాలు క్రియారూపాన్ని దాల్చి పండుగలు ఏర్పడ్డాయి. పండుగలు ప్రతి ఊర్లో, ప్రతి కుటుంబంలో కష్టాలను మరపించి నూతనోత్సాహాన్ని కలుగజేస్తాయి. ఆధ్యాత్మిక చింతనను మరియు గ్రామ ప్రజల మధ్య సౌహార్ధ భావాన్ని పెంపొందించేందుకు దోహద పడతాయి. జానపదులు పండుగ రోజును శుభదినంగా భావించి ఆ రోజు వారు నిత్య జీవన వ్యవహారంలో చేసే పనులన్నింటిని మానుకుని పండుగ వాతావరణం కల్పిస్తారు. పండుగ దగ్గర వస్తుందంటే వారి చెల్లెల్లను, కూతుళ్లను ఇంటికి ఆహ్వానించుకుంటారు. పండుగ రోజు ఇంటికి చేసే అలంకరణ వల్ల, ఇంటికి వచ్చిన బంధువుల వల్ల జానపదుల ఇండ్లు కళకళలాడుతుంటాయి. జానపదులు చేసుకునే ప్రతి పండుగల్లోను పాటలు ఆటలు ఉంటాయి. డిండి మండలంలో ముఖ్యమైన పండుగలు – వినాయక చవితి, దసరా,  దీపావళి, సంక్రాంతి, హోళి లాంటి పండుగలు చాలా సంతోషంగా జరుపుకుంటారు.

### 3.9.1. వినాయక చవితి:

భాద్రపదమాసం శుక్ల చతుర్థి నాడు వినాయక చవితిని జరుపుకుంటారు. ఈ పండుగ రోజు ఉదయమే తల స్నానం చేసి పరిశుభ్రమైన మట్టితో చేసిన వినాయక విగ్రహం తెచ్చి అనేక విధాలైన ఫల పుష్పాలతో పూజలు చేస్తారు. ఈ పండుగ రోజు పాయసం చేసుకోవడం తప్పనిసరి. ప్రతి ఊరిలోనూ గణేష్ ఉత్సవాలను ప్రత్యేకంగా జరుపుకునే ఆచారం ఇటీవల మొదలైంది. ఈ మండపాలకు పందిళ్ళు వేసి, చూడ ముచ్చటగా విద్యుద్దీపాలతో అలంకరణ చేసి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలు జరుపుతూ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచుతారు. నవరాత్రుల తర్వాత ఈ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకుని కుంటలలో, చెరువులలో నిమజ్జనం చేస్తుంటారు.

### 3.9.2. దసరా:

ఆశ్వయుజమాసం శుక్లపక్షంలో దశమిరోజున ఈ పండుగవస్తుంది. ఈ రోజు ప్రతిఊర్లో అర్జునుడి ధనస్సును ధరించిన శ్రీరామునికి ప్రియమైనటువంటి జమ్మిచెట్టును పూజిస్తారు. గ్రామస్తులు మంగళ వాయిద్యాలతో వెళ్లి శమీపూజ చేస్తారు. దీనివల్ల చేసిన పాపాలు నశిస్తాయని, శత్రువులు నశిస్తారని వారి విశ్వాసం. ఈ పండుగకు కొత్త అల్లుళ్లను, కూతుర్లను పిలుచుకువచ్చి కొత్త బట్టలు ఇస్తారు. కొన్ని తెగలలో కల్లు, సారాను సేవిస్తారు. ఊరంతా కొత్త బట్టలు ధరించి జమ్మిచెట్టు నుండి తెచ్చిన జమ్మిని పెద్దలకు ఇచ్చి నమస్కరిస్తారు. ఆ రోజు తప్పనిసరిగా పిండి వంటలను చేసుకుంటారు. కోళ్ళను, మేకలను గ్రామ దేవతలకు బలిచ్చి వాటి మాంసాన్ని భుజిస్తారు. పండుగ రోజు ముందు రాత్రి గ్రామంలోని ఆడవారంతా పెద్ద బతుకమ్మను జరుపుతారు. కొన్ని కులాలలో కొత్త దంపతులకు దసరా పండుగకు కాకుండా దీపావళికి కొత్త బట్టలు పెట్టే ఆచారం ఉంది.

### 3.9.3. దీపావళి :

దీపావళిని రెండురోజులు జరుపుకుంటారు. మొదట నరక చతుర్ధశి రోజున ఇల్లంతా శుభ్రంచేసి అలంకరించుకుంటారు. అమావాస్య రోజున నోములు నోచేవారు ప్రత్యేక పూజలు

చేస్తారు. సాయంత్రం ఇంటి వాకిట్లోనూ ఇంటిలోపల దీపాలు వెలిగించి దీపజ్యోతుల కాంతిలో ఉత్సాహంగా  టపాకాయలు కాల్చటం అనే అలవాటు మెండుగా కన్పిస్తుంది. పిండివంటలు చేసుకుని ఒకరికొకరు పంచుకుంటూ ఆనందంగా ఉంటారు.

### 3.9.4. సంక్రాంతి:

తెలుగు రాష్ట్రాలలో తరతరాలుగా అందరూ సంతోషాలతో, సంబరాలతో చేసుకునే పండుగ సంక్రాంతి. ఈ పండుగ ప్రతిప్రాంతంలో కోతకు వచ్చిన పంటలను కోసి ఇంటికి తీసుకువచ్చే సమయంలో చేసుకునే పండుగ. వ్యవసాయమే ముఖ్య వృత్తిగా జీవించేవారికి ఇంటికి ధాన్యలక్ష్మీ వస్తే అదే పెద్ద పండుగ. ఇది రైతులకు ముఖ్యమైన పండుగ. నిజమైన అర్థంలో ఈ పండుగ జానపదులది. ఈనాటికీ నిజమైన జానపదుల పండుగగా నిలిచి ఉంది. సంక్రాంతిని మూడు రోజులు జరుపుకుంటారు. మొదటిరోజున భోగిగా, రెండవ రోజున మకర సంక్రాంతిగా, మూడవ రోజున కనుమగా ఎంతో ఆనందంగా ఇంటిల్లిపాది జరుపుకుంటారు. భోగిరోజున కొత్త బట్టలు కట్టుకుంటారు. భోగి రోజు తెల్లవారు జామున లేచి ఇంట్లో ఉండే పాత చాపలను, చీపురలను, గంపలను, చేటలను, తట్టలను పోగుచేసి భోగి మంటలో వేసి చుట్టూ కూర్చొని చలి కాచుకుంటారు. భోగిరోజు మకరసంక్రాంతిరోజు శాకాహార వంటకాలతో విందులుచేసుకుంటారు. ముఖ్యంగా పరమాన్నం, గారెలు, బూరెలు చేసుకుంటారు ఇవికాక పిండివంటలు చేసుకుని నలుగురితో అటుఇటు పంచుకోవడంకూడా కద్దు. మకర సంక్రాంతిరోజు కూడా ఒక్కపొద్దులుండి పూజలు నిర్వహిస్తారు. కనుమ పండుగరోజున మాంసాహారం తినేటోళ్లు మాంసాహారంతోనూ శాఖాహారులు శాఖాహారభోజనాలతోనూ పండుగచేసుకుంటారు. ఒకరి ఇండ్లకు ఒకరువెళ్లి ఆనందాన్ని ఊరంతా పంచుకుంటారు. పశువులను జీవాలను విశేషంగా అలంకరించి పూజలుచేస్తారు. అంతేకాకుండగా సంక్రాంతి పండుగ రోజులు జానపదులకు చాలా ఇష్టమైన రోజులు. కాబట్టి ఈ రోజుల్లో సంక్రాంతి సంబరాలుగా ఇంటింటా రంగవళ్లులు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు, పతంగులు ఎగిరేయటం, బొమ్మరిల్లులుకట్టి  పాలు పొంగిస్తూ ఇలా ఒక్కటేమిటి చెప్పలేనన్ని పనులతో ప్రజలంతా ఆనందంగా గడిపేస్తుంటారు. అందరి ఇండ్లలోనూ తమ తమ శక్తికొద్దీ పిండి వంటలు చేసుకుంటారు. ఈ పండుగకు అన్నివిధాల ప్రత్యేకతను సంతరించుకుని  ఉంటుంది.

### 3.9.5. హోళి పండుగ:

ఫాల్గుణ పూర్ణిమనాడు ఈ పండుగను జరుపుకుంటారు. ఇది పిల్లలకు, పెద్దలకు, స్త్రీలకు, పురుషులకు అందరికీ ఆనందాన్ని చేకూరుస్తుంది. ఈ పండుగనే "కాముని దహనం" అని కూడా అంటారు. కామున్ని కాల్చే రోజున ఆ గ్రామంలో ఇంటింటా పిడకలు వసూలు చేసి ఒకచోట కుప్పగా పేరుస్తారు. ఆ కుప్పలో కాముని బొమ్మ పెట్టి గ్రామస్తులంతా ఆ బొమ్మను కాలుస్తారు. ఆ మంటల్లోనుంచి దూకితే వారికి ఉన్నా అంటు వ్యాధులు పోతాయని ఒక మూఢ నమ్మకం. ఆ రాత్రంతా కాముడు కాలిన తరువాత ఉదయాన్నే బూడిదను తీసుకొని పోయి ఇంట్లోని ధాన్యం కుండల్లో వేస్తారు. కాముని పండుగనాటి గుగ్గిళ్లను పశువులపైన, ఇంటిపైన చల్లుతారు. దీని వలన పశువులకు ఎలాంటి అంటు వ్యాధులు, రోగాలు, దయ్యాలు పట్టవని నమ్ముతారు. కాముడు కాలిన మరునాటి ఉదయం హోళి ఆటలు ఆడతారు. అందరూ రంగులు చల్లుకునే ఆటలో మునిగి తేలుతారు. స్త్రీలంతా గుమిగూడి పాటలు పాడుతూ, ఇల్లిల్లూ తిరుగుతూ సందడి చేస్తారు.

ఈ రోజు స్త్రీలు ఇల్లిల్లూ తిరుగుతూ వావి వరుసలు లేకుండా రంగులు పూసుకుంటారు. అదే విధంగా ఈ కింది విధంగా పాటలుపాడుకుంటారు.

**"కామకామయ్యో కాముడోచ్చిండు**
**కాముడోచ్చిండు కాళ్ళు కడిగిండు**
**మేమొచ్చినాము శెనిగలు దెచ్చారా**
**శెనిగలు దెచ్చారా జిలక మాడరా**
**గూడు గూడు గున్నసింత**
**నాల్గువేల ఉన్ని గూడెం**
**నట్ట నడుమ బొమ్మరిల్లు**
**బొమ్మరింట దొడ బిడ్డ**
**దాని బిడ్డి మశకాంత**
**సిక్కుదీసి కొప్పు పెట్టి**
**అల్లి బిల్లి చెప్పులు దొడిగి**
**అబల బరిగే చేతబట్టి**

ఏడికోతవు జానకమ్మ
మంచినీళ్ళబాయి కాడికి
మల్లె బంతులాడబోతే
ఉప్పు నీళ్ళ బాయికాడ
ఊళ్ళ బంతులాడబోతే”            ఇద్దమ్మ: రామంతాపూర్

అని పాడుతూ ఊరంతా తిరుగుతూ “కాముని కల్లు” ఇప్పించమంటూ ఊరంతా అడుగుతుంటారు.

### 3.9.6. రాఖీ పండుగ:

రఖీ, రక్షాబంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను డిండి మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటారు. అన్నా చెల్లెళ్ళు లేదా అక్కా తమ్ముళ్ల మధ్యన ప్రేమానుబంధం సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. అన్నకు గాని తమ్మునికి గాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని చేతి మడమకు కట్టడం ఈ పండుగ ప్రధాన ఆచారం. రాఖీ అనగా రక్షాబంధం. ఇది అన్నాచెల్లెళ్లు అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహత్తరమైన పండుగ. చెల్లిగానీ అక్క గానీ తన అన్నయ్య తమ్ముడులు మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ ప్రేమపూర్వకంగా కట్టేదే రాఖీ. ఈ పండుగను డిండి మండలంలో ఉన్న అన్ని గ్రామాలలోని ఇండ్లలో సంతోషంగా అందరి తోబుట్టువులతో చేసుకునే పండుగ. ఆ రోజు అన్ని గ్రామాలు అన్నా చెల్లెళ్ల అనురాగాలతో  కళకళలాడుతుంటాయి. రాఖీ కట్టినందుకు ఆడపిల్లలైన తోబుట్టువులకు కొత్త బట్టలు పెట్టి, కానుకలు సమర్పిస్తారు అన్నదమ్ములు.

### 3.9.7. ఉగాది /యుగాది:

చైత్రశుద్ధపాడ్యమినాటిని ఉగాది అంటారు. ఈ ఉగాది పండుగ రోజునుండి చాంద్రమానాన్ని అనుసరించే తెలుగువారికి కొత్తసంవత్సరం ప్రారంభమవుతుంది. ఉగాదిపండుగ రోజున వేపపూలు, కొత్త బెల్లం, ఉప్పు, కొత్త చింతపండు, పచ్చి మిరపకాయలు, మామిడి పిందెలు కలిపిన ఉగాది పచ్చడి షడ్రుచులతో చేసుకుంటారు. ఉదయాన్నే నిద్రలేచి స్నానపానాదులు ముగించుకుని ఉగాదిపచ్చడి సేవించటం ఆనవాయితీ. ఈ పచ్చడిలోని ఆరురుచులు జీవితంలోని అనేక సుఖదు:ఖాలకు, ఆటుపోట్లకు,

ఎగుడుదిగుడులకు ప్రతీకగ భావిస్తారు. అన్నింటిని సమంగా భావించే గుణాన్ని అలవరచుకోవాలనే తత్వాన్ని అందించే ఈ ఉగాది పచ్చడి తెలుగువారి అద్వితీయ ఎంపిక. అందుకే ఈ రోజును ప్రత్యేక పర్వదినంగా పరిగణిస్తారు. ఈ మండలంలోని జానపదులకు ఉగాది పచ్చడి సుఖదుఃఖాలను మాత్రమే కాక జీవితంలోని వగరును, రౌద్రాన్ని, పులుపును కూడా ప్రతిబింబిస్తుంది. ఉగాది రోజున పంచాంగ శ్రవణం ప్రధానమైంది. గ్రామాలలో ఇది కేవలం ఒక ఆచారంగా కాక రాబోయే శుభాలను తెలుసుకోవాలనే ఉత్సాహాన్ని కలిగిఉంటుంది.

### 3.9.8. పీర్ల పండుగ:

డిండిమండలంలోఉన్న దాదాపు అన్ని గ్రామాలలో దూంధాంగా జరుపుకునే అతి పెద్ద పండుగ పీర్ల పండుగ. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండుగను హిందూ, ముస్లింలు సోదర భావంతో అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఇంత ఘనంగా జరుపుకునే పీర్ల పండుగ డిండి మండలంలోని డిండి, చెరుకువల్లి, కందుకూరు, కామేపల్లి, గౌరారం గ్రామాలలో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ గ్రామాలలో ఇంత వైభవంగా నిర్వహించే పండుగను చూడటానికి చుట్టూప్రక్కల గ్రామస్తులకే కాకుండా బంధువులు సైతం పెద్దగా వస్తుంటారు. దీంతో గ్రామంలో వారం రోజులపాటు పండుగ వాతావరణం నెలకొంటుంది. పెద్దగా ముస్లిం మతస్థులు పెద్దగా లేకపోయినప్పటికి పీర్ల పండుగని ఏటా అనవాయితీగా గ్రామంలో కులమతాలకు అతీతంగా అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి ఏడాది అనవాయితీగా గ్రామస్తులంతా ఏకమై గ్రామం నడిబోద్దున ఉన్న పీర్ల కొట్టంలో మండలంలో మొత్తం ఎక్కడ లేని విధంగా 8 పీర్లను ప్రతిష్టిస్తారు. మొహర్రం మాసంలో పుణ్యం కలగాలని కోరుకుంటూ కొంతమంది భక్తులు సంతానం కోసం పది రోజులపాటు ఉపవాస దీక్షలు చేపడతారు. గ్రామస్తులంతా పెద్ద ఎత్తున వారం రోజులపాటు రాత్రివేళలలో డప్పులతో దరువులు, జానపద గేయాలు పాడుతూ “అలావ్” ఆడుతారు. అలావ్ ఆట ఆడేవారు కాళ్ళకి గజ్జెలు కట్టుకొని అగ్నిలో దూకుతారు. అలావ్ ఆటను చూడటానికి జామువరకి మేలుకుని ఆసక్తిగా చూస్తారు. దప్పు చప్పుళ్ళ మధ్య పీర్లను ఊరేగింపుగా ఇంటింటికి తిప్పుతూ ఊదు, దట్టీలు, బెల్లం, కానుకలు సమర్పించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. గ్రామం మొత్తం తిరుగుతూ దప్పులతో పీర్లను ఊరేగించుకుంటూ పోతూ ఊరి సమీప బావిలో

నిమజ్జనం చేస్తారు. ఉత్సవాల ముగింపు కార్యక్రమం రోజున ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా కులమతాలకు అతీతంగా జనజాతరలా కొనసాగుతుంది.

### 3.10.0. గ్రామదేవతలు – ఉత్సవాలు:

గ్రామ దేవతలు లేని ఊరు లేదు. ఈ దేవతల కోసం పూజలు, జాతరలు, ఉత్సవాలు జరుపని జానపదులు లేరు. ఈ గ్రామ దేవతలకు ప్రతి ఊరి బయట చెట్టుకిందనో, చెఱువు కట్టకిందనో చిన్న గుళ్ళు ఏర్పరుస్తారు. గ్రామ దేవతల అందం, ఆకారం చెప్పడం కష్టం. చిన్నరాయి, బండ, చెట్టు, పుట్టలను గ్రామదేవతలుగా పూజిస్తారు. ఈ దేవతలకు పూజలను జాతర రూపంలో సంవత్సరానికొకసారి జరుపుకుంటారు.

ఈ దేవతలను సంతృప్తిపరచాలంటే కోళ్ళు, గొర్రెలు, బర్రెలు, మేకలు, దున్నలను బలిస్తారు. పసుపు, కుంకుమ, వేప మండలు, పెరుగు అన్నం మొదలైన ప్రీతికరమైన వస్తువులు. ముఖ్యంగా పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, బాలమ్మ మొదలైన గ్రామ దేవతలు డిండి మండలంలో ప్రతి గ్రామంలో కనిపిస్తాయి.

### 3.10.1. పోచమ్మ:

పోచమ్మను అమ్మవారు, తల్లి అని కూడా పిలుస్తారు. ఈ దేవత గ్రామాన్ని రక్షిస్తుంది. ఈ దేవత ఊరి మధ్యన గాని, ఊరు ముందుగాని, వేప చెట్టు కింద నిలుపుతారు. ఈమె తల్లిదండ్రులు శివపార్వతులని చెప్పుకుంటారు. భయంకరమైన అంటు వ్యాధికి ఈమె ఆదిదేవత. అందుకనే ఈ వ్యాధి సోకినప్పుడు అమ్మవారయ్యింది, పోచమ్మ పోసింది అని చెప్పుకుంటారు. అమ్మవారయిందంటే భయంతో పోచమ్మకు కోళ్ళు, మేకలు బలి ఇస్తారు. కల్లు సారా సాకలు పోస్తారు. ఆ వ్యాధికి ఎటువంటి మందులు వాడరు.

మేకపోతులను, కోడి పుంజులను బలి ఇచ్చి వాటి కాళ్ళను గుడి ముందు చెట్టుకు కడతారు. ఈ మేకకు పూజలు జరుపుటలో చాకలి, మంగలి, బైండ్లవారు ముఖ్య పాత్ర పోషిస్తారు. బెల్లంబువ్వ నైవేద్యంగా తీసుకొని తలలపై మోసుకొని ఊరేగుతూ పోచమ్మ గుడికి పోతారు. దీనినే బోనాల పండుగ, పోచమ్మ పండుగ అని కూడా అంటారు.

ఈ బోనాలప్పుడు ఊరికి ఒకరిద్దరు సిగమూగుతుంటారు. దప్పు చప్పుడు వినిపించగానే సిగమూగుచూ బోనాల వద్దకు వస్తారు. సిగమూగువారిపై దేవత నిల్చిందని నమ్ముతారు.

### 3.10.2. మైసమ్మ:

మైసమ్మను పశువులను పోషించే దేవతగా చెప్పుకుంటారు. కట్టమీద నిల్చిన దేవతను 'కట్ట మైసమ్మ'' అని, కోట పక్కన నిల్చిన దేవతను 'కోట మైసమ్మ' అని పిలుస్తారు. చెరువు కట్టమీద నిలిచిన మైసమ్మను చూసి పశువుల కాపరులు భయపడతారు. ఒక్కొక్కసారి గొర్రెలకు, మేకలకు, పశువులకు వ్యాధులు సోకితే వీళ్లు పూజలు, ఉత్సవాలు చేస్తారు. ఆ రోజున ఒక మేకపోతునైన, ఎద్దునైన మైసమ్మ ముందు ఒక్క దెబ్బతో తల నరికి రక్త తర్పణం చేసి, బువ్వ వండి ఊరి చుట్టు చల్లుతారు. ఆ రోజు వేరే ఊరి పశువులను ఆ ఊరిలోనికి రానివ్వరు. ఉత్సవంలో పశువులను వేరే ఊరికి వెళ్ళనివ్వరు. ఉత్సవంలో ఎడ్లను, ఆవులను, దూడలను, బర్రెలను, దున్నలను ఆ దేవత చుట్టూ తిప్పి బలిని ఆ పశువులపై చల్లుతారు. దీనివల్ల పశువులకు తగిలిన వ్యాధి పోతుందని నమ్ముతారు. మైసమ్మను మొక్కితే సంతానం కలుగుతుందని నమ్మే జానపదులు కూడా ఈ మండలంలో ఉన్నారు.

### 3.10.3. ఎల్లమ్మ:

ఎల్లమ్మ దేవత పల్లెను, పల్లె ప్రజలను కాపాడుటయే కాక సంతానం లేని వారికి సంతానం కలుగజేస్తుందనే నమ్మకం జానపదుల్లో ఉంది. ఎల్లమ్మను, మవురాల ఎల్లమ్మ, రేణుక ఎల్లమ్మ అనే పేర్లతో పిలుస్తారు.

ప్రత్యేకంగా చెప్పాలంటే ఈ దేవత మాదిగ వారి కులదేవత. ఎల్లమ్మ పార్వతి కూతురు. పార్వతికి ఏడుగురు బిడ్డలు. ఆమె తమ్ముడు మునిరాజు. వారు పెద్దమారి, చిన్నమారి, పెద్దపోశి, చినపోశి, పెద్దేది, చిన్నది. పార్వతికి ఏడవ సంతానం ఎల్లమ్మ. పార్వతి పెద్ద బిడ్డ ఎల్లమ్మకు అక్కయైన పోచమ్మ, ఎల్లమ్మను పెంచి పెద్ద చేసింది. ఎల్లమ్మను తన మేనమామ అయిన మునిరాజు వివాహం చేసుకుంటాడు. ఈ ఏడుగురి అక్కాచెల్లెండ్లకు తమ్ముడు పోతురాజు. పోతురాజును తన అక్కలకు రక్షణగా ఉంటాడనే నమ్మకంతో ఊరి ముందర నిలుపుతారు.

ఎల్లమ్మ ఉన్న ఇంట్లో ఎల్లమ్మకు ఒక గది ఏర్పాటు చేస్తారు. గదికి జాజు పూసి గంధము చిలికి అలంకరిస్తారు. బైండ్లవారికి మాదిగలకు ఆమె మీద అమితమైన భక్తి. ఎల్లమ్మకు జరిపే ఉత్సవాలలో బైండ్ల వారు ముఖ్యపాత్ర పోషిస్తారు. వారు జమిడికలు వాయిస్తూ ఎల్లమ్మ కథలు చెప్తారు. పండుగ రోజున ఎల్లమ్మ గుడినుండి ఒక వేపకొమ్మను పట్టుకొని డప్పులు కొట్టుకుంటూ వచ్చి నడిగ్రామంలో బొడ్రాయిని దర్శిస్తారు. దాని చుట్టూ సిగమూగుతూ తిరుగుతారు. ఎల్లమ్మ దేవతలకు కూడ కోడి పుంజులను మేకపోతులను బలి ఇస్తారు.

### 3.10.4. జాతర:

జాతర అన్న పదం యాత్రకు వికృతి. జాతరలు చిన్న క్షేత్రోత్సవాలు. ఇవి నాలుగైదు గ్రామాలకు ఒక జాతర జరగడం మనం చూస్తూనే ఉన్నాం. జాతరని కొన్ని ప్రాంతాలలో తిరునాళ్ళు అని కూడా అంటారు. ప్రతి జాతరకు చుట్టుప్రక్కల గ్రామాలవాళ్లు తండోపతండాలుగా వస్తారు. పిల్లల ఉత్సాహం, పడుచువారి పరవళ్ళు ముచ్చట గొలిపిస్తుంటాయి. డిండి మండలంలోని బాపన్ కుంట జాతర చాలా విశేషమైంది.

డిండి మండలంలోని బాపన్ కుంట దగ్గర ప్రతి సంవత్సరం జనవరి 23వ తారీఖున ఒక రోజు జాతర జరుగుతుంది. జాతరకి ఒకరోజు ముందు చుట్టు పక్కల గ్రామాల నుండి బ్యాండు బాజాలతో డాన్సులతో ఊరేగించుకుంటూ గంధం తీసుకుని ఉదయం గుట్టపైనా ఉన్నటువంటి తుర్కదేవుని దగ్గరికి చేరుకుంటారు. దర్గా దగ్గరకి వచ్చే భక్తులందరూ కొబ్బరికాయలు కొట్టి, కానుకలు పెట్టి మొక్కులు చెల్లించుకుంటారు. కొందరు భక్తులు సంతానం కోసం మొక్కులు, ముడుపులు కడుతారు. గుట్ట దిగి వచ్చినాక దారి పొడవునా దుకాణాలే కనిపిస్తాయి. ఆ దుకాణాలలో వివిధ రకాల వస్తువులుంటాయి. చిన్న, పెద్దలకు పనికి వచ్చే వస్తువులన్ని ఆ జాతరలో లభిస్తాయి. పిల్లలకు ఆట వస్తువులు, ఆడపడచులకు బొట్టు, కాటుక, గాజులు, మెడ దండలు మొదలైన అలంకరణ వస్తువులు, వివాహ స్త్రీలకు కాలికి మెట్టెలు, రకరకాలైన కుంకుమ భరిణలు లభిస్తాయి. అడుగడుగునా తిను భండారాలు కనిపిస్తాయి. వీటి అన్నింటిని చూసిన జానపదులు ప్రతి సంవత్సరం పోవాలని అనుకుంటారు. ఏదో ఒక మొక్కుబడి పెట్టుకొని జాతరకి వెళ్తుంటారు.

ఈ విధంగా జానపదుల జీవన విధానం, ఆచారాలు, సాంస్కృతిక జీవనం, పండుగలు, జాతరలు అన్ని సామూహికమైనవే. ఒకే వ్యక్తి ఏ పండుగ చేయదు. ఏ ఆచారాన్ని పాటించనూ లేదు. సంఘం నుండి వెలువడిన ఆచార వ్యవహారాలే ఇతరులకు సంక్రమిస్తాయి.

### 3.11.0 డిండి మండలంలోని ఆటలు:

పిల్లలకు శారీరక వ్యాయామానికి బుద్ధివికాసానికీ ఆటలు ప్రథమ ఆకరాలు. బారతీయ సమాజంలో పిల్లలు ఆడుకునే ఆటలు కోకొల్లలు. ప్రాంతానికి ప్రాంతానికీ వేరుబడి ఉంటాయి. అన్నింటి ప్రయోజనం పిల్లల ఆరోగ్యం బుద్ధి వికసనమే ప్రధానం. ఇటీవలి కాలంలో పిల్లల ఆటలు చాలా తగ్గిపోయాయి. క్రికెట్ ఆట వచ్చింది మొదలు అందరూ దానిపైనే మక్కువ చూపుతున్నారు. టి.వి.లప్రభావం, మోతబరువు చదువుల ప్రభావంతో పిల్లల్లో ఆడుకునే తత్వమే కొరవడిందని చెప్పాలి, అదే కోవలోనే డిండిమండలం పయనిస్తుంది. చెదురుమదురుగా కొన్ని ఆటల్నే నేటికీ అక్కడక్కడ ఇక్కడి పిల్లలు ఆడుతున్నారు. డిండిమండలంలో ఆదుతున్న ఆటలు.

### 3.11.1. కోతి కొమ్మచ్చి:

ఈ ఆట అనుకరణతో వచ్చినదై ఉండాలి. కోతి కొమ్మచ్చికి పదిమంది ఆటగాళ్లు ఉండాలి. ఆటలో ఒక వెదురు కర్ర కోతి అవుతుంది. అప్పచప్పట్లు వేసి దొంగను ఎన్నుకుంటారు. ఆటగాళ్ళలో ఒకరు విసిరివేసిన కర్రను తేవడానికి దొంగ పరుగెత్తుతాడు. అతను వచ్చే లోపల అందరూ చెట్టు ఎక్కుతారు. కూతను వదలకుండా కర్రతో ఎవరిని తాకితే వాళ్ళు తదుపరి ఆట కొనసాగింపుకు దొంగ అవుతారు.

### 3.11.2. గాలిపటం:

పిల్లలు ఆడే ఆటల్లో జనప్రియమైన వాటిలో గాలిపటం ఎగరవేయడం ఒకటి. జానపదులు కాగితం, దారం ఉంటే చాలు ఏదో రకమైన గాలిపటాన్ని తయారుచేస్తారు. గాలిపటం తయారుచేయటానికై ఒక సూత్రం ఉంటుంది. ఆ సూత్రం ప్రకారం దారాన్ని కట్టితే గాలిపటం తిరుగులేకుండా ఎగురుతుంది. ఇలా తయారుచేసిన గాలిపటానికి దారం కట్టి

రెండవ చివర చేతిలో ఉంచుకొని పటాన్ని గాలిలో ఎగురవేస్తారు. సంక్రాంతి పండుగ సమయాల్లో మాత్రమే గాలిపటాలను ఎగురవేస్తారు.

### 3.11.3. తొక్కుడు బిళ్ళ:

సాయంకాలం చిన్నచిన్న పట్టణాలలోకూడా వీధివీధిన తొక్కుడుబిళ్ళ ఆడుతుంటారు. నేల మీద అటుఇటు నాలుగు నాలుగు గడులుండే చతురస్రాన్ని గీస్తారు. కుండ పెంకును గాని లేదా అలాంటి మరో పలుచటి రాయినిగాని తీసుకొని మొదటి గడిరేఖ మీద నిలబడి, తను అనుకున్న గడిలోకి విసిరేస్తుంది. సరిగ్గా పడకపోతే ఆ బాలిక/బాలుడు ఆ ఆటనుంచి తప్పుకోవాలి. రెండవ బాలిక/బాలుడు ఈ విధంగా చేయడానికి ప్రయత్నించాలి. ఎవరైనా సరిగ్గా బిళ్ళను వేసినవారు మళ్లీ దాన్ని ఒంటి కాలితో తేవటానికై నడుస్తూ వెళ్ళాలి. మధ్యలో కాలు నేలమీద మోపడం, బిళ్ళ వెలుపలికి వచ్చేయడం గాని అయితే ఓడినట్లు లెక్క. చివరి వరకు సరిగ్గా తీసుకొని వస్తే, మళ్లీ బిళ్ళను కాలివేళ్ళ మీద పెట్టుకొని మళ్ళీ గెంతుతూ వెళ్ళాలి. అరచేతిమీద బిళ్ళను ఉంచుకొని ఆకాశంవైపు చూస్తూ గెంతడం, నెత్తిమీద బిళ్ళను ఉంచుకొని గెంతడం కూడా చేస్తారు. ఎక్కువగా ఈ ఆటను అమ్మాయిలే ఆడుతారు

### 3.11.4. దాగుడుమూతలు:

పిల్లల గుంపులో ఒకరు 'పెద్ద'గా ఉంటారు. పిల్లల్లో ఒకరిని 'దొంగ'గా నిర్ణయిస్తారు. పిల్లల్లో పెద్దవాడు దొంగకు కళ్ళకు గంతలు కట్టి మిగిలిన పిల్లలందర్ని వెళ్ళి దాక్కోమంటారు. వాళ్ళలో ఒకరు రావచ్చు అనగానే దొంగ దాగి ఉన్నవారిని కనుక్కోవడానికి ప్రయత్నిస్తుంది. ఈలోగా దాగి ఉన్నవారు తల్లి(పెద్ద)ని తాకాలి. అంతలోపల దాక్కున్నవారిని తాకితే వాళ్ళు దొంగలవుతారు. అలా సాధ్యం కాకపోతే మొదటి దొంగే మళ్ళీ దొంగ అవుతాడు. దీన్ని చిన్న పిల్లలందరూ ఆడుతారు. అయితే ఎక్కువగా ఆడపిల్లలు ఆడే ఆట ఇది.

**"దాగుడుమూతలు దండాకోర్**
**ఎక్కడి దొంగలు అక్కడ్నే దాక్కోండి"**

వంటి పాటలు పాడుతారు.

### 3.11.5. పులిజూదం:

వీధిలో ఎక్కడ చోటు దొరికినా బొగ్గుతో బొమ్మ గీసుకొని ఆడుతూ ఉంటారు. మొత్తం మీద పులిని మేకలతో కట్టి వేయడం దీనిలో ముఖ్యం. పులికి పెద్ద గులకరాళ్లు, మేకలు చిన్న గులకరాళ్లు వాడుతారు. పులి జరగకుండా కట్టి వేస్తే ఆట ముగుస్తుంది. ఒక రకం ఆటలో మూడు మేకలు, ఒక పులి ఉంటుంది. మరో రకం ఆటలో నాలుగు పులులు, పదహారు మేకలు ఉంటాయి. సాధారణంగా ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ ఈ ఆటను ఆడుతుంటారు. ఎక్కువగా ఈ ఆటని పశువులకాపర్లు, మేకల గొర్రెల కాపర్లు ఆడుతుంటారు. పల్లెల్లో పని ముగించుకుని తీరికగా ఉన్న పురుషులు ఆడుతుంటారు.

### 3.11.6. పులిమేక:

ఎక్కువ మంది పిల్లలు ఆడే ఆటల్లో ఇది ఒకటి. కొందరు పిల్లలు గుండ్రంగా నిలబడి ఒకరి చేతులు ఒకరు పట్టుకొని మధ్యలో 'మేక' అని పేరుపెట్టి ఒకర్ని ఉంచుతారు. బయటనుంచి ఒకరిని 'పులి' అని పేరు పెడుతారు. గుండ్రంగా నిలుచొని ఉన్న పిల్లలు పులిని లోనికి వెళ్ళనీయరు. పిల్లల చేతుల కింది నుంచి గాని, చేతులు పట్టుకున్నవారి చేతులు విడిపించుకొని గాని పులి లోపలికి వచ్చి మేకను పట్టేసుకుంటే మళ్లీ మరొకరు పులిగా, మేకగా ఉంటారు.

### 3.11.7. చెమ్మచెక్క:

ఇద్దరు అమ్మాయిలు ఒకరికొకరు ఎదురుగా నిలబడి, ఒకరి అరచేతులు ఇంకొకరి అరచేతులతో తడుతూ ఆడాలి. చేతులు తీసేసుకోవడం, మళ్లీ తట్టడం, మళ్లీ తీసేసుకోవడం మళ్ళీ తట్టడం చేయాలి.

> **"చెమ్మచెక్క చేరడేసి మొగ్గ**
> **అట్లు పోయంగా ఆరగించంగా**
> **ముత్యాల చెమ్మచెక్క ముగ్గులెయ్యంగ**
> **రత్నాల చెమ్మచెక్క రంగులెయ్యంగ...**

అనే పాట ఈ ఆటల్లో వినిపిస్తుంది.

ఈనాటికి గ్రామీణ జానపదుల్లో బాగా ఆడే ఆటల్లో పులిజూదం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ పైన తెల్పిన కొన్ని ఆటలు రోజురోజుకీ  కనుమరుగవుతున్నాయి. డిండి మండల జానపదులలో పైన పేర్కొన్న ఆటలు ఎక్కువగా ఆడుతుంటారు.

మూడవ అధ్యాయంలో డిండిమండల జానపదుల జీవనవిధానం, సంస్కృతి. ఆచారాల గురించి తెలుసుకున్నాం. నాల్గవ అధ్యాయంలో డిండిమండల జానపద గేయాలను పరిచయం చేయడం జరుగుతుంది.

# అధ్యాయం – 4
# డిండి మండల జానపదగేయాల వర్గీకరణ

### 4. 0. పరిచయం

జానపదం అంటే పల్లెటూరు. జానపదులు అనగా పల్లెప్రాంతవాసులు. జనపద సముదాయంలో చాలామంది వ్యక్తులు సమూహంగా సమాన జీవనశైలితో పరంపరాగతమైన సంప్రదాయాల అనుసరణ ఉండాలన్నదే పరిశోధకుల సిద్ధాంతం. ప్రసిద్ధ జానపద విద్యాంసుడయిన 'అలెన్ డండస్' ప్రకారం జానపదులంటే ఏదైనా ఒక విషయంలోనైనా భావసామ్యం కలిగిన జనసముదాయం. వీరు ఒక భాషకు సంబంధించిన వారు కావచ్చు. ఒక ప్రదేశంలో నివసించువారు కావచ్చు. ఒకే జాతికి మతానికి చెందినవారు కావచ్చు. అయితే జనసముదాయం తమదే అని చెప్పుకోగల్గిన పరంపరాగత సంప్రదాయాలు కలిగుండాలి. జనసముదాయం అన్నప్పుడు ఫోక్ అనిపించుకోవాలంటే కనీసం ఇద్దరయినా ఉండాలి. ఈ విధంగా జానపదుల్ని నిర్వచించడంవల్ల 'ఫోక్' అన్న పదానికి అర్థం చిన్నదిగాచూస్తే కుటుంబకావచ్చు పెద్దదిగా చూస్తే దేశమైనా కావచ్చు, పై నిర్వచనం ప్రకారం గ్రామీణులయినా, నగరవాసులయినా జానపదులే అవుతారని చెప్పవచ్చు.

జానపదాలు అనగా పల్లెవాసులు పాడుకునే పాటలు 'పల్లె పదములు' వాటినే జానపద గేయాలు అంటారు. వీటిని జానపదులు సందర్భానుసారంగా పాడుకొని వినోదంతోపాటు విజ్ఞానం పొందుతూ వాళ్ళు ఆనందిస్తారు. వీటిని ఆంగ్లంలో 'Folk Songs అంటారు.

జానపదులు ఆనందానుభూతుల్ని ఆస్వాదిస్తున్న సమయాల్లోను, కాయకష్టం చేస్తున్న సమయాల్లోను, బాధల్ని అనుభవిస్తున్న సమయాల్లోను ఈ గేయాలను జానపదులు అలపిస్తుంటారు. అంతేకాక తమ ఆచారాలను, అనుభవాలను ఇతరులకి తెలియజేయటానికో, తాము నలుగురిలో ఒకరం అనే భావనను వ్యక్తీకరించటానికో ఈ గేయాలను జానపదులు పాడుతుంటారు. అందుకే ఇవి ఎప్పుడు, ఎక్కడ పుట్టి ఉంటాయో తెలియజేయటం కష్ట సాధ్యం. జానపదగేయాల్లో శ్రామికగేయాలు, వినోదగేయాలు,

పారమార్ధికగేయాలు, బాంధవ్యగీతాలు, పిల్లలపాటలు, వేడుకపాటలు, వలపుపాటలు, హాస్యగీతాలు, కన్నీటి పాటలు మొదలగు అనేక విభాగాలున్నాయి.

## 4.1. జానపదత్వం

జానపదుల ఆచారాలు, అనుభావాలు, ఆలోచనలు కలిగి ఉండటం జానపదత్వం. అనగా జానపదుల జీవనవిశేషాలకు, విధానాలకు సంబంధించిన విషయాలు జానపద గేయాల్లో ప్రధానంగా కనిపిస్తుంటాయి. ఇది రాజుల కోరిక మీదనో, మరెవరి కోరిక మీదనో రచించినవి కావు. జానపదులు తమ ఆనందాన్ని, ఆవేదనను, ఆలోచనను ఇతరులకు తెలియజేస్తున్నప్పుడు అప్పటికప్పుడు కయికట్టబడి నోటినుండి జాలువారినవి కావటం గమనించదగ్గ విషయం. కయికట్టబడిన రూపులు అలాగే లేవు తరంనుండి తరంకి మారినపుడో లేక ఒకరినుండి ఒకరు నేర్చినపుడో అవి మార్పులకి చేర్పులకి వార్పులకి మార్పులకి లోనయ్యాయి. కొన్ని పాటల్లో పదాలు మారితే కొన్ని పాటల్లో చరణాలుమారితే కొన్ని పాటల్లో వస్తువు మారితే ఇలా ఒకే పాట అనేక రూపులతోనూ లభ్యం అవుతుంటుంది. ఒక్కొక్క ప్రాంతంలోని పాటలను సేకరించి ఇలా గమనించినపుడు ఆ వైవిధ్యాలను పట్టుకోవచ్చు. డిండిమండల జానపద గేయాలను స్త్రీలపాటలు, శ్రామిక గేయాలు, వృత్తికారులగేయాలు ఇతరాలు అని పరిశీలించినపుడు స్త్రీలపాటల్లో తొట్టెలపాటలు, ఎగతాళిపాటలు, పెండ్లిపాటలు, సంవాదగేయాలు లభించాయి. శ్రామికగేయాలలో ఇంటి ఆవరణకు బయటపాడే శ్రామికగేయాలు, ఇంటిలోపలపాడే శ్రామిక గేయాలు అని వర్గీకరించడం ద్వారా ఇంటి ఆవరణకు బయట పొలంపనులకై పాడెపాటలు, పశువులకాపర్లపాటలు, చేలకావలిపాటలు లభించాయి. ఇంటిఆవరణలోని శ్రామికగేయాలలో విసరురాయిపాటలు, దంపుడుపాటలు అభించాయి. వృత్తికారులపాటలూ లభించాయి. ఇతరాలలో సూర్యగ్రహణం కారణాన్ని జానపదుల ఊహతో ఒకపాటలభ్యమయింది. ఇలా డిండి మండలంలోని గ్రామాలను సంచరిస్తూ అక్కడ నివసిస్తున్న వారినుండి సుమారుగా 86 పాటలను సేకరించుకొని పరిశీలన చేయడం జరిగింది.

### 4. 2 .0. డిండి మండల జానపద స్త్రీల గేయాలు

సమాజంలో ఏలాంటి వ్యక్తి అయినా ఒంటరిగా జీవించలేడు. అతని జీవితం కుటుంబంతో సమాజంతో ముడిపడిఉంటుంది. అది అతని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. స్త్రీ పురుషులు కుటుంబ సభ్యులుగా ఉన్నప్పటికి ఇంటివాతావరణంలో పురుషులకంటే స్త్రీలకే ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. కుటుంబానికి అవసరమయ్యే వస్తువులను సంపాదించేవాడు పురుషుడైతే సర్దుబాటుతో వినియోగించేది స్త్రీ. కుటుంబంలో అందరి ఆలనాపాలనా స్త్రీలు చూస్తుంటారు. పసిపిల్ల మొదలు ముసలివారివరకు అందరి అవసరాలను ఇండ్లల్లో గమనించే స్త్రీలు తమ పనిపాటల్లో భాగంగా పదాలను కయికడతారు అవి తొట్టెలలో పాపను పడుకోబెట్టి నిద్రబుచ్చుతూ పాడే లాలిపాటలు మొదలు వృద్ధాప్యం పొంది జీవితానుభవాలను చిత్రీకరించే తత్త్వాలదాకా దొరుకుతున్నాయి. సూర్యుడు ఉదయించక ముందే మేల్కొని రాత్రి పడుకునేవరకు పనులతో సతమతమయ్యే స్త్రీ తమ జీవితంలో ఎదుర్కొన్న ప్రతి సంతోషాన్ని, సుఖాన్నీ, బాధల్ని, నష్టాల్ని, ఇబ్బందుల్ని, పొరపొచ్చాలని అన్నింటినీ పాటలుగా కయికట్టుకుని పాడుకుంటుంది. డిండిమండల స్త్రీలపాటల్లోని గేయాలు ఇలా ఉన్నాయి.

### 4.2. 1. తొట్టెల పాటలు:

పసిపిల్లలను నిద్రపుచ్చడానికై తల్లులు పాడే పాటలను లాలి/జోల/తొట్టి/ ఉయ్యాల పాటలు అంటారు. ప్రతి తల్లికీ తనబిడ్డ బంగారు కొండ. తల్లి మనసులో ఆ బంగారు బిడ్డకు అలంకరణలకు తక్కువేమీ ఉండదు. ఈ పాటలో పుట్టిన బిడ్డకు తండ్రి రకరకాల వస్తువులు తీసుకుని వస్తున్నాడని తెలియజేస్తుంది. ఈ పాటను పాడినవారు డిండిమండలవాసులు. ఈ పాటలో దేవరకొండ, నల్గొండ ప్రాంతాలపేర్లు కనపడడం విశేషం. తండ్రి బిడ్డకు ఈ ప్రాంతపు అంగళ్లనుండి మెడకు కంటె, పాలుదాగే గిన్నె, పట్టు అంగీ, కాళ్ల గజ్జెలు, గంటలు తెచ్చిస్తాడని తెలుపుతూ వెండిగిన్నెల్లో వెన్నతినిపిస్తూ పాడుతుంది.

**వైశాకమసన లగ్గాన వడక లగ్గనా**
**వైదుగుడు నీ తండ్రి కంటె చేయించు "జో జో జో"**
**కార్తిక మసన కాడ లగ్గాన**
**కాంతుడు నీ తండ్రి కంటె చేయించు "జో జో జో"**

కార్తిక మసన కాడ లగ్గాన
కాంతుడు నీ తండ్రి కంటే చేయించు "జో జో జో"
దేవరకొండ అంగల్లో డేరముందళ్ళా
దేవుడు నీ తండ్రి డేగటాలాటాడు "జో జో జో"
అడపోయి నీగందు ఏమేమి తెచ్చు
పాలుదాగే గిన్నె తెచ్చు పట్టంగి తెచ్చు "జో జో జో"
నల్గొండ అంగల్లో నైరుముందల్ల
నరుడు నీ తండ్రి నమిలాటలాడు
అడపోయి నీగందు ఏమేమి తెచ్చు
కాళ్ళ గజ్జెలు తెచ్చు గంటలు తెచ్చు "జో జో జో"
వైశాక మాసన లగ్గాన వడక లగ్గనా
వైదుగుడు నీ తండ్రి చేయించు "జో జో జో"
కార్తిక మాసన కాడ లగ్గాన
కాంతుడు నీ తండ్రి కంటే చేయించు "జో జో జో"
వెండివే గిన్నల్లో వెన్న ఆరబోసి
వెన్న అరగించవయ్య వెలది కొమరా " జో జో జో" సారమ్మ: కందుకూర్

### 4. 2. 2. పెండ్లి పాటలు

స్త్రీ, పురుషుల జీవితంలో మిక్కిలి ప్రధానమైన ఘట్టం పెండ్లి. వివాహానికి ముందు పెళ్ళిచూపులు ఉంటాయి. ఒకరికి నొకరు నచ్చినట్లైతే పెద్దలచే శుభగడియన లగ్నం నిర్ణయిస్తారు. వివాహం వారివారి కుటుంబ ఆచారాల ప్రకారం చేస్తారు. అలా చేయనిపక్షంలో అపచారం జరిగినట్లుగా భావిస్తారు. వివాహంలో ప్రతి తంతుకి ఒక పాటపాడ్తారు.

### 4. 2.3. నలుగు పాటలు

పెండ్లి నిర్ణయం కాగానే పెండ్లి వారింట ముత్తైదువులందరూ చేరి సువ్వి పదాలను ఏలలు పాడుచు రోకళ్ళతో దంచుతారు. ఇంటిని పచ్చతోరణాలతో అలంకరిస్తారు. తర్వాత

పెండ్లికుమారునికి నలుగు పెట్టినప్పుడు స్త్రీలు పాల్గొంటారు. వరునికి, వధువుకి పసుపు పూసే ఆచారాన్ని 'నలుగు పెట్టుట' అంటారు. నలుగు పెట్టేటప్పుడు పాడేపాట ఇది.

**"బ్రహ్మ సరస్వతీ దయతో పంపిన నలుగు**
**నలుగు అదు పెండ్లి కొడకా నలుగు పాడవయ్యో**
**విష్ణు లక్ష్మీదేవి దయతో పంపిన నలుగు**
**పార్వతీ పరమేశుడు దయతో పంపిన నలుగు**
**సీతారాములు వాళ్ళు దయతో పంపిన నలుగు**
**లక్ష్మమస్వామియే ఊర్మిళ ఇద్దరమో**
**దయతో పంపిన నలుగు ఆదు పెండ్లి కొడుకా**
**మల్లయ్య పద్మచ్చి దయతో పంపిన నలుగు**
**వల్లయ్యఖరీమ్ దయతో పంపిన నలుగు**
**తమ్ముడు లింగము దయతో పంపిన నలుగు**
**మంజుల అర్జునయ్యా దయతో పంపిన నలుగు**
**నలుగు అదు పెండ్లి కొడకా నలుగు పాడవయ్యో" నూనె ఎల్లమ్మ : గోనకోల్**

ఈ గేయంలో బ్రహ్మ, సరస్వతి, విష్ణు, లక్ష్మీదేవి, పార్వతి పరమేశుడు, సీతారాములు, లక్ష్మమ్మ, ఊర్మిళ, మల్లయ్య పద్మచ్చి అని పాడుకుంటూ తల్లిదండ్రులు, అన్న–తమ్ముడూ, అక్క–బావ మొదలైన కుటుంబసభ్యుల పేర్లు చెప్పుకుంటూ నలుగుపాటలు పాడతారు. మగపెండ్లివారు బయలుదేరి వధువు ఊరికివచ్చి ఊరిబయట ఉంటారు. ఆడపెండ్లివారు ఎదురువచ్చి బాజా భజంత్రీలతోను బాణసంచాలతోను, గంధంపొడి, బుక్కా ఒకరిపై ఒకరు చల్లుకొని ఇంటికి తీసుకువెళ్తారు. దీనిని "ఎదురుకోళ్ళు" అంటారు.

ఎదురుకోళ్లు పూర్తయినతర్వాత పెండ్లి కూతురిని ఒకసారి పెండ్లి కొడుకుని ఒకసారి కూర్చోపెట్టి నలుగులు పెడతారు. నూనెనలుగు అనీ, గంధం నలుగు అనీ, కాలిగోళ్ల నలుగు అనీ ఇలా రకరకాల నలుగులు ఉంటాయి. ప్రతి నలుగుకీ పాటలు పాడి అలరించటం ఆనవాయితీ. నలుగుకు రమ్మని వరసైనవారు పాడినట్లు, నలుగుకు కావలసిన వస్తువులన్నీ

మేలైన ప్రదేశాలనుండి తెప్పించామనీ, ఒక్కొక్క వస్తువుకీ ఒక్కొక్క ప్రత్యేకత ఉందనీ అవన్నీ అందుకోడానికి వచ్చి నలుగు పెట్టించుకోమని వధూవరులను ఆహ్వానిస్తూ నలుగు పాటలు ఉంటాయి.

**"నలుగుకురావయ్యా నాద ప్రియనాథా**
**ఏగురంగారావయ్యా ఏనుగోపాలా**
**మల్లెపూలు తెచ్చి మాల అల్లినాడో**
**మగువహార చేతి మాల అందుకోవా**
**శనిగపూలు తెచ్చి షెండు అల్లినాడో**
**చంద్రుడా చేతి షెండు అందుకోవా**
**కోరెంగపూలు తెచ్చి గొలుసు అల్లినాడో**
**గోల తీరా చేతి గొలుసు అందుకోవా**
**పనా తీరా చేతి పట్టె అందుకోవా**
**నలుగుకు రావయ్యా నాదప్రియనాదా**
**ఏగురంగా రావయ్యా ఏనుగోపాలా"**        **మంజుల : వావిల్కోల్**

ఈ గేయంలో శ్రీకృష్ణుని కొలుస్తూ ముత్తైదవులు నలుగుకి ఆహ్వానిస్తూ పాడే పాట. నలుగు పెట్టుకోడానికి తొందరగా రావయ్యా అంటూ మెడలో మల్లెపూలు తెచ్చి మాలను అక్కడ ఉన్న మగువలతోటి పూలదండ చంద్రుని చేతిలో ఉన్నటువంటి పూల చెండు కొరెంగా పూలతో గొలుసు అందుకొని మెడలో వేసుకొమ్మని వరిడైన శ్రీకృష్ణుడికి స్వాగతం పలుకుతున్నారు.

అలాగే మరోపాటలో వధువుని సీతమ్మగా భావించి నలుగుకు అలంకరిస్తున్నట్లున్న పాట. వనముల్లో తిరుగుతున్న రామయ్యను సీతమ్మను నలుగుకు ఆహ్వానిస్తూ పాడినపాట ఇది.

**"సన్నజాజుల చీర కట్టినోలెవ్వరే**        **సఖియాను పిలువురే నలుగు పెట్టాని**
**సన్నజాజుల చీర కట్టు సీతమ్మా**        **సఖియాను పిలువురే నలుగుపెట్టాని**
**సన్నని ముత్యాలు డొల్పెటోలెవ్వలె**        **సంపంగి వనములో తిరిగెటోళ్ళెవ్వలె**

సన్నని ముత్యాలు డొల్పె సీతమ్మా సంపంగి వనములో తిరుగు రామయ్యా
దొడ్డువి ముత్యాలు డొల్పెటోళ్ళెవ్వరే దొరలతో సావసాంబు చేసే వారెవ్వరే
కోటెక్కి కోప్పులు పెట్టెటోళ్ళలెవ్వరే కొడుక్కుళ్ళు ఎత్తుకతిరిగెటోళ్ళలెవ్వరే
కోటెక్కి కోప్పులు పెట్టు సీతమ్మా కొడుకుళ్ళు ఎత్తుక తిరుగు రావయ్యా
మాలెక్కి మల్లెలు అల్లెటోళ్ళెవరే మామిడి వనముల తిరిగెటోళ్ళెవ్వరే
మాలెక్కి మాలల్లు సీతమ్మా మామిడి వనముల తిరుగురామయ్యా
రామలక్షులు కూడి బావి తవ్వెరె ఊరి ఉన్న నీళ్ళకు ఉల్లితోటళ్ళు
నిలబడ్డ నీళ్ళకు నిమ్మతోటళ్ళు పారి ఉన్న నీళ్ళకు పసుపుతోటళ్ళు
పచ్చవిచీరళ్ళు కట్టి నోళ్ళెవ్వరే పసుపునే తోటళ్ళుతిరిగేటోళ్ళవ్వరే
పచ్చవిచీరల్లు కట్టు సీతమ్మా పసుపునే తోటలో తిరుగురామయ్యా
ఎఱ్రవిచీరళ్లుకట్టనోళ్లెవ్వరే ఉల్లినే తోటళ్ళుతిరుగువారెవరె
తెల్లవిచీరల్లు కట్టు సీతమ్మా ఉల్లి తోటళ్ళ తిరుగు రావయ్యా”

ఎఱ్ర కాశమ్మ : బొగ్గులదోన

వివాహానికి ముందు రోజు పెండ్లి కొడుకుని ఇంట్లో పచ్చని పందిరిలో పీటల మీద ముత్తైదువుల చేత నలుగు పెట్టిస్తారు. నలుగు పెట్టే సమయంలో పాటలు పాడుకుంటూ నలుగు పెట్టే సమయంలో పాడే గేయం:

“కృష్ణున్నివేశులకు సింగార గుణవానికి
బంగారిపళ్ళెంలోనపసుపుతోననలుగిడరె
ముంగిళ్లుఊకించి ముత్యాలే పరపించి
మునిద్దలందరూగూఢి ముచ్చుతోనే నలుగిడవే
ఆకిండ్లుఊకించి వజ్రాలే పరిపించి
వాక్కలందరూగూఢి వందనంతో నలుగిడరె
పందిళ్ళుఊకించి పగడాలే పరపించి
ఫణతులందరూగూడిపస్తుగానలుగిడరె
సఖియాలందరూగూడి సంతోషముతో నలుగిడరె
గంధంబుకస్తూరు గమగమ వాసనలు
ఘరితలందరూగూఢి ఘనముగా నలుగిడరె” నూనె ఎల్లమ్మ : గోనకోల్

ముంగిళ్లు ఊడ్చి ముత్యాలుపరచి, వాకిళ్లు ఊడ్చి వజ్రాలు పరచి, పందిళ్లు ఊడ్చి పగడాలు పరచి బంగారుపళ్లెంలోని సువాసనలు వెదజల్లె గంధములతో కస్తూరి గుమగుమలతో కృష్ణుడికి నలుగులు పెట్టండని అహ్వానిస్తున్నారు.

పెండ్లికొడుకు నిత్యకల్యాణంతో నివ్వాలి కోరిన విధానాన్ని వరసపెట్టి చెపుతున్నారు ఈ పాటలో. పచ్చతోరణాల పందిరి కోరాడనీ, అరివేణి పూజలు కోరాడని, భాషికాలు అడిగాడని, బ్రాహ్మణున్ని తరుగులేని లగ్నం పెట్టమనీ అడిగాడని, సీతారాములను సుట్టుమెట్టెలు పెట్టి సురగంధం పెట్టి తవ్వెడు నూనెతో నలుగులుపెట్టి పార్వతీ పరమేశ్వరులు పేరంటం రాంగా పన్నెండు గుంజల పందిరికింద కల్యాణం చేసుకున్నారని వారికి మంగళం పాడమని కోరుతూ ఉన్న జానపదగేయం.

**"ఎర్రగా కూర్చొన్న వెంపలి క్రింద ఏనెగెను ఢీకోల్పి ఎక్కె బాలుడు**
**ఏనెగెను ఢీకోల్పిఎక్కె బాలుడు ఎక్కుతా బాలుడూ ఏమి కోరిండు**
**ఎక్కుతా బాలుడు ఏమికోరిండు నిచ్చె కళ్యాణం నివ్వాళ్ళికోరే**
**నిచ్చె కళ్యాణం కోరే నివ్వాళ్ళికోరే పచ్చదోరణం పందిరికోరే**
**పచ్చదోరణం కోరే పందిరికోరే ఆవిరేణికోరిందు అందములుకోరే**
**బాలబాషికము కోరే బ్రాహ్మణి కోరే బ్రాహ్మడు తనడు పోయి ఈశ్వరునికి కోరే**
**బ్రాహ్మడు ధనవై ఈశ్వరుని కోరే ఈశ్వరి లగ్గాలు విడిచి పోవయ్యా**
**ఈశ్వరి లగ్గాలువిడిచి పోవయ్యా నిడలేని లగ్గంబు ఏడు ఘడియళ్ళు**
**విడలేని లగ్గంబు ఏడు ఘడియళ్ళు తరుగులేని లగ్గంబు తరళిపోవయ్యా**
**తరగులేని లగ్గంబు తరళిపోవాలి మూత్యమ చూసి రామయ్యాకెంతోక మూక**
**ముత్యమ చూసిరావే మాకెంతో ముంగళ్ళు మున్నురు ఏనక ఏన్నూరు**
**వెనక ఏన్నూరుమూత్యమచూసిరావే మాకెంతోముంగళ్ళు మున్నూరు**
**ముంగళ్ళ మున్నూరు పెనక ఏన్నూరు పగడమ చూసిరావే పగడంతో పర్శ**
**పగడామచూసిరావేపర్శంతోపర్శ పక్కన పదినూళ్ళుఏనకఏన్నూరు**
**పట్టు గొడుగులా సంధుబాలుడెవ్వరి రఘురామడెవ్వరూ పెండ్లి కొడుకు రమ్యాసీతమ్మ**
**రఘురాముడి పెండ్లికొడుకు రమ్యాసీతమ్మా సుట్టుమెట్టెలు పెట్టి సురగంధం పెట్టి**
**సుట్టుమెట్టెలు పెట్టి సురగంధం పెట్టి గట్టి మెట్టె పెట్టి గంధములుపెట్టి**
**గట్టిమెట్టె పెట్టి గంధములు పెట్టి పార్వతీ పరమేశ్వరుని పేరాంటంపోంగా**

పార్వతి పరమేశ్వరుడు పేరాంటంపోంగా పన్నెండు గుంజాళ్ళ పందిరి కింద
పన్నెండు గుంజళ్ళ పందిరి కింద సోమసోమలాడేటినావిలిసోమన్ననావిలాటాడు
సోమ సోమలాడేటి సోమలనావిలి గదా తమ్ముడు నీ తలకురులు
సారెడుసారెడుశెల్పిరె నూనె గిద్దెడుగిద్దెడుగిల్పిరె నూనె
గిద్దెడుగిద్దెడుగిల్పిరె నూనె అద్దడు అద్దడుఅంటిరి నూనె
అద్దెడుఅద్దెడుఅంటిరె నూనె సోలెండు సోలెడు సోల్పిరెనూనె
తవ్వడు తవ్వడుతాపిరె నూనె వడ్డెడువడ్డెడువంటిరె
వడ్డెడువడ్డెడువంటిరి నూనె కుంచెడు నూనెల్లో కురులప్పజెప్పి"

**యానమల్ల వెంకటమ్మ : తప్లకాపూర్**

ఈ గేయంలో హారతి పట్టేటప్పుడు పాడేపాటలు ఎంతో రమణీయంగా అర్థవంతంగా ఉంటాయి. పై గేయం పెళ్ళికిముందు పెళ్ళికొడుకుకు హారతి పట్టే సందర్భంలోనిది. ఇందు పెళ్ళికొడుకు నిత్యకళ్యాణం కోరి పెళ్ళికి కావలసిన తంతును వర్ణించడం జరిగింది. పెళ్ళిలో ముందర మూడువందల మంది ఉండాలని కోరినట్టు ఈ గేయాన్ని పాడుతారు. తరుగులేని మంచిముహూర్తం పెట్టాలనీ ముందువెనకపక్కల వందలమంది పెండ్లికి వచ్చికూర్చోవాలనీ, పార్వతీపరమేశ్వరులు పేరంటం రావాలనీ, పన్నెండు గుంజలతో పందిరికట్టి అద్దెడు గిద్దెడు తవ్వెడు వడ్డెడు  కుంచెడు నూనెతో తలకురులకు నలుగులు పెట్టలని ఏకరువు పెట్టిన రీతి కనపడుతుంది.

### 4. 1. 2.2. మంగళహారతులు:

హిందూ సంప్రదాయం ప్రకారం హారతిపట్టడం సాధారణం. ఈ మంగళహారతులు శుభకార్యం చేసేటప్పుడు ఏదైనా కార్యం చేయడానికి వెళ్ళే సందర్భంలో మంగళహారతులు పాడుతుంటారు.  ఎక్కువగా పెళ్ళి సమయాల్లో, నలుగు పెట్టే సమయాల్లో, పెళ్ళి అయిన తరువాత తాంబులంలో రెండు కంచర్తులతో నూనె పోసి పత్తితో కంచర్తులను వెలిగిస్తారు. జానపదుల్లో పూజ కార్యక్రమాలు చేసేవారు ఎక్కువగా పాడతారు. క్రింది జానపద గేయంలో పెళ్ళి చేసుకుని జంటగా ఉన్న వధూవరులను మంగళ హారతి పాడుతున్న సందర్భంలోనిది.

“నామా జొన్నగడ్డ నడుమ కూరపాడుపక్కతాటి
కొండ పైన నీరు కొండ దానిమ్మా పుట్టనిల్లు దాని
కొండ అందుట్లా జేరింది నల్లజిల్లెడి కొమ్మ
మంగళం మంగళం
హరికి జయవందనం వందనం
చిటపట నడకలు చెంగై చీరలు
కొంగున మిరియాలు కస్తురాలు
నిండు పళ్ళెంలో నిలుచున్న హరిచంద్రా
ఏళితే నీ భార్య చంద్రవతి గాదా
॥మంగళం॥
తలుపు చెక్కల మీద తలాతలామెరవంగా
నులుపుటున్నెటా రీతు కనుకుతుండే
కురికే బంగారు బొమ్మ కుంకుమ్మ గురిజాల
రావణి బంగారాలు ఇగా రాములకు
॥మంగళం॥
ఆనాలు కురువంగా ఓరదాలు పరంగా
ఏట్లా పోతావు పెండ్లి కొడుకా నీవు
భూచక్రగొడుగు తాభూతాకుళితో
నడుము వడ్డేణంతో
॥మంగళం॥
నులుపుటెన్నెల రీతు కులుకుతుండే
కూలికే బంగారు బొమ్మ రావణి ఉంగాలు ఈగ రామలకు
॥మంగళం॥
పిరికితా నీను చెంబు పీటపై గజ్జెలు
రాతి రానీకంటి రామకథా
కోట చుట్టూ రెండు కోయిలాలు కూయంగా
నవ్వుతా రామయ్య నుదురుబైపల్లె” ॥మంగళం॥ నూనెఎల్లమ్మ : గోనకోల్

మరో మంగళహారతిపాటలో ఒడి బియ్యంపెట్టేవేళ తమ ఇంటి ఆడబిడ్డను సీతాదేవిగా భావించి ఆవిడకు రామాయణంలోని రామయ్య కుటుంబీకులందరూ వచ్చి తాము తెచ్చిన వస్తువులతో ఒడినింపినట్లు ఊహించారు జానపదులు. ఇందులో దశరథమహారాజు కోడలుకి మల్లేలు పంపినట్లు, కౌసల్యాదేవి తమలపాకులు పంపారనీ, సుమిత్రాదేవి పోకలుపంపారని, కైకమ్మ అంజూరా పంపినదనీ, పచ్చటిచీరపంపారనీ సొమ్ములు నింపి సీతమ్మను తీసుకుపోవడానికి వెండి బండిని పంపామనీ శ్రీహరి రాములోరికి సీతమ్మకూ పసుపులు సొమ్ములుపంచి సాగనంపమని తెలియజేస్తుంది. ఈ పాటను నలుగురైదుగురు స్త్రీలుకలసి పాడుతుంటారు.

**మామ నా దశరతకు సీతకు మంచి మల్లెలు పంపినాడు**
**మంచి మల్లెల్లు పంపినాడు అయిదుబైదు లెంసారె**
**ఎందుమొకి సుందరాంగిని ఒంగి ఒడి నించారె**
**అత్తరోకు కౌసులియా సీతకు అకులేమో పంపినాది**
**అకులేమో పంపినాది అయిదుబైదు లెంసారె**
**ఎందుమొకి సుందరాంగికి ఒంగి ఒడి నించారె**
**అత్తరోకు సుమిత్రకు పోకలేమో పంపినాది**
**పోకలేమో పంపినాది అయిదు బైదు లెంసారె**
**ఎందుమొకి సుందరాంగికి ఒంగి ఒడి నించారె**
**అత్తరూ కైకమ్మ సీతమ్మకు అంజూర పంపినాది**
**అంజూర పంపినాది అయిదుబైదు లెంచారె**
**ఎందుమొకి సుందరాంగికి ఒంగి ఒడి నించారె**
**పచ్చచీర తెచ్చినాము పనతినేమో పెంచినాము**
**ఒ మనుజులరా ఒనితకు ఒడి నించారె**
**ఒ మనుజులరా సఖియా సాగ దోలరె**
**వెండి బండి బెట్టినము వేలదినేమో పెంచినాము**
**ఒ మనుజులరా ఒనితకు ఒడి నించారె**
**ఒ మనుజులరా సఖియా సాగ దోలరె**

**చీర కట్టరె మన సీత దేవికి చీర కట్టరె**
**చీర కట్టిన సీతదేవికి శ్రీహరి రాములకు**
**సొమ్ములు పెట్టారే   సొమ్ములు పెట్టారే శ్రీహరి రాములకు**
**పసుపు పెట్టారే మన సీత దేవికి పసుపు పెట్టారే**
**కుంకుమ పంచారే మన సీత దేవికి శ్రీహరిరాములకు**
**కుంకుమ పంచారే మన సీత దేవికి శ్రీహరిరాములకు''గోరేటిలక్షుమమ్మ: చెర్కుపల్లి**

4. 2.5. హారతి పాట :

పెండ్లి అయి ఇంటికి తీసుకువచ్చినపుడు వాకిట్లో వధూవరులను నిలిపి హారతి తీసి పాడు పాట. దేవదేవులైన విష్ణువు, బ్రహ్మ, మహేశ్వరులు కలసి మిమ్మల్ని జతకూర్చినారనీ మీకు జోతలు అని తెలియజేస్తూ పాడేపాట. ఇందులో కొంత హాస్యం కొంత ఎగతాళి నిండి ఉంటుంది.

**ఈష్టు ఈశ్వర బ్రహ్మ ముగ్గురు జత**
**గుచ్చినార మీరు జోటమొచ్చినర**
**మీరు జోడు కూడినర**
**బాద్రచి శత్రాగ్గిలోనే జోటమచ్చినరా**
**మీరు జతనోచ్చినర చిన్న**
**మంచం సన్న నవరా సీతదేవి వచ్చెన**
**అలసి వచ్చి అడ్డములు ఒరిగేనా**
**అలసి వచ్చి సీత దేవి అడ్డములు ఒరిగేనా**
**కుదుడు పుల్లతోటి ఉపిరి ఆగిన లేవలేదు**
**కుదుడు పుల్లతోటి కొట్టిన ఆగిన లేవదు**
**చిన్న మంచం సన్న నవరా సీతదేవి వచ్చెన**
**చిన్న మంచం సన్న నవరా సీతదేవి వచ్చెన**
**కొబ్బరికాయల తోటి కొట్టి గాని లేవదు**
**కొబ్బరి కాయల తోటి కొట్టిన గాని లేవదు**
**అలసి వచ్చి సీత దేవి అడ్డములు ఒరిగేనా**

అలసి వచ్చి సీత దేవి అద్దములు ఒరిగేనా
బర్రెపలుపు తీసుకోని బాదినగాని లేవదు
బర్రెపలుపు తీసుకోని బాదినగాని లేవదు.        రామేశమ్మ: కందుకూర్

### 4. 2. 6. అప్పగింతలు:

వివాహంలో చివరి ఘట్టం అప్పగింతలు. వధువును అత్త వారింటికి పంపించినప్పుడు ఆకులు, పోకలు, కుడుకలు పసుపు బియ్యంతో కొత్త బట్టలతో వధూవరులకు ఒడిబియ్యంపెట్టి ఒడి నింపుతారు. పెండ్లి కుమార్తెను సాగనంపినప్పుడు తల్లిదండ్రులకు, అక్కా చెల్లెళ్ళకు కలిగే దుఃఖం చెప్పనక్కర్లేదు. చిన్నప్పటినుండి ఆటపాటలతో ఆడిస్తూ బుద్ధులు చెప్పి పెంచి పెద్దచేసి వేరే ఇంటికి పంపించాలంటే వారికి మనసొప్పదు. అయినా తప్పని పరిస్థితులలలో పంపిస్తారు. వధువుకు నచ్చజెప్పి అత్తమామలతో కూడా తమ కుమార్తెను మంచిగా చూసుకోమని చెప్తారు. వధువును అత్తగారింటికి తోలిస్తున్నప్పుడు తల్లి పాడే గేయంలో అన్నిరోజులూ మారాణిలా ఉండిననీవు మాకోసం బెంగపెట్టుకోవద్దు, పుట్టినింటికి ఎలాంటి అపకీర్తి తేవద్దు, ఓపిక పెంచుకుంటూ లోకులు మెచ్చేటట్లు మెలుగుకుంటూ, అత్తమామల క్షేమంకోరుకుంటూ భర్త సేవలో ఉంటూఉండు. ఎపుడైనా అత్త ఏమన్నా అన్నా ఎదురాడక ఉండాలమ్మా, పదిమందిచేత మంచిపేరు తెచ్చుకోవాలని హితబోధచేసి కూతురిని అత్తవారింటికి పంపుజానపద గేయం.

**"తల్లీనే పోయి వచ్చెదనమ్మా నా రామచిలుకా**
**తల్లిపై చిత్తముంచకమ్మా నా రామచిలుకా**
**కల్లబుద్దులుకడకుంచివు నీవు నా రామచిలుకా**
**ఎల్లకాల మారాణిలనుండు నా రామచిలుకా**
**మాకోసరమయ్యి చింతపడకు నా రామచిలుకా**
**మాకు అపకీర్తి మాటతేకు నా రామచిలుకా**
**ఓ వంకజాక్షి నీవు ఓపిక కల్గియు నా రామచిలుకా**
**లోకులు మెచ్చగలోలాక్షుండు నా రామచిలుకా**
**అత్తా మామలసేవాఎడల పతి సేవలోనూ నా రామచిలుకా**
**చిత్తా ముంచియు మెలగవలెను నా రామచిలుకా**

**సత్తచేత మీ అత్త కోపించితే నా రామచిలుకా**
**మత్తురాలపై మారు మాటాడకు నా రామచిలుకా**
**బుద్ధి కలిగి ఉంటివేనిన్నూ నా రామచిలుకా**
**ఎక్కీర్తముతోను ముద్దుగా తోలూకపోయ్యెదను నా రామచిలుకా**
**హద్దు లేక నీవటు ఇటు తిరిగితే నా రామచిలుకా**
**పద్దివచ్చునుపదుగురి లోపల నా రామచిలుకా"**

**బోయిని అలివేల :గ్రామం:బొల్లనపల్లి**

ఈ గేయంలో తల్లిదండ్రుల గురించి చింతపడవద్దు. అత్త, మామ, భర్త సేవలలో చిత్తముంచి మెలగాలి. నీవు ఇష్టమొచ్చినట్లు తిరిగితే పదిమందిలో చెడు మాట వస్తుందని బుద్ధులు చెప్పి వస్తుంది.

### 4.3.0. కుటుంబ సంబంధ గేయాలు

ధనవంతులైనా నిరుపేదలైనా సంసారం అన్నాక అన్ని కాలాలలోను అన్ని సమయాల్లోనూ ప్రశాంతంగా సాగదు. అత్తాకోడళ్ళమధ్యన, ఆడబిడ్డలమధ్యన, భార్యాభర్తలమధ్యన, అన్నాచెల్లెళ్ల మధ్యన గొడవలు ఎప్పుడైనారావచ్చును.

### 4. 3.1. అత్తా కోడళ్ల సంవాద గేయాలు

అత్తాకోడళ్ల కొట్లాటలకు అత్తకు కొడుకుపై ప్రేమ భార్యకు భర్తపై ప్రేమ ఎక్కువగా ఉంటుంది. ఇలా అత్తాకోడళ్ల మధ్య పరస్పర వైరుధ్యం సహజంగా ఉంటుంది. ఈ గేయంలో అత్తగారి అధికారాలను కోడలిపై రుద్దుతుంది. అత్త పెట్టె కష్టాలను చూసిన జానపదస్త్రీ ఆమె భావాన్ని ఈ గేయంద్వారా ఇలా చెబుతుంది.

| | |
|---|---|
| **"కోడళ్ళాకోడళ్ళా కొలికి ముత్యమా** | **పచ్చిపాల మీద మీగడ ఏదమ్మా** |
| **వేడి పాల మీద ఎన్న ఏదమ్మా"** | **అమ్మాలారాఅక్కలారా నాతల్లులారా** |
| **పచ్చిపాల మీద మీగడ ఉంటదా** | **వేడి పాలమీద ఎన్న ఉంటదా** |
| **అత్త పెట్టి నారా వారళ్ళకళ్ళ** | **అట్లాపోయ్యి అడిమిళ్ళోమనుగానైతి** |
| **మానన్నగానైతి మంచెలెతూరు** | **చెట్టున్నాగానైతి చెలిగెతురేమో** |
| **ఆకన్నాగానైతీ మేకళ్లుమేసు** | **సూర్యుని చేతిలో బారిగెనుఐతీ** |
| **గుజ్జరి గుజ్జరి గుమ్మళ్ళ కిందా** | **గుండె గళ్ళుమనే ఓ చందమామ** |

ఒయ్యారి ఒయ్యారి నీమ్మళ్ళ కింద ఒళ్ళు జల్లుమనే ఓ చందమామ
పొన్నళ్ళ కిందగా పోగునా కొడకా పోకనీయకు అత్తగారు పొద్దులేదానీ
రచ్చర్లుకిందగారాకున్నా కొడుకా రానీయ్యకుఅత్తగారురాసే కొడుకానీ
పూత పూసేనేమో నా పుణ్యమనీ పురిటికిరారైతిరినన్నుకన్నవారు
ఖాతా కాసేవేమోనాకర్మలేమో కానుపురారైతిరినన్నుకన్నవారు
పండు పండేనేమో నా పబ్బమేమో పండుగకు రార్రైతిరినన్నుగన్నవారు"

వడ్డె అంజమ్మ : ఖానాపూర్

ఈ గేయంలో మెట్టినింట్లో అత్తగారు పెట్టే పోరు అంతాఇంతాకాదు. సమయం దొరికితే కోడలిని తిట్టి పోయాలనే కలహప్రియత్వం. అత్తగారి పోరును భరించలేక కోడలు పడే వేదనకి ఈ జానపద గేయం అద్దం పడుతుంది. కోడలిని అత్తగారు పొద్దస్తమానం ఏదో సాకులు చెప్పి నిందలు వేస్తుంది. వాటికి అంతుపొంతూ ఉండదు. పచ్చి పాలమీద మీగడ ఎలా ఉంటుంది? వేడి పాలమీద వెన్న నిలుస్తుందా? ఇలాంటి ప్రశ్నలతో అత్తలు కోడళ్లను ఆరళ్ళు పెడుతుంటారు జానపద గేయాలలో. అత్త కోడలిని ప్రశ్నించినప్పుడు పదిమందితో చెప్పుకుని కోడలు తన గోడు వెళ్ళబోసుకుంటుంది. అడవిలో మానై పుట్టినా బాగుండేదని వేదన చెందుతుంది. పుట్టింటివారుకూడ కాన్పుకు తీసుకపోవడానికి రాలేదని మనస్తాపానికి గురికావడం ఈ గేయంలో కనిపిస్తుంది.

### 4. 3. 2. బావ–మరదళ్ళ గేయం

బావా మరదళ్ల సందన అవ్యాజమైన ప్రేమ ఉప్పొంగుతుంటుంది. వరుస కలిసిన వేళ ఆనందహేళకు అంతూపొంటూ ఉండదు. బావామరదళ్ల సరసమేకాదు వారిమధ్య పొరపొచ్చాలకీ ఒక సొబగు ఉంటుంది. ఒకరినొకరు ఇష్టపడుతూ ఇష్టంలేనట్లు జీవించటంలోని అగచాట్లు ఈ పాటలో కన్పిస్తున్నాయి.

"కరణం వారికందిసేను
తెనే దాని తెట్టేలకు
నల్లదాని గుబ్బలకు
లాటు కర్రదెబ్బలకు

పరవాలేదంటాదే రాగం ఈరమ్మ

పరవాలేదంటాదే రాగం ఈరమ్మ

అమ్మతోడు దుమ్ముతోడు

జానపాటి సైదులుతోడు

జీడికంటి రాములుతోడు

ఏ పాపం ఏరుగనురా బావా వీరయ్య

వాచ్చి మీద వొద్దిపువ్వురో చిన్నోడా

జకయకా కిందబడి పొంచారి గిల్లాయో

నీకు నాకు చంద్రగ్రహణమూ కుర్రోడా"

యాదమ్మ:గౌరారం

అనుమానాలకు ఆలవాలమైన బావమనసులో ఏర్పడిన అనుమానానికి మరదలి సమాధానం ఇందులో ఉంది. అనవసరంగా అనుమానిస్తే మన మధ్యనున్న బంధానికి చంద్రగ్రహణం తప్పదని హెచ్చరిస్తుంది.

### 4. 3. 3. వదినా మరదళ్ళ గేయం

వదిన మరదళ్ల పాటలు పరిహాసంతో కూడుకొని ఉంటాయి. వారి వేళాకోళాలు చూసిన వారికి కనుల పండుగగా ఉంటుంది. వదినా మరదలు మధ్యన ఉండే మానవసంబంధాలు మరదలకి వదినమీద ఉండే ప్రేమ, అనురాగాలు ఈ కింది గేయం తెలియజేస్తున్నది.

"ఆ చీరలీ చీరలేం చీరలే గౌండొల్ల పులమ్మా

అర్థ ఇత్త తీసుకో పిల్ల

అద్దం దువ్వెన తెచ్చుకో పిల్లా

పచ్చని పందిట్లో పెట్టుకొని సూస్కో పిల్లా

ఏం పిల్ల మాట్లాడవు

ఒక అమ్మకన్నా కూతురువమ్మా మమ్మ కోడల

మా అన్నయ్య పెళ్ళాం మాకు మా ఒదినె

ఏం పిల్లా మాట్లాడవు

**పావలా ఇత్తతీస్కో పిల్లా**
**పట్టి చీర తెచ్చుకో పిల్ల**
**పచ్చని పందిట్లో పెట్టుకొని సూస్కో పిల్లా**
**ఏం పిల్లా మాట్లాడవూ**
**ఒక అమ్మ గన్నకూతురువమ్మా మమ్మకోడల**
**మా అన్నయ్య పెళ్ళాం మాకు వొదిన**
**ఏం పిల్లా మాట్లాడవు" – రాములమ్మ : రామాంతాపూర్**

జానపదులలో ఎక్కువగా వదిన, ఆడపడుచులు ఆటపట్టించుకోవడం జరుగుతుంది. ఇది ఆ కోవకి చెందినది. ఒక అమ్మ కన్న కూతురువి మా అమ్మకి కోడలవి, మా అన్నయ్యకి భార్యవి మాకు వదినవి అర్ధరూపాయి ఇస్తా అద్దం దువ్వెన కొనుక్కోని పచ్చని పందిట్ల పెట్టుకుని చూసుకో, పావలా ఇస్తా పట్టీలు తీసుకోమంటూ ఆట పట్టించే సరదా గేయం.

### 4. 3. 4. అన్నచెళ్ళెల తలుపుల దగ్గరి గేయం

ఈ పాటలు అన్న చెల్లెలు మధ్యన లేదా అక్క తమ్ముడు మధ్యన పెళ్లి చేసుకొని ఇంటికి వచ్చినపుడు తలుపులదగ్గర నిలబడి ఆ ఇంటి ఆడపడుచులు పాడుతారు. పెండ్లి మండపంనుండి వచ్చి ఆవిరేని కుండలముందు నిలబడి బాసింగాలు తీసేటపుడు తలుపులు మూసి పేరంటం పాటలు పాడి భార్యభర్తలచేత వారివారి పేర్లు చెప్పించి తలుపులు తీస్తారు. పెండ్లి వేడుకలో ఇది ఒక సరదా పాట. ఈ తలుపుదగ్గరి పాటలలో భార్యభర్తల సంవాదానికే ప్రాధాన్యం ఉండేది. కాలక్రమాన అన్న చెల్లెలు, అక్కతమ్ముడు మధ్యన జరుగు సంవాదానికి ఎక్కువ ప్రాధాన్యత ఏర్పడింది. నేడు జానపదంలో ఈ పాటలకే విశేష ప్రచారం ఉంది అన్నాచెల్లెళ్ల సంవాదంలో అన్నకి పుట్టబోయే కూతురిని చెల్లెలు కొడుకుకి మేనరికం వరుసలో తమ కొడుకు ఇవ్వమని అడిగే సందర్భం ఈ గేయం తెలియజేస్తుంది.

**"ముత్యాల వాన కురిసే ముద్దుడు మీ అన్న తడిసే**
**తలుపుళ్ళు తీయవమ్మో ఇంట్లున్న ఆడపిళ్ళా**
**తలుపుళ్ళు తీయవమ్మో ముత్యాల వాన కురవలె**
**ముద్దుడు మాయన్న తడవలె ముద్దుడు మాయన్న తడవలె**

తలుపుళ్ళు తీయలమ్మో తగదమ్మో ఇయ్యలా
తగదమ్మో ఇయ్యలా వజ్రాల వాన కురిసె
వరుడు మీ అన్న తడిసే తలుపుళ్ళు తీయవమ్మో
తగదమ్మో ఈరోజు వజ్రాల వాన కురువలే
వరుడు మాయన్న తడవలే వజ్రాల వాన కురువలె వరుడు మాయన్న తడువలే
తగదమ్మో ఈరోజు పగడాల వాన కురిసే
బాలుడు మీ అన్న తడిసే తలుపులు తీయవమ్మో
తగదమ్మో ఆడపిల్లా పగడాల వాన కురవలే
బాలుడు మాయన్న తడవలే తగదమ్మో ఈరోజు
ఏవరమ్మో తలుపు పెట్టింది ఆడపిల్లాను ఎందుకు వచ్చినమ్మో
పిల్లాకొచ్చిన ఇయ్యం పిల్లాను మీ యింటి మొగవారు
ముచ్చు సమాధులమ్మో ఆకు హోలము తిని
ఆడవి లోపల మీరు పరుపు బండాల మీద
పండేటి వారమ్మ బిడ్డా నీవ్వను చెల్లారా సుభద్ర
మీయింటి మొగవారు చెల్లారా సుభద్ర ముచ్చు సమాధులైతే చెల్లారా సుభద్ర
నన్ను ఎందు ఎందుకిచ్చినావు అన్నయ్య బాలురామ
ఆకు హోలము తిని అడవిలోపల వాళ్ళు
కాయగసరు తిని పండేటి వారికి నన్నెందు కిచ్చినావు
అన్నయ్య బాలురామ నన్నెందుకుచ్చినావు అన్నయ్య బాలురామ
నేను చిన్నగున్నా నాకు తెలియదు చెల్లా మన తండ్రిచ్చినాడు అడగరా నాచెల్లా
కూసునేపీటాలీస్తా కుంకుమ కాయలిస్తాబిడ్డా నువు అను నీకు చెల్లారా సుభద్ర
కూసునే పీటాలోల్లా కుంకుమ కాయలోల్లాబిడ్డానువ్వురానాకుఅన్నయ్య బాలరామ
పెట్టెళ్ళా సొమ్ములిస్తా కలనా గంపలిస్తా బిడ్డా వాను హోరా చెల్లా సుభద్ర
కళ్ళనా గంపలోళ్ళ దండేనా చీరలోల్లబిడ్డా నువ్వు హోరా నాకు అన్నయ్య బాలరామ
బర్రె పడ్డానిస్త కొట్టుక పోర చెళ్ళ బర్రె పడ్డాను నువ్వు కొట్టుకొని పోవమ్మ
అన్న బలురమ బర్రె పడ్డ వద్దు నీ పందిరి గుంజకు కట్టేసుకొయ్యా
అన్న బలురమా బిడ్డ నీవు రా నాకు అన్న బాలురమ బిడ్డ రా నాకు

**పెట్టల్ల  సొమ్ములిస్త దండెంనా చీరలిస్తా బిడ్డవను నాకు చెళ్ల సుభద్ర**

**దండెంన  చిరలోద్దూ పెట్టెల్ల సొమ్ములోద్దు        బిడ్డవను నాకు అన్నయ్య బలురామ**

**ఇయ్యా  రాదయ్యా బిడ్డను అంట                ఇస్తా ఇస్తా పొర నా బిడ్డ**

**నా బిడ్డను పొర ఇస్తారో                 నీ మాట నా మాట ఒకటి అయ్యేగాని**

**ఆమెతో ఒక మాట అనిపించయ్య                చెప్పరాదమ్మా ఇస్తానని**

**చెప్పు చెప్పు                 ఇస్తా ఇస్తా" దొడ్డి అలివేల, గౌరారం**

ఈ గేయంలో అన్నచెళ్ళల మధ్యన జరిగే సంవాదంలో అన్నయ్య వానలో తడిసి వచ్చి తలుపుదగ్గర నిలబడి చెల్లెలిని తలుపులు తీయమని అడుగుతాడు. అప్పుడు ఆమె కొడుకుకి బిడ్డని ఇవ్వమని అడిగితే అతను ఇవ్వను అని చెల్లిని మీరు అడవిలో ఆకులు తిని బండల మీద జీవిస్తారు. అలాంటి  వాళ్ళకి నేను నా బిడ్డను ఇవ్వలేను కానీ కూసునే పీటాలు, కుంకుమ కాయలు, పెట్టెనిండ చీరలు, గంపలు, దండెం నిండ చీరలు, బర్రె పడ్డని ఇస్తా తీస్కపో అన్న వినకుండా నన్ను ఎందుకు ఇచ్చావు అని అడిగితే నేను నిన్ను ఇవ్వాళే నాన్న ఇచ్చాడు నాకు తెలియదు చెల్లెలా అంటాడు. అయిన వినకుండా బిడ్డను ఇప్పించుకునే సంవాదం ఈ గేయం ద్వారా అర్థం అవుతుంది.

## 4.4. పారమార్థికాలు :

పారమార్థిక గేయాలు ఎక్కువగా భక్తితోనూ, దు:ఖాతీతంగానూ ఉంటాయి. ఈ పాటలలో జనన మరణ బాంధవ్యబంధాలు, ఇతరులతో చెప్పుకోలేని వెతల్లు, మానసిక అస్థిరత్వ నివేదనలు వంటి అంశాలతో నిండిఉంటాయి. డిందిమండల గేయ సేకరణలో లభ్యమైన పారమార్థిక గేయంలో పాపపుణ్యాల నిలయమైన ఈ ఇలలో మేలుకోవే వెర్రిదానా అంటూ, ఇవ్వళ ఉన్న ఈ బంధాలన్నీ చనిపోయేటపుడు నీ వెంటరావనీ, శరీర సౌందర్యంకోసం పాకులాడవద్దని, కాలయముడు మనల్ని తీసుకుపోడానికి ఎపుడూ ఎదురుచూస్తుంటాడని మరవకు అని హితబోధ చేస్తున్నట్లుంటుందీ పాటలోని అర్థం

**మేలుకొనవేవెర్రిజీవమ**

**చాలు నీకిలలోన సౌఖ్యము**

**కాలయముని బాధ కోర్వగలేవుమేల్కొనుమా**

జీవా నిద్ర మేల్కొ సుమా
పాపమైనను పుణ్యమైనను
నీకు దప్పదు దాత వ్రాసెను
కోపపడకు చెప్పిలెనని
త్వరితముగా మేల్కొనుమా జీవా నిద్ర మేల్కొనుమా
తల్లిదండ్రులు తనయులాప్తులు
ఎల్ల బాంధవులెందరుండిన
ఎల్లిపోయెనాడు ఎవరు
వెంటరారు సుమా జీవా నిద్ర మేల్కొనుమా
కీలునరములు పైన చక్కని
తోలు గప్పినవాన్ని గానక
మేలెమని దేహంబు జూచుక
చాల మురిసెదవూ— జీవ నిద్ర మేల్కొనుమా
రక్తమాంసము తిత్తిలోపల
రాజువలె కూర్చుంటె ఫలమా
కత్తి నూరుచునుండె కాలుడు
మత్తు మరవగదే జీవా నిద్ర మేల్కొనుమా రాగం కాశమ్మ : డిండి

ఈ పారమార్థిక గేయంలో మానవునికి పాపమైనా పుణ్యమైనా తప్పవని తల్లిదండ్రులు, కొడుకులు, మిత్రులు, బంధువులు ఎంతమంది ఉన్నా మనం చనిపోయినప్పుడు మన వెంట ఎవరూ రారనే వాస్తవాన్ని ఈ గేయం తెలియజేస్తుంది. మనిషి జీవితంలో ఏదీ శాశ్వతమైనది కాదు. సుఖ సంతోషాలు మాని జాగరూకతతో మెలగమని ఈ గేయం బోధిస్తుంది

పారమార్థికగేయాలలో నిండుగా వేదాంత సంబంధ అంశాలు నిండిఉంటాయి. నాలుగువేదాలను, అరిషడ్వర్గాలను, పంచభూతాలను, అండపిండబ్రహ్మాండాలను, భూమ్యాకాశాలను, పగలూరాత్రులనూ, బిడ్డకోసం ఉయ్యాలగానూ, గొలుసులుగాను, పడక

వస్తువులుగానూ, ఉయ్యాల ఊపేవారుగాను అన్నింటా వేదాంత సంబంధంతో తాత్వికదృక్పథంతో నిండినవస్తువుతో పాటలు కన్పిస్తున్నాయి.

**నాలుగు ముల్లది వెయ్యికండ్లది**
**ఒంటిదూలము ఒక్కటే ఊగే ఉయ్యాలో**
**ఒంటిదూలము ఒక్కటే ఊగే ఉయ్యాలో**
**తెలుపు నలుపుది పచ్చ తెలుపుది**
**తెలుపు పరుపు దిండును వేసిరి ఉయ్యాలో**
**పరుపు దిండును వేసిరి ఉయ్యాలో**
**పసిడికన్నెలు అయిదుగురు**
**వచ్చితొట్టి పట్టి ఉపిరి ఉయ్యాలో**
**అండండము పిండండము బ్రహ్మండమే**
**దిండుపాయె ఉయ్యాలో**
**బ్రహ్మండమే దిండుపాయె ఉయ్యాలో**
**మట్టి నీరుతో ఆస్తులు జేసే**
**అగ్నిగుండంలో అయిషువు పోసే ఉయ్యాలో**
**అగ్నిగుండంలో అయిషువు పోసే ఉయ్యాలో**
**ఒక్కడ గరుడు ఒక్కడే ఉండే బ్రహ్మ**
**బాపనయ్య ముందుగ ఉండే ఉయ్యాలో**
**బాపనయ్య ముందుగా ఉయ్యాలో –కుతాటి లక్షుమమ్మ : డిండి**

## 4. 5.0 డిండి మండల శ్రామికగేయాలు (వ్యవసాయ సంబంధమైనవి)

'కృషితో నాస్తి దుర్భిక్షం' అనే ఆర్యోక్తి శరీరాన్ని దాచుకోకుండా చేమటోడ్చి జీవించే జానపద శ్రామికులకు చక్కగా వర్తిస్తుంది. శ్రామికులే ఉత్పత్తి కారకులు. ఉత్పత్తిక్రియతో శ్రామికుడు నానా కష్టాలు, ఆయాసాలకు గురి అవుతాడు. బరువు మోసేవాడైనా, బరువు లాగే వాడైనా, హమ్మయ్య, హైసా, హైలేసా వంటి కేకలతో 'అరే పట్టురా, అరే గుంజురా అనే మాటలు ఆవేశంగా వ్యక్తీకరిస్తాడు. ఆ కేకల, మాటల స్థానంలో పదాలు చోటు

చేసుకుంటాయి. ఉత్పత్తిక్రియలో పాట ఒక భాగమై పోతుంది. ఆ పాట శ్రామికుణ్ణి రంజింప చేస్తుంది. ఆనందాన్నిచ్చి అతని శ్రమకు శక్తిని పెంచడానికి ఉపకరిస్తుంది.

కష్టించి పనిచేసే శ్రామికుడు కష్టాన్ని మరిచిపోయి, తన అంతరాంతరాల్లో అవ్యక్తంగా దాగున్న అనుభూతి విశేషాల్ని ఆనంద పారవశ్యంతో లయాత్మక శబ్దాలతో వినసొంపైన పదాలకూర్పుతో గేయాలు రూపొందిస్తారు. డిండి మండలంలోని గ్రామాలల్లో వ్యవసాయం చేసి జీవించే జానపదులకు దినచర్యలో మోటగట్టడం, పొలానికి నీళ్ళు కట్టడం, భూములు చదునుచేసి దున్నడం, విత్తనాలు చల్లడం, పంటలు పండించటం, వడ్లు తూర్పారబట్టడం, మరికొందరు శ్రామికులు రాళ్లు కొట్టడం, రోడ్లువేయడం మొదలైన పనులు చేస్తుంటారు. ఈవిధంగా ఏదైనా "పని చేసుకునేటప్పుడు, శ్రమ సంబంధ వాతావరణం, ఆసందర్భంలో పాడుకునే పాటల్ని మాత్రమే పని పాటలు లేదా శ్రామికగేయాలు" అంటారు. ఈ గేయాలు ఇంటిలో పనిచేసుకునేటప్పుడైనా, బయట పని చేసుకునేటప్పుడైనా పాడుకోవచ్చును. కావున ఈ గేయాలను రెండు భాగాలుగా విభజించుకోవచ్చు. 1. బయటపనుల్లోపాడేపాటలు, 2. ఇంటిపనుల్లోపాడేపాటలు.

### 4.5.1 బయటపనుల్లోపాడేపాటలు.

బయటిపనుల్లోపాడేపాటలను (1). వ్యవసాయ సంబంధమైనవి, (2). వృత్తి సంబంధమైనవి అని మరి రెండు ఉపభాగాలుగా విభజించవచ్చు.
వ్యవసాయసంబంధ గేయాలలో మొదట వానపాటలతో ప్రారంభమౌతుంది.

### 4. 5. 2. వానదేవుడి పాటలు

జానపదులు ఉగాదిపండుగతో వ్యవసాయం మొదలుపెడతారు. మెట్టభూముల్లో వేసిన పంటలు సంక్రాంతివరకు ఇంటికి వస్తాయి. నాటినుండి ఉగాదివరకు పొలాలు బీడుగా ఉన్నందువల్ల ఆ భూమిలో ముళ్ళపొదలు, చిన్నగడ్డిమొక్కలు మొలుస్తాయి. ఉగాదిని శుభదినంగా భావించి ఆ రోజే ముళ్ళకంపలు, పొదలను రెండుమూడు కలుపు మొక్కలను నరికి వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. ప్రారంభించిన నాటినుండి చెలగ భూముల్లోని కంపచెట్లను నరికి, ముండ్ల పొలంలో ఏరివేసి ఎడ్లబండ్లతో ఎరువుకొట్టి, గుంటకనాగళ్ళతో భూమిని సాగుచేసి వర్షంకోసం ఎదురుచూస్తారు. ఈ పనులన్నింటిని వర్షానికి ముందు

చేస్తారు. వర్షాలు సాధారణంగా రోహిణి, మృగశిర కార్తెలలో వస్తాయి. కొత్తతాళ్ళను, కొత్తనాగళ్ళను, కొత్తవిత్తనాలను సమకూర్చుకొని నాగళ్ళు దున్నడానికి సిద్ధంగా ఉంచుతారు. సరియైన సమయంలో వర్షాలు పడనప్పుడు పాడేగేయం.

**"వానల్లు కురవాలి వానదేవుడా వరిచేలు పండాలి వానదేవుడా**
**పన్నెండు ధాన్యాలు వానదేవుడా బండమీద పండాలి వానదేవుడా**
**మా కడుపు నిండాలి వానదేవుడా కుంట చెరువులు నిండాలి వానదేవుడా**
**బీదసాద బతకాలి వానదేవుడా పేదసాద బతకాలి వానదేవుడా**
**కూలినాలి దొరకాలి వానదేవుడా పేదసాద బతకాలి వానదేవుడా**
**పారిపోయిన బావ వానదేవుడా పరుగెత్తి రావాలి వానదేవుడా**
**ఊరికి వెళ్ళిన బావ వానదేవుడా ఉరికి రావాలి వానదేవుడా**
**తల్లిలేని బిడ్డలు వానదేవుడా తండ్లాట పడ్డారు వానదేవుడా**
**పసిబిడ్డ బాలకులు వానదేవుడా తండ్లాట పడ్తారు వానదేవుడా**
**చెరువంత మబ్బుపట్టి వానదేవుడా చెరువంత నిండాలి వానదేవుడా**
**తూరుపున మబ్బుపట్టి వానదేవుడా తుళ్ళి తుళ్ళి కురవాలి వానదేవుడా**
**పడమట మబ్బుపట్టి వానదేవుడా పట్టిపట్టి కురవాలి వానదేవుడా**
**ఉత్తరాన మబ్బుపట్టి వానదేవుడా ఉరికురికి కురవాలి వానదేవుడా**
**వాగు తల్లి నిండాలి వానదేవుడా కడవల్లు నిండాలి వానదేవుడా**
**డబ్బుకు తవ్వెడు బియ్యం వానదేవుడా మనిషికిద్దరు పెండ్లాంలు వానదేవుడా"**

**వరికుప్పల లక్ష్మమ్మ : గోనబోయినపల్లి**

ఈగేయంలో జానపదులు సకాలంలో వర్షాలులేక వలస వెళ్ళిన వారంతా తిరిగి గ్రామాలలోకి వచ్చిపంటలు పండించుకొని కుటుంబ సమేతంగా సుఖప్రదమైన జీవనాన్ని గడపాలనే కోరిక కనపడుతుంది. ఈ గేయంలో అందమైన ప్రకృతివర్ణన వారి కవిత్వంలో సహజ పునరుక్తి ముచ్చట గొల్పుతునాయి. వర్షాలు కురవనపుడు జానపదులు కప్పలకు పెండ్లిళ్ళు చేసే ఆచారం ఈ గేయంలో కనపడుతుంది. అలా తాము పెండ్లి చేసిన కప్ప వర్షాలు కురిసి నీళ్ళాడాలని జానపదులు  జానపదులు వర్షాన్ని అహ్వానించడం ఈగేయంలో కనపడుతుంది.

### 4. 5.3. ఏరువాక

రైతులకు ఏరువాక పండుగ ముఖ్యమైంది. దీనిని జ్యేష్ఠశుద్ధపూర్ణిమ నాడు పాటిస్తారు. జ్యేష్ట మాసంనుండి వర్షాకాలం ప్రారంభమౌతుంది. చక్కని వర్షారంభంలో వ్యవసాయ జీవనం ఏరువాకలో ప్రారంభిస్తారు. రైతులు ఉదయానే ఎడ్లను బాగా కడిగి అలంకరిస్తారు. కొత్తనాగళ్ళకు ఎడ్లను కట్టి వాటికి బొట్టుపెట్టి రైతులుకూడా బొట్టు పెట్టుకుంటారు. స్త్రీలు విత్తనాల కుండకు సున్నం పూసి దానికి పసుపుకుంకుమ బొట్లు పెట్టి కుండనిండుగా విత్తనాలు పోసుకొని నాగలితోపాటే పొలాలకు బయలుదేరుతూ –

**"ఏరువాకసాగారోరన్నో చిన్నన్నా**
**నీ కష్టమంతా తీరునురోరన్నోచిన్నన్నో"**

అని పాడుకుంటూ తమ కష్టలు గట్టెక్కుతాయని సంతోషిస్తూ పొలాలకు పోతుంటారు. ఈ కింది ఏరువాక పాటను జానపద స్త్రీలు కలుపు పాటలో పాడుకుంటారు.

**"జెలజెలవానగొట్టెజెలతికాల్వల్నిండియో ఈ వనముల్ల**
**జెలతికాల్వల్ నిండి జగమెల్లపారంగయో ఈ వనముల్ల**
**జగమొల్లపారంగతుంగమదుగులునిండియో ఈ వనముల్ల**
**గంగ బావులు నిండి గనుమెల్లిపారంగయో ఈ వనముల్ల**
**గనుమెల్లిపారంగచెఋవుకుంటలునిండాయో ఈ వనముల్ల**
**చెఋవుకుంటలు నిండి సెలిమలుపారంగ ఓ ఈ వనముల్ల**
**ఒక్కొక్కచేపోచ్చే, సీరంలజేలెచ్చే ఈ వనముల్ల**
**సీరంలజేలోచ్చే, పట్టి గడ్డనవేసి ఈ వనముల్ల**
**అంగట్లతురుకోడుబలురుదండి మొనగాడు ఈ వనముల్ల**
**అంగట్లతురుకోడు చేపకే ధర పెట్టెయో ఈ వనముల్ల**
**అంగట్లతురుకోడుచేపాకే ధర పెట్టెయో ఈ వనముల్ల"**

**(నసారమ్మ : ప్రతాప్ నగర్)**

ఏరువాక నాటి వర్షానికి చెరువులు, కుంటలు, బావులు అన్నింటిలో నీరు పొంగి పొర్లాడుతుందని వారి సంతోషంతో పాడే పాట. వర్షాలు పుష్టిగా కురిసిన తర్వాత నీరు గుట్టల

క్రింద –చెఱువుల కింద ఊటలా పారుతుంది. ఆ నీటినే "సెలిమ నీరు" అంటారు. చెఱువులో ఉండే చేపలు వాగులద్వారా ఎదురెక్కుతాయి. అదే అదునుగా చూసుకొని కొందరు చేపలు పట్టి అమ్ముతుంటారు.

### 4. 5.4. నాగలిపాటలు

మెట్ట భూముల్లో వర్షాలు పుష్టిగా పడ్డ తర్వాత విత్తనాలు వేస్తారు. మెట్ట భూముల్లో జొన్న, సజ్జ, వేరుశనగ, పత్తి, ఆముదాలు ఎక్కువగా వేస్తారు. పేద రైతులు ఒకటి రెండు నాగళ్ళు వరకు భూస్వాములు ఐదు ఆరు నాగళ్ళ వరకు కడుతారు. విత్తనాలు వేయుటకు కూలీ స్త్రీలను పిలుస్తారు. నాగలి ముందుకు సాగుతూ ఉంటే అదే వరుసలో ఆ కూలీ స్త్రీ విత్తనాలు వేస్తూ పోవాలి. నాగలి దున్నేటప్పుడు వారిద్దరు సరసాలాడుకుంటూ చక్కగా పాటలు పాడుతారు. నాగలి దున్నే రైతు ఆ స్త్రీ వైపు పదే పదే చూస్తూ ఉంటే –

**"తెల్లచీర కట్టుకొని నాగుమల్లెదారిలో తెల్లజొన్నలెయ్యబోతే నాగుమల్లెదారిలో**
**వాడుచూసేచూపులకునాగుమల్లెదారిలో తెల్లచీరఎరుపులాయేనాగుమల్లెదారిలో**
**పచ్చచీర కట్టుకొని నాగుమల్లెదారిలో పచ్చజొన్న లెయ్యబోతేనాగుమల్లెదారిలో**
**వాడుచూసేచూపులకునాగుమల్లెదారిలో పచ్చచీరతెలుపులాయెనాగుమల్లెదారిలో**
**ఎర్రచీర కట్టుకొని నాగుమల్లెదారిలో ఎర్రజొన్నలెయ్యబోతేనాగుమల్లెదారిలో**
**వాడుచూసేచూపులకునాగుమల్లెదారిలో ఎర్రచీరతెలుపులాయెనాగుమల్లెదారిలో**
**అనసూయ గ్రామం : కామేపెల్లి**

రైతులు వేసే జొన్నలు మూడు రకాలు. తెలుపు, పసుపు, ఎరుపు రంగు కలిగిన జొన్నలు, ఆ స్త్రీ కట్టే చీరలుకూడా ఆ జొన్నలను పోలి అతని గాఢమైన చూపులకు ఆ చీర రంగులు వెలిసి పోయాయని భావిస్తుంది. తెలుపుచీర ఎరుపులాయె, పసుపుచీర తెలుపులాయె, ఎర్రచీర తెలుపులాయె అనే వాక్యాలు అతని చూపులు తీవ్రమైనవని తెలియజేస్తున్నాయి.

### 4. 5.5. మోటపాటలు/కపిల పాటలు

వరి పంటను చెఱువులు, కుంటలు, బావులు కింద పండిస్తారు. చెఱువు, కుంట నీళ్లు కాల్వల ద్వారా వస్తుంది. బావినుండి నీటిని తోడుటకు మోటను ఉపయోగిస్తారు. బావి వైశాల్యాన్నిబట్టి ఒకటినుండి ఆరుమోటలదాకా ఉంటాయి. అందుకే కొన్ని బావులకు 'ఆరు మోట్ల' అన్న పేరు నిలిచింది. మోట కొట్టే జానపదుడు రాత్రి "గొర్రు కొయ్యలు" పొడిచినప్పుడు చలి చీకటి నిద్ర అనకుండా లేచి ఇంటినుండి తాళ్ళు, ములుకోలకర్ర పట్టుకొని పశువులను బావికి తోలుకొని పోయి మోట కడతాడు. మోటసాగునప్పుడు పాడుకునే పాటలు గ్రామస్థులకు సుప్రభాతంలా వినిపిస్తాయి. వీరి చుట్టూ ఉన్న చెట్లు ఊగడం, మోట ఎద్దుల లయబద్ధంగా అడుగులు వేయడం, మెడలో గంటల శబ్దం బావి గిరక గరగరలాగడం మోట పాటకు సంగీతంగా పనిచేస్తాయి.

**అల్లోనేరడల్లో అల్లోనేరడల్లో**
**అల్లల్లనేరడి అల్లనేరాడి అల్లోనేరడల్లో**
**మోటకొట్టేటి జాణ పేరేమి అల్లనేరడల్లో**
**కోర మీసాలవాడు కొమరెల్లమల్లు అల్లనేరడల్లో**
**మోటనడిసేటి ఎడ్లపేరేమి అల్లనేరడల్లో**
**పెరిపేడు నీళ్ళు పోసే పెంపాయెమాను అల్లనేరడల్లో**
**రెండాకులేసి మూడాకులేసే అల్లనేరడల్లో**
**మూడాకులేసి ఆరాకులేసే అల్లనేరడల్లో**
**ఇంతవోయి అంతవోయి పెరిగెనోమాను అల్లనేరడల్లో**
**ఆ మాను కొమ్మలు పెళ్ళిదోరణాలు అల్లనేరడల్లో**
**ఆ మానుకట్టె పెళ్ళిపీటలు అల్లనేరడల్లో** **ఈదమ్మ, రామాంత పూర్**

ఈ గేయంలో మోటనడిపే "కొమరెల్లి మల్లు" తమ సంతతిగా భావిస్తారు. పశువులకు ముల్లు విరిగినా, దెబ్బ తగిలినా ఆనారోగ్యంగా ఉన్నా వెంటనే చికిత్స చేయిస్తారు. జానపదులు బావి చుట్టుప్రక్కలా మామిడి చెట్లు పెంచుతారు. వారికి నిత్యం కనిపించే ఆ చెట్లు పెద్దదై దాని ఆకులు పెళ్ళి తోరణాలుగా, దాని కట్టెలు పెళ్ళి పీటలుగా ఉపయోగపడతాయని ఉబలాటపడతారు.

### 4.5.6. నాట్లు పాటలు

రైతులు పొలం దున్ని గొర్రుకొట్టి, మొలక అలికి, చెరువు నీరుగాని, బావినీరుగాని పారిస్తారు. నెల రోజులలోపే మొలక పెరిగి నాటుకు వస్తుంది. ఆ వరిని పీకి కట్టలుగా కట్టి వేరే మళ్ళలోనికి తీసుకొనిపోయి విడివిడిగా నాటుతారు. దీనినే "వరినాట్లు" అంటారు. వరినాట్లు ఎక్కువగా స్త్రీలు వేస్తుంటారు. వరినాటడంలో శ్రామికుల సామూహిక శ్రమ కనపడుతుంది. ఇతర గ్రామాలనుండికూడా నాట్లు వేయడానికి స్త్రీలు కూలికి వస్తుంటారు. ఆ కూలీ స్త్రీలందరూ వరి మళ్ళల్లో వరుసగా వంగి ఒక చేతిలో వరికట్టును పట్టి, మరో చేతితో పొలంలో వరిని విడివిడిగా నాటుతూ మెల్లగా ఒక్కొక్క అడుగు వెనుకకు వేస్తూ పోతుంటారు. పని చేస్తూనే శ్రమ మరిచిపోవటానికి పాటలు పాడుకుంటారు. వీరు పొలంలో దిగి మునుములు పట్టిన కొద్దిసేపటికే పాట మొదలుపెడతారు. ఒకరు పాట చెప్తుంటే మిగిలిన వారంతా వంత పాడుతుంటారు.

**"ఏట్లాచాకలిదో వలలో ఈలలు వేసి ఉతికే ఏన్నెలా**
**రచ్చర్లుపేలేటిఏన్నెలా రాజు కన్నులు లేసే ఏన్నెలా**
**రాజు కన్నులేసే బంటుల తోలిండోఏన్నెలా బంటుల తోలిండోఏన్నెలా**
**రావే సఖిదానాఏన్నెలా రాజు పిలిచినాడోఏన్నెల రాజు పిలిచినాడోఏన్నెలా**
**రగు అన్న మాటలకు ఏన్నెలరాదీరదయ్యోఏన్నెల పోదీరాదయ్యోఏన్నెల**
**బంటుల నమ్మక ఏన్నెల కొడుకుల తోలిండోఏన్నెలకొడుకులా తోలిండోఏన్నెలా**
**నాయనాపిలిచినాడోఏన్నెలా నాయనన్నా మాటలకు ఏన్నెలారాదీరాదయ్యో**
**రాదీరాదయ్యోఏన్నెలపోదీరాయ్యోఏన్నెలకొడుకుల నమ్మక ఏన్నెలతానేతరలివచ్చే**
**తానేతరళి వచ్చే ఏన్నెలా తలుపుల కోరిగిండోఏన్నెలా**
**తలుపు లెవ్వరయ్యోఏన్నెలా బమరానీమొగుడుఏన్నెలా**
**బాయిల బల్లి కదానేఏన్నెలా బాయిల బల్లిగాడుఏన్నెలా**
**బాలుడయ్యో గదా నీమొగుడుఏన్నెలా బాలుడయ్యో గదా మొగుడు ఏన్నెలా**
**కాంతరనీమొగుడుఏన్నెలా కాలిన కట్టెకదానేఏన్నెలా**
**కాలిన కట్టెగాడుఏన్నెలా కాముడయ్యోమొగుడోఏన్నెలా**
**చెలిహారనీమొగుడుఏన్నెలా చెరువుల చేపగదానేఏన్నెలా**
**చెరువులా చేపగాడుఏన్నెలా చంద్రుడయ్యోఏన్నెలా**

**చంద్రుడయ్యోమొగడుఏన్నెలా"                నూనె వెంకటమ్మ : తక్లాపూర్**

వరినాట్లు వేసేటప్పుడు జానపద స్త్రీలు ఎక్కువగా శృంగార, కరుణరస పాటలు పాడుతుంటారు. పని భారాన్ని పూర్తిగా మర్చిపోయి పాటలద్వారా ఆనందం పొందుతూ ఉత్సాహంగా పనిచేస్తూ ఉంటారు. అందులోని భాగమే ఈ గేయం.

తెల్లవారు జామున పొద్దు ఎలా ప్రారంభం అవుతుందో ఇది వర్ణిస్తుంది. చాకలివారు చెరువు దగ్గర బట్టలు ఉతుకుతుండగా వచ్చే శబ్దాలను 'రచ్చర్లుపేలెటి' అనే పదంతో పాడటం జరిగింది. పడుకున్న రాజు తెల్లవారిన తరువాత తన భార్యను పిలవమని బంటులను పంపిస్తే తాను రానన్నది. రాకపోవడంతో పిల్లలను పంపాడు అయినా రాకపోవడంతో స్వయంగా తానే వెళ్ళి తలుపుచాటున నిలబడి రాజు భార్యను చూస్తున్నాడు. దానిని గమనించిన భార్య "తలుపు చాటున ఎవరూ" అని అడగటంతో ప్రక్కన ఉన్న తన తోటివారు నీ భర్త అక్కడే ఉన్నాడు అని అనడంతో చంద్రుడమ్మా నా మొగుడు అనే ఒకమాటతో తన భర్త ఎలాంటివాడో చెప్పిన విధానం ఈ గేయంలో బాగుంటుంది.

ఈ గేయం అన్నలగురించి వాళ్ళు చేసి త్యాగాలగురించి పాడుకుంటూ పని భారాన్ని లెక్క చేయకుండా పాడే గేయం. ఒకప్పుడు రజాకార్ల, భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలనుండి దేవుడిలాగా పేదల పక్షాన నిలబడినటువంటి అన్నలను తలుచుకుంటూ పాడేదే ఈ గేయం.

**"ఎక్కడ ఉన్నారో అన్నలు యాడా ఉన్నారో**<br>
**నింగిలోన తొంగి చూసే సుక్కానున్నారు**<br>
**ఆ నేలపైన ఎతుకుతుననపక్కానున్నారు**<br>
**ఆ మందారంలో మండే ఎర్రని జండాలన్నాడు**<br>
**ఆ పక్కనున్న లంబాడీల తండాలన్నాడు                "ఎక్కడ"**<br>
**మా ఇంటిలోనసంటిబిడ్డినవ్వులున్నాడు**<br>
**ఎక్కడ ఉన్నారో అన్నలు యాడా ఉన్నారో**<br>
**నింగిలోన తొంగిచూసే సుక్కానున్నారు**<br>
**ఆ నేలపైన వెతుకుతున్న పక్కానున్నారు                "ఎక్కడ"**<br>
**మా ఇంటిలోనసంటిబిడ్డనవ్వులున్నాడు**<br>
**కాలేజీల కుర్రోడమ్మా సంఘంలా నాయకుడమ్మా" "ఎక్కడ"**

**రాగంఈరమ్మ : గోనకోల్**

ఎంతో మంది అన్నలు అమరులయ్యారు. వాళ్ళను గురించి ఎక్కడున్నారో అన్నలు యాడా ఉన్నారో నింగిలోన తొంగిచూసే ఆ చుక్కలలో ఉన్నారో అంటూ తలుచుకుంటూ గేయాన్ని ప్రారంభిస్తారు. అన్నలగురించి వివరిస్తూ మందారం పువ్వువలే ఎర్రనిజెండాలో ఉన్నారు. వాళ్ళకు ఆశ్రయం ఇచ్చి ఆకలి తీర్చే, గూడెం, తండాలలో అన్నలు ఉన్నారు అని చెప్పడం జరిగింది. తమ కష్టాలను తీర్చడంవల్ల ఆ ఇంటి చంటి పిల్లగాడి నవ్వుకు అన్నలు కారణం అనే భావంతో ఈ గేయం సాగింది.

### 4. 5.7. కలుపు పాటలు

వరి నాటిన కొద్ది రోజులకు వరిలో పెరిగిన గరకగడ్డి, ఊదరగడ్డి, చిన్నతుంగ, గడ్డిమొక్కల్ని తీసేస్తారు. దీనినే "కలుపు తీయుట" అంటారు. వరి, మిరప, టమాట, వేరుశనగ మొదలైన పైరు మొక్కలలోకూడా కలుపుతీస్తారు.

వీటిలో కలుపు తీయుట చిన్న కొడవలిని వాడుతారు. వరిమళ్ళలో కలుపు తీయుటకు ఎలాంటి పరికరాన్ని వాడరు. అవసరాన్నిబట్టి వరికోతకు వచ్చేలోపల ఒకటి, రెండుసార్లు కలుపుతీస్తారు. కూలీ స్త్రీలందరూ వరిమళ్ళలో కలుపు తీస్తున్నప్పుడు వాళ్ళ కాళ్ళుచేతుల కదలికలు ఒకే విధంగా ఉంటాయి. అంతలో ఎవరో ఒకరు పాటను అందుకుంటారు. ఆమెతోపాటు అందరూ ఏకీభవిస్తారు. వీరు పాడే నాట్లపాటలకు కలుపుపాటలకు తేడాలు ఉండవు. నాట్లపాటలే కలుపుపాటగా పాడుతారు. ఈ పాటలు చాలాపెద్దగా ఉంటాయి. ఏదో ఒక కథను ఆధారంగా చేసుకోనైనా పాడవచ్చు లేదా స్త్రీ సహజమైన కరుణ భావాలు వారికి ఇష్టంగా ఉండే పాటలైనా పాడవచ్చు.

జానపద స్త్రీ తన్నుతాను వర్ణించుకుంటూ తనమేనబావను తలచుకుని అతను పిలిచినట్లు తాను రాలేకపోతున్నట్లు తనురావాలంటే ఇలానే సాధ్యమవుతుందంటూ తనరాకకు కావలసిన దారి తెన్నుల సామగ్రిని అడుగుతూ పాట జోరెక్కిస్తుంది.

**ఏరే వచ్చేరా తుంగ మునిగెరా** **ఏరుదాటి నేను ఏట్లావద్దురా**
**మేనత్త కొడుకా ఓ మేనబావా** **నేను ఏరు దాటి నేను ఏట్లావద్దురా**
**జాజికాయల జల్లెడ వంపెరా** **జల్లెడ మీద నేను జారే వద్దురా**
**నిమ్మకాయల నిచ్చెన వంపెరా** **ఏపహూతల మీద నేను ఎక్కి వద్దురా**
**మల్లెపువ్వుల మంచెంలా మీద** **మళ్ళీ వద్దురా**
**మల్లెపువ్వుల మంచెలెయారా** **మంచెల మళ్ళీ మీదవద్దురా"ఏరే"**

నిమ్మకాయల నిచ్చెన ఏయారా నిచ్చెన మీద నేను నిల్చే వద్దురా
నీదిఏవన్నెరా నాది ఏవన్నెరా జాజి కాయల పూలావన్నెరా
కలచిపోయేటివన్నెలావచ్చేరా" నసరమ్మ : ప్రతాప్ నగర్

## 4. 5.8. కోత పాటలు

కలుపు తీసిన కొన్ని రోజులకే వరిచేను ఈని కంకిపెట్టి కోతకు వస్తుంది. ఈ వరి కోతలప్పుడు రైతులు, కూలీలు, చాలా హడావుడిలో ఉంటారు. రైతుకూలీలు కోడవండ్లును కమ్మరివద్ద సాన పట్టించి కోతలకు సిద్ధంగా ఉంటారు. రైతులు కళ్ళం చెక్కడంలోను, కూలీలను పిలవడంలో తొందర పడుతుంటారు. వరి కోతలలో స్త్రీ, పురుషులు కలిసి పనిచేస్తారు. స్త్రీలు పని చేస్తున్నప్పుడు నడుం బిగించి, సిగలు కట్టుకొని పనిచేస్తారు. కోసిన 'మెద'ను వెనుకకు వేయుచూ ముందుకు కదులుతారు. వరినాట్లప్పుడు  కలుపు తీసినప్పుడు పాడేపాటలే వరిచేలు కోస్తూ పాడుతారు.

"ఏడుగురు యారండ్లు ఢిల్లీకాంతో కొడవండ్లుపట్టనారోఢిల్లీకాంతో
బాయికాడికిపోయిరంటా ఢిల్లీకాంతో గడ్డినైనాకోసిరంటా ఢిల్లీకాంతో
మోపులైన కట్టిరంటా ఢిల్లీకాంతో జూపెల్లిజుట్టుగాడు ఢిల్లీకాంతో
కొడవండ్లుగుంజరంటా ఢిల్లీకాంతో పేరు చెప్పమనిరంటా ఢిల్లీకాంతో
మామ పేరు చెప్పేదాకా ఢిల్లీకాంతో ఇవ్వమమ్మకొడవండ్లుఢి ల్లీకాంతో
మామపేరుమల్లెమొగ్గ ఢిల్లీకాంతో ఇవ్వరయ్యకొడవండ్లు ఢిల్లీకాంతో
అత్తపేరుచెప్పేదాకా ఢిల్లీకాంతో ఇవ్వమమ్మకొడవండ్లు ఢిల్లీకాంతో
అత్త పేరు అల్లి పువ్వు ఢిల్లీకాంతో బావా పేరు చెప్పేదాకా ఢిల్లీకాంతో
మరిది పేరు చెప్పేదాకా ఢిల్లీకాంతో మరిది పేరు మల్లెపువ్వు ఢిల్లీకాంతో
ఇయ్యరయ్య కొడవండ్లు ఢిల్లీకాంతో చెల్లి పేరు చెప్పేదాకా ఢిల్లీకాంతో
చెల్లిపేరు సెనగ పువ్వు ఢిల్లీకాంతో మొగని పేరు చెప్పేదాకా ఢిల్లీకాంతో
మొగని రేకుమొగలిపువ్వు ఢిల్లీకాంతో మొగని పేరు చెప్పినంక ఢిల్లీకాంతో
ఇచ్చిరంటకొడవండ్లుఢిల్లీకాంతో" కేశమ్మ : గౌరారం

ఈ గేయంలో జానపదుల మనస్తత్వం తెలియుచున్నది. ఏడుగురు యారండ్లుకూడి బావి దగ్గరకి పోయి గడ్డి కోసి మోపులు కట్టిన తర్వాత జూపెల్లి జుట్టుగాడు, పోలెపల్లి

పొట్టిగాడు వారి కొడవండ్లు గుంజుకొని వారి ఇంటి పేర్లు మల్లెపువ్వు, అత్తా పేరు అల్లిపువ్వు, చెల్లి పేరు సెనిగపువ్వు, బావా పేరు బంతిపువ్వు, మొగని పేరు, మొగలిపువ్వు అని చెప్పిన తర్వాత కొడవండ్లు ఇస్తారు. దీనిలో చెప్పబడిన పూవులన్ని రోజు చూసినవే. వాటినే పాటలో చేర్చుకొని పాటగా అల్లుకుంటారు.

అలాగే మరో గేయంలో –

**"కోతల్లో మునిగున్నఉయ్యాలో నాయికన్నా తల్లి ఉయ్యాలో**
**కొడవలిలిక్కినిఉయ్యాలో కోసేటిపానవుఉయ్యాలో**
**అల్లుడోచ్చేనమ్మఉయ్యాలో గాలెక్కివచ్చెనేఉయ్యాలో**
**గాయిగాయిచేసేనేఉయ్యాలో నను పంప కదలవేఉయ్యాలో**
**నాయికన్నా తల్లి ఉయ్యాలో" నూనె ఖరీమమ్మ : గోనకోల్**

అత్తగారింటికి వెలుచున్న జానపదస్త్రీ చేనుకొస్తున్న తల్లితో తనను సాగనంపుటకు రమ్మని చెప్పుతుంది.

### 4.5.9. చేలకావలి పాటలు

జానపదులు పంట చేతి కొచ్చేవరకు ఎన్నో కాయకష్టాలు, నష్టాలను ఎదుర్కొంటారు. జొన్న, సజ్జ మొదలైన పంట చేలు కోతకు వస్తుండగా రైతులకు ఎక్కడలేని భయం. పశువులు కంచె దాటి చేను మేయటం, అటవీపందులు చేనుల్లో పొర్లాడటం, ఏదులు, కోతులు చేనును కొరికి వేయటం, పక్షులు గింజలు తినటం మొదలైన నష్టాలను ఎదుర్కొంటారు. అందుకే స్త్రీలుకాని, పురుషులుకాని చేలకావలిపోతారు. దొంగలు కంకుల్ని కోసుకుపోతుంటారు. దొంగతనం చేసి "ఎల్లన్న" పారిపోతుండగా చూసిన జానపద స్త్రీ –

**"ఓరోరి ఎల్లన్నా వంకజుట్టెంకన్న**
**పారిపోతవు లంజకొడుకో ఎల్లన్నా**
**పాల సద్దలు పెడతరారో ఎల్లన్నా**
**పచ్చిజొన్నలు పెడతారారోఎల్లన్నా" (కూతటి బాలక్రిష్టమ్మ : డిండి)**

ఎందుకు పారిపోతావు పాలసద్దలు, పచ్చిజొన్నలు పెడతారమ్మని, కోపగించుకుంటూ వ్యంగ్యంగా పిలుస్తుంది.

జానపదులు జొన్నచేనులో పాటుగా వంకాయ, టమాట, బెండకాయ, మిరపకాయ మొదలైన కూరగాయల తోటలు పెడతారు. జొన్నచేల కావలి వచ్చిన మగువ ఆ తోటలుకూడా చూస్తుంది. రోజు చేలకావలి వెళ్తున్న మగువతో "యాదయ్య"కు స్నేహం కుదిరి వారిద్దరు ఆ తోటలో సరసాలాడి కృష్ణమ్మ సొమ్ములు పోగుట్టుకుంటుంది.

**వంకాయ చెట్లల్లరో యాదయ్యా నావొంకు పొయ్యిందిరీ**
**నీ వోంకు నీకియ్యనే కృష్ణమ్మ నీ వోళ్ళు పడనీయనే కృష్ణమ్మ**
**గన్నేరు చెట్లల్లరో యాదయ్యా నా కడెం పోయ్యిందిరో యాదయ్యా**
**నీ కడెం నీ కియ్యనే కృష్ణమ్మ నీ వొళ్ళపడనీయనే కృష్ణమ్మ**
**పుల్చేరు చెల్లల్లరో యాదయ్యా నా పుస్తె పోయ్యిందిరో యాదయ్యా**
**నీ పుస్తెనీకియ్యనే కృష్ణమ్మ నీ వొళ్ళపడనీయనే కృష్ణమ్మ**
**పల్లేరుచెట్లల్లరో యాదయ్య నా పట్టె గొలుసు పోయ్యిందిరో యాదయ్య**
**నీ పట్టె గొలుసు నీ కియ్యనే కృష్ణమ్మ నీ వొళ్ళ పడనీయనే కృష్ణమ్మ"**
**అంజమ్మ : గౌరారం**

కృష్ణమ్మ పోగొట్టుకున్న సొమ్ముల్ని యాదయ్య ఎంత బ్రతిమిలాడినా ఇవ్వకుండా సరసాలతో కాలం గడుపుతాడు.

### 4. 5. 10. పశువుల కాపరి గేయం

పల్లెలు పశుసంపదకు పుట్టినిల్లు. ప్రతి ఇంటా పశువులు ఉంటాయి. కొందరికి వందలకొలది ఉంటే కొందరికి ఒకటి రెండన్నా ఉంటాయి. పశువులు లేనివారు ఉండరు. పశువులను మేపేందుకు ప్రత్యేకంగా ఒకరిని నియమించుకుంటారు వారినే పశువుల కాపరి అంటారు. పశువుల్ని మేపే విధానంలో రెండు రకాలవాళ్లు ఉంటారు. ఒకరు ఎవరికైనా ఎక్కువ పశువులు ఉంటే వారి పశువులకొరకు మాత్రమే కాపలాదారుగా ఉండడం. మరొకరు ఒక్కొక్క ఇంటిలో ఉన్న ఒకటి రెండు ఆవులను మందగా కలిపి కాపల కాస్తుంటారు.

**ఆవులో ఎల్లన్న ఆవులో**
**ఆవుళ్ళు కాసేటి బోయిడెవరె**
**ఆవులో ఎల్లన్న ఆవులు**

ఆవులో ఎల్లన్న ఆవులో
పెద్దరాలు పెద్దమ్మ కొడుకు తను "ఆవులో ఎల్లన్న ఆవులో"
ఆయనకు ఎంతను గసమోయమ్మ "ఆవులో ఎల్లన్న ఆవులో"
దోసెడు ముత్యాలు దోతుల్లసాపె "ఆవులో ఎల్లన్న ఆవులో "
సారెడు ముత్యాలు చెప్పుల్లాజోడె "ఆవులో ఎల్లన్న ఆవులో "
పిడికెడు ముత్యాలు పిల్లున్న గొయ్య "ఆవులో ఎల్లన్న ఆవులో "
ఆవులు పోయినవిరా అనపసేను పట్ట "ఆవులో ఎల్లన్న ఆవులో "
దూలు పోయినవిరా దుక్కిసేను పట్ట "ఆవులో ఎల్లన్న ఆవులో "
కోడెలు పోయినవిరా కొర్రసేను పట్ట "ఆవులో ఎల్లన్న ఆవులో "
పెయ్యాలు పోయినవిరా పెసర సేను పట్ట "ఆవులో ఎల్లన్న ఆవులో "
ఎడ్లు పోయినవిరా ఎర్రజొన్నసేను పట్ట "ఆవులో ఎల్లన్న ఆవులో "
ఇన్ని పోయిందాక ఎమిచేసినవురా "ఆవులో ఎల్లన్న ఆవులో "
వాకిలైతే మడుగు గుప్పెనె "ఆవులో ఎల్లన్న ఆవులో "
మడుగు గుప్పితే సేపలుఏవిరా "ఆవులో ఎల్లన్న ఆవులో "
వాకలయితే కాల్చుకొని తిన్న "ఆవులో ఎల్లన్న ఆవులో "
కలుచుక తిన్నకడ బుడిదేదిరా "ఆవులో ఎల్లన్న ఆవులో "
గాలిదేవుడోచ్చి కుల్లు ఎత్తిపోసె "ఆవులో ఎల్లన్న ఆవులో "
దులిదేవుడొచ్చి దుమ్మెత్తిపోసే "ఆవులో ఎల్లన్న ఆవులో "
వానదేవుడొచ్చి వరద నీల్లు చల్లే "ఆవులో ఎల్లన్న ఆవులో "
వానదేవుడు వస్తై తడువలేమిదిరా "ఆవులో ఎల్లన్న ఆవులో "
చిన్నపుడు మాతాత సాము నేర్పిండె "ఆవులో ఎల్లన్న ఆవులో "
చినుకు చినుకు నేను తప్పించుకున్న "ఆవులో ఎల్లన్న ఆవులో"

విబూది లక్ష్మయ్య : గోనకోల్

ఆవులు దూడలు కోడెలు పెయ్యలు ఎద్దులుగా కలగలసిన మందలోని పశువులు చుట్టూతా ఉన్న పొలాలలో బడి మేసేస్తున్నాయి. అన్ని పశువులు అలా పడి మేసేస్తుంటే నువ్వెక్కడికి పోయావురా అని ప్రశ్నిస్తే మడుగులోకి పోయి చేపలుపట్టుకుని ఆకలయితే కాల్చుకుతిన్నానని చెపుతాడు. కాల్చుకుతింటే బూడిదేది అంటే గాలిదేవుడు ధూళిదేవుడు

వచ్చి దుమ్మురేపంగా పోయెనని వానదేవుడు వచ్చి వరదనీళ్లు చల్లంగా అది కనపడకపోయిందనీ సమాధానం చెపుతున్నాడు. వానొస్తే నీవు తడవలేదు కదరా అంటే చినుకు చినుకుకూ తప్పించుకునే సాముగరిడీ విద్యను నాకు మా తాతా నేర్పాడని చెపుతున్నాడు. మాటమాటకీ వెతుక్కోకుండా సమాధానం చెప్పేంత తెలివితేటలుగల పశువుల కాపరిని పై పాటలో చూడవచ్చు.

## 4.6.0 ఇంటిపనుల్లో పాడేపాటలు

ఇంటిదగ్గర స్త్రీలకు పనులేముంటాయి అనుకుంటుంటారు. చేసే వాళ్లకు చేతికి తీరికలేనన్ని పనులు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునేవరకు ఇబ్బడిముబ్బడిగా పనులు పరుగులు తీసుకుని వస్తుంటాయి. అలుపు సొలుపు లేని ఉద్యోగం స్త్రీలది. అలుపు మరచిపోవడానికి పాటలు పాడుకోవటంకన్నా మించిన భాగ్యం లేదనుకుంటారు. ఈ పాటలు తరంనుండి తరానికి అనుశ్రుతంగా రావటం ఒక విధం. నేర్చిన పాటను నేర్చినట్లేకాకుండా తన అవస్థను జోడించి చరణాలుమార్పు చేసుకుని తనదిగా పాడుకోవటమూ కనిపిస్తుంది. స్త్రీల శ్రమశక్తిలో ఇంటిదగ్గర పాడుకునే గేయాలలో ముఖ్యంగా విసుర్రాయి పాటలు, దంపుడు పాటలు ఉంటాయి. డిండిమండల జానపద గేయ సేకరణలో ఈ పాటలు లభ్యమయ్యాయి.

## 4. 6.1. విసుర్రాయి పాటలు

జానపదులు పొద్దస్తమానం కష్టించి పనిచేసి ఇంటికి వచ్చి తమ ఆహారంకోసం జొన్నలుగాని, సజ్జలులుగాని విసిరి రొట్టెలు చేసుకుంటారు. ఈ విసుర్రాయికి ఒక పిడి/గుంజ ఉంటుంది. దానికి రెండు రాళ్లుపైన ఒకటి క్రింద ఒక్కటి ఉంటాయి పిడి/గుంజను ఒకరిద్దరు లేదా ముగ్గురు తోడుగూడి విసురుతారు విసుర్రాయి నేటికీ అందరి ఇండ్లలో కనిపిస్తుంది పిడి/గుంజను పట్టుకొని వృత్తాకారంలో దీనిని వేగంగా తిప్పుతారు పైన రోకటికి గింజలు పోస్తూ విసురుతారు. అప్పుడు విసిరేవాళ్లు వాళ్ల శ్రమని పోగొట్టు కోవడానికో, వినోదానికో పాటలుపాడుతూ విసురుతారు. కొందరు జొన్నలు, సజ్జలు, రాగులు విసిరి అంబలి తయారుచేసుకుంటారు. కొందరు కందులు, బొబ్బెర్లు మొదట

నానబెట్టి ఎండిన తర్వాత వాటిని పప్పుగా విసురుకుంటారు. కొందరు పసుపుకూడా విసురుతారు. సంపన్నులు విసరడంకోసం, దంచడంకోసం కూలికి స్త్రీలను పిలుచుకుంటారు.

"మా అయ్యా గొన్నాడు గజ్జెళ్ళరాయి గజ్జెళ్ళరాయీకోయి
గజ్జెళ్ళ రాయికి ఘంటనాథుళ్ళు గజ్జెళ్ళ రాయికి గంటనాథుళ్ళ స్వామి ఓయ్
గంటనాథుళ్ళ స్వామి వెంటపడ్డాడు తిరిగి రావమ్మో గౌరమ్మ ఓయ్
తిరిగి రావమ్మో గౌరమ్మ తిరిగి రావమ్మాతిరిగి వస్తే నీ ఒళ్ళోయ్ తీగలు ఒడిపోతూ
మళ్ళీ రావమ్మో గౌరవమ్మాయ్ మళ్ళీరా గౌరమ్మ మళ్ళీరా రావమ్మా మళ్ళీ వస్తే ఓయ్
మళ్ళీ వస్తే నీ ఒళ్ళో మల్లెలు ఒడిపోతూ మళ్ళీ వస్తే నీ ఒళ్ళో మల్లెలు ఒడిపోతూ
ఐపోని గిరిమీద వాడి రావమ్మా ఢిల్లీకి పోయ్యెట్టు
ఐపోని గిరిమీద వాడి రావమ్మా రొట్టెళ్ళు చేసుకోయ్
రొట్టెళ్ళు చేసుకోక రొన్నెకట్టుక నేను పోదునూ చిట్యాలోయ్
నేను పోదు చిట్యాల చుట్టాల చూడ ఢిల్లీకి పోయ్యేట్టి శివజంగమయ్య
ఢిల్లీలో వీరైక ఏల్లు కిచ్చేవా ఇచ్చి వచ్చెన్ గాని ఓయ్
వచ్చి వచ్చెన్ గాని ఓయ్ పోయి వచ్చెనుగాని తోవ ఎరుగనమ్మా
ఏసువంటిదమ్మాహోఇల్లుఏరితూదమ్మా పచ్చని కడుప ఓయ్
ఏర్రరాతిది కడప వెండి దర్వాజా ఏర్రరాతిది కడప వాళ్ళ ఇంటి ముందళ్లోయ్
హో ఇంటి ముందుళ్ళసిరిపోన్నచెట్టు ఆ ఇంటి ముందళ్ళసిరిపొన్నచెట్టుకిందఓయ్
సిరిపొన్న చెట్టు కింద ఉంటది చెల్లా సిరిపొన్న చెట్టు కింద ఉంటది చెల్లా"

నూనె ఎల్లమ్మ : గోనకోల్

విసుర్రాయిని గౌరమ్మతల్లిగా భావించడం, గౌరమ్మతల్లికి పూజలుచేయటం, ఆ దేవత చల్లగా చూస్తుందన్న భావన, రొట్టెలుచేసుకోను పిండి ఇసురుకోవాలని, గౌరమ్మకు పూజలు చేసుకోవాలని తెలియజేస్తుందీ పాటలో ...

ఈడుగానీ కోడేనునాగట కట్టి
ఇడువక దున్నేనమ్మోయి
ఇడువక దున్నేనమ్మా ఈ పాపకరుడూ
ఈ పాపకరునిచేలోఓయ్

పాపకరుని చేలా ఏమేమి పండు
పంచక పది పుట్లు ఓయ్
పంచక పది పుట్లు పళ్ళేర్లు పండు
కొండ కింది గోదుమకొయ్యనయ్యింది
కోపించు అన్నయ్య ఓయ్
కోపించు అన్నయ్య గొడుగు నీడళ్ళ
అన్ని దాన్యలు పండు ఓయ్
అన్ని దాన్యలు పండు ఆంద్యాలు పండు
కోటి ధాన్యలు కొర్రళ్ళు పండు
నూరు దాన్యము పండు నూగుళ్ళు పండు సగుళ పండు
సగుళదాన్యము పండు సద్దళ్ళు పండు
వెయ్యి పుట్లు కొలవంగాయ్
వెయ్యి పుట్లు కొలవంగా వెనున్న చెమట వెండి సురటిలోయ్
వెండిల సురటీలు అన్నగారికి
పది పుట్లు కొలవంగా పక్కన చెమట
పది పుట్లు కొలవంగా పగటి సురటిలోయ్
పగటివిసురటిలు అన్నగారికి" నూనె ఎల్లమ్మ : గోనకోల్

ఈ గేయంలో అన్నయ్య దూడను నాగలికి కట్టి దానిని విడువకుండా అలానే దున్నుతున్నాడని బాధతో చెల్లెళ్లు పాడుతున్నటువంటి గేయం. చిన్న దూడను హింస పెట్టి దున్నుతున్నాడు ఈ పాపాల అన్నయ్య ఏమి పండిస్తాడో అని అటు కోపము, ఇటు బాధ రెండు కలగలిపి పాడుతున్నట్టు ఉంటుంది. అందరికి పంచగా పది పుట్లు, పల్లీలు పండినాయి. కొండకింద ఉన్నటువంటి చేనులో గోధుమ కోతకు వచ్చింది. అంత పంటపండుతున్నా గాని ఈడుగాని కోడెయైన లేగదూడను ఎందుకు హింసిస్తున్నాడో అని చెప్తున్నట్టు సాగే ఈ గేయం కొందరు రైతులు మూగజీవాలను హింసించే విధానాన్ని తెలియజేస్తుంది. అలాగే అన్నయ్య పిసినారితనాన్ని ఈ గేయం తెలియజేస్తుంది.

### 4.6.2. దంపుడు పాటలు

రైతులైనా, కూలీలైనా ఏ పూటకాపూట వడ్లు దంచి వంట చేసుకుంటారు. దంచుకోవటం ఒక శ్రమతో కూడిన పని. ఒక రాయికి రోలు తోలచి ప్రతి ఇంటికి ముందు భూమిలో పాతిపెట్టుకుంటారు. ఆ రోటిలో ధాన్యం పోసి "ఇనుప పొన్ను" వేయబడిన రోకలితో దంచుతారు. రోలు, రోకలి, కుందెన, కుదురు ప్రతి జానపదుని ఇంటిలో ఉంటాయి. కుందెన ఇనుముతో చేయబడి ఉంటుంది. ఇవి రోటిలో పోసిన ధాన్యం దొర్లిపోకుండా ఉండటానికి సహకరిస్తాయి. రోటిచుట్టూ ఇద్దరు, ముగ్గురూ స్త్రీలు  రోకండ్లు పట్టుకొని ధాన్యం దంచుతారు.

దంచడం మొదలుపెట్టగానే ఉచ్ఛ్వాస, నిశ్వాసలు ఎక్కువవుతాయి. ఆ పని మొదలు పెట్టినప్పుడు వెలువడిన "హాస్–హాస్" శబ్దాలే పల్లవిగా ఏర్పడి దానికి అనుగుణంగా పదాలు వెలువడతాయి. ఈ "హాస్" శబ్దం రోకలేసినప్పుడు "సువ్–సువ్" అవుతుంది. అందుకే సువ్విసువ్విఅని లయబద్ధంగా రాగాలు తీస్తూ పాటలు పాడుతారు. రోకలి దంచడం అనేది ఒక్కరు చేసే పని కాదు ఇద్దరు లేదా ముగ్గురు దంచుతారు.

**సువ్విసువ్వి సువ్వాన రంగా　　సువ్వి మోహనరంగా　—సువ్వి**
**సువ్వి కావేటి రంగా　　సువ్వి లాలి సువ్వి**
**సున్నాము జాజులు　　సూటిగా వేయించి**
**ఉల్లిపూలాసాట్లా　　మల్లెపూల జల్లెండ్ల**
**ముత్తంపు రోకండ్లు　　పగుడాంపు కుందేండ్లు**
**అవి దెబ్బ పందిట్ల　　అమర గించిరీ　　"సువ్వి"**
**సువ్విసువ్వి సువ్వానరంగా　　సువ్వి మోహనరంగాసువ్వి**
**ముత్తంబు రోకండ్లు　　పగుడాల కుందెండ్లు**
**అవి దెచ్చిసం దీట్ల　　అమర గించిరీ"(శ్రీపతి చంద్రకళ : రామాంతపూర్)**

ఈ విధంగా పాటలు పాడుకుంటూ దంచిన ధాన్యాన్ని చాటలతో చెరుగుతారు. ఈ పాటల్లో ఉల్లిపూతంత సున్నితమైన చేటల్ని ముత్యాల్లాగా, మేరిసే రోకండ్లు, పగడాల్లాంటి కుందెనల్ని తెచ్చి పెళ్ళి పందిరి కింద అమర్చుతారు. ధాన్యాన్ని దంచుటకు కావలసిన వస్తువులన్నీ పై పాటలో చెప్పబడ్డాయి.

## 4. 7. 0. కులసంబంధ గేయాలు

డిండిమండలం చుట్టుప్రక్కల గ్రామాలలో జానపదుల జీవన వ్యవసాయంపైన మరియు వివిధ కులాలకు ఉన్నటువంటి వృత్తిపైనకూడా ఆధారపడి ఉంటాయి. మొదటినుండి వస్తున్న ఈ సాంప్రదాయం గ్రామప్రజల జీవనానికి ముఖ్య అవసరాలు తీర్చేందకు దోహదం చేస్తున్నాయి. మంగళి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చాకలి మొదలగు పనివారు గ్రామస్తులందరూ గ్రామంలో వంశ పారపర్యంగా వచ్చే ఆయుర్వేద వైద్యులు ఉంటారు. ఈ వృత్తుల వారందరికి సర్వసాధారణంగా ధాన్యం, డబ్బుల రూపంలో ప్రతిసంవత్సరం కొంత ఇస్తారు.

## 4. 7. 1. గౌండ్ల వారి గేయం:

గౌండ్లవారి ప్రధాన వృత్తి కల్లు అమ్మడం. ముఖ్యంగా వ్యవసాయం చేసే రైతులు తాటినారను తాళ్ళు పేనుటకు, ఆకులను పశువుల కొట్టం, గుడిసెలను వేసుకొనుటకు, తాటి మొద్దులను ఇంటికి దూలాలుగా ఉపయోగిస్తారు. గౌండ్లవారు తాటికల్లుతోపాటు ఈతకల్లునుకూడా గీస్తారు. తాటిచెట్లను, ఈతచెట్లను కలిపి “ఈదుళ్ళు” లేదా “తాళ్ళు” అంటారు. గౌండ్లవారు ఆ చెట్లనుండి కల్లు గ్రామానికి తీసుకొచ్చి అమ్ముతారు. కొందరు రైతులు పదిహేనురోజులకో, నెలరోజులకో ఒకేసారి డబ్బు మొత్తం చెల్లించి వారి ఇండ్లకు రోజు కల్లు తెప్పించుకుంటారు. కల్లు ఇంటింటికి వెళ్ళి ఇచ్చుటకు ఎక్కువగా గౌండ్ల స్త్రీలే వెళ్తారు. ఇలా రోజు కల్లు ఇచ్చి వస్తున్న గౌండ్లోల్లా పుల్లమ్మకు దారిలో ఉన్న కొమటోల్ల బక్కయ్యకు మధ్య స్నేహం కుదురుతుంది. గౌండ్లోల్ల జానపద స్త్రీ కొన్ని వస్తువులు కావాలంటుంది.

**పెద్దంచుచీరైతేపేరుంటదీకోంటోల్లబక్కయ్య**
**ఆరైకలీరైకలేంరైకలేగౌండొల్లపులమ్మా**
**గుండీల రైకతేగుర్తుంటదికొంటోల్లపులమ్మ**
**సన్నాయిా గాజులూ సానిస్తయీకొంటోల్లబక్కయ్య**
**ఆ మెట్టలే మెట్టెలే మెట్టలే గౌండ్లోల్లపులమ్మా**
**సన్నాయిామెట్టెసానిస్తాయికొంటోల్లబక్కయ్య”** గౌండ్ల మల్లీశ్వరమ్మ : బొగ్గులదోన

ఈ గేయంలో గౌండ్లపుల్లమ్మను ఏ చీరలు, ఏ రైకలు, ఏ గాజులు, ఏ మెట్టలు కావాలని కోమటోల్ల బక్కయ్య అడుగుతాడు. పెద్దంచు చీరలైతే పేరుంటది. గుండీల రైకైతే గుర్తుంటదీ, సన్నని గాజులు, సన్నని మెట్టెలు ఐతే చాన వస్తాయి అని పుల్లమ్మ చెప్తుంది.

### 4. 7. 2. గొల్లవారి గేయం

గ్రామాలలో గొల్లకురుమల ప్రధానవృత్తి మేకలు, గొర్రెలు మేపుకోవడం. వీరు ముఖ్యంగా రైతుల భూముల్లో మేపుతుంటారు. రైతుల చేను మారుపోంటికికూడ మేపుతారు. చేల కావలున్న ఒక పడచు స్త్రీ గొల్లవాని మేకలను చేనులోనికి వస్తూంటే దూరంగా జీవాలను మలపండి అంటుంది.

**"గురిగింజ గురిమల్లెలో గురిగింజ గురిమల్లెలో**
**మా మామ వస్తాడు మలప వోయి మంద గురిగింజ గురిమల్లెలో"**
**మా అత్త వస్తాది మలపవోయి మంద గురిగింజ గురిమల్లెలో**
**మీ అత్త నాకొక్క తల్లిగా వలేనే గురిగింజ గురిమల్లెలో**
**మా బావా వస్తాడు మలుపవోయి మంద గురిగింజ గురిమల్లెలో**
**మీ బావ నాకొక్కఅన్నగావలెనే గురిగింజ గురిమల్లెలో**
**మా వదిన నాకొక్కఅక్కగావలెనే గురిగింజ గురిమల్లెలో**
**మా మరిది వస్తాడు మలుపవోయి మంద గురిగింజ గురిమల్లెలో**
**మీ మరిది నాకొక్క తమ్ముడు గావలెనే గురిగింజ గురిమల్లెలో**
**మీ మొగుడు నాకొక్కఅన్నగావలెనే గురిగింజ గురిమల్లెలో**

**బత్తుల రాజమ్మ : ప్రతాపనగర్**

ఈ విధంగా జానపదులు వరుసలు పెట్టుకొని పిలుచుకుంటారు. గొల్లపిల్లవాడు చేను కావలున్న పడుచుతో కలిసి సరసాలాడుతూ గొర్రెల్ని మేపుతున్నాడు. రైతులు తమ చేల పక్కన పచ్చికను మేపుకోవడానికి ఒప్పుకోరు. చేను కావలున్న పడుచు స్త్రీ తన మామ వస్తాడని మంద మలుపమని చేపితే ఆమె మామ తనకు తండ్రి అవుతాడని గొల్లవాడు వరుస కలుపుతాడు. ఆమె తన అత్త, మామ, బావ, మరిది, మొగుడు వస్తాడని ఆ గొర్రల మందని మలుపమంటే వారు తల్లి, అన్న, అక్క, తమ్ముడు వరుసవుతారని చివరకు ఆడపడుచునే మరదలుగా చేసుకున్నాడు.

4. 8. 0. ఇతరాలు :

జానపద గేయాలలో కొన్నిపాటలు వర్గీకరణలకు లొంగనివి ఉంటాయి. వాటిని ఇతరాలు అని సూచించడం అందులో ఉన్న వస్తువును విశ్లేషించడం కద్దు. అలా డిండి మండలంలో లభ్యమైన ఈ పాట గ్రహణ సంబంధంగా కన్పిస్తుంది.

4. 8. 1. పాము పాట

"గొబ్బిల్ల గొరుల మంద నెరొళ్ళవనమే గొబ్బిల
నెరొళ్ళువనమే గొబ్బిల నెరొళ్ళువనమే గొబ్బిల
నెరొళ్ళు వనములోన కొగుల్లపుట్టో గొబ్బిల
కొగుల్ల పుట్టల్ల కోడెనాగు నాగన్న గొబ్బిల
నాగన్న పెట్టిండు నలుగేయిల గుడ్లో గొబ్బిల
తోయక పెట్టిండు తొమ్మిదేలగుడ్లో గొబ్బిల
నడుము ఇరిసిపెట్టిండు నాలుగేల గుడ్లో గొబ్బిల
ఎన్ను ఇరిసిపెట్టిండు నలుగేల గుడ్లో గొబ్బిల
తోక ఇరిసిపెట్టిండు తొమ్మెదేల గుడ్లో గొబ్బిల
గుడ్లు తిప్పకు నాగ గొడ్రాలును గానూ గొబ్బిల
తోక ఇసరకు నాగ తోడు సెల్లెనో గొబ్బిల
నడుము ఇసరకు నాగ నడిపి సెల్లను గొబ్బిల
గుడ్లన్నిపెట్టిండో నాగ మేతకోఎల్లిండో గొబ్బిల
పశులకొటిదుడ్డెళ్ళు ఎంత పలుగొళ్ళె గొబ్బిల
ఎంత తులుమోళె గొబ్బిల
నాగన్న గుడ్లన్ని నలుగపొడిసిరే గొబ్బిల
చిదక పొడిసిరే గొబ్బిల
మేసేటినాగన్న మెడలెత్తిసూసె గొబ్బిల
ఉరుకొచ్చె నాగన్న ఉరితాడు ఓలె గొబ్బిల
ఉరికిరు దుడ్డెళ్ళు సూర్యుని సాటుకో గొబ్బిల
దొరికి సురడ దొరికియ్యే దొరికియ్యే గొబ్బిల

పట్టియి సురుడ పట్టియ్యవయ్యో గొబ్బిల
పట్టియ నేనెంత పాపకరున్నో గొబ్బిల
పాముతో సురుడు కాటందినాడో గొబ్బిల
యాడాది కొకరోజు సూర్యగ్యణమ్మో గొబ్బిల
సూర్యగ్యనము పట్టే  చుక్కల్లడె గొబ్బిల
ఉరికిరు దుడ్డెలు  చంద్రుని దాపుకొ గొబ్బిల
దొరికి చంద్రుడ దొరకియావయ్యో గొబ్బిల
దొరికి నేనంత దోసకరునో గొబ్బిల
పట్టియి చంద్రుడ పట్టియ్యవయ్యో గొబ్బిల
పట్టియ్య నేనెంత పాప కరునూ గొబ్బిల
చంద్రుడు పాముతో కాటందినాడో గొబ్బిల
యాడాదికోరోజు చంద్రగ్యనమో గొబ్బిల
సూర్యగ్యనము పట్టే సుక్కల్లాడే గొబ్బిల"    కామేపల్లి: సత్తెమ్మ

ఈ గేయం నేరేడుచెట్ల వనము కోగుల్ల పుట్టలో నాగుపాము పెట్టిన గుడ్లను పశులకాడికి పోయిన పోరగాల్లు నాగన్నలేని సమయంలో గుడ్లను పగలగొడుతున్న సమయంలో మేతకు వెళ్ళిన నాగన్న చూసి ఉరికి వస్తాడు. పసులకాడి పోరగాల్లు సూర్యుని దాపుకెల్లి దాక్కుంటారు. సూర్యున్ని  పట్టియ్యమంటాడు. అప్పుడు సూర్యుడు ఏడాదికి ఒక రోజు నన్ను కాటుపెట్టు కాని పెట్టియ్యను ఎడాది కొకరోజు సూర్యగ్రహణము, చంద్రగ్రహణం పట్టే సందర్భం ఈ గేయం తెలియజేస్తుంది.

డిండిమండలంలో జానపద గేయాలను సేకరించి పరిశీలించి చూసినపుడు వాటిలో స్త్రీలుపాడుకునే లాలిపాటలు, పెండ్లిపాటల్లో నలుగుపాటలు, ఎదురుకోలు పాటలు, మంగళారతుల పాటలు, హారతిపాటలు, అప్పగింతలపాటలు ఉన్నాయి. సంవాద గేయాలలో అత్తాకోడళ్లు, బావా మరదళ్లు, వదినా మరదళ్లు, అన్నాచెలెళ్ల సంవాద గేయాలు ఉన్నాయి. పారమార్థికగేయాలు లభ్యమయ్యాయి. ఇంటి బయట పనులకు సంబంధించిన శ్రామిక గేయాలలో వానపాటలు, ఏరువాక పాటలు, నాగలిపాటలు, మోటపాటలు, నాట్లుపాటలు, కలుపుపాటలు, కోతపాటలు, చేలకావలి పాటలు, పశువుల కాపలా పాటలు అని వివిధ రూపాలుగా లభ్యమయ్యాయి. ఇంటిలోపల పాడుకునే శ్రామిక గేయాలలో విసుర్రాతిపాటలు,

దంపుడుపాటలు ఉన్నాయి. వృత్తిసంబంధ గేయాలలో గౌడకులస్తులపాట, గొల్లవారిపాటలు లభించాయి. ఇతరాలలో గ్రహణకారణమైన పాట ఒకటి లభించింది. ఐదవ అధ్యాయంలో పై పాటల్లో లభించిన ప్రాకృతిక విజ్ఞానాన్ని పరిశీలించటం జరుగుతుంది.

# అధ్యాయం– 5

# డిండి మండల జానపద గేయాలు ప్రాకృతిక విజ్ఞానం

## 5.0. పరిచయం

తెలుగువారి వారసత్వ సంపదలో ముఖ్య స్థానాన్ని పొందిన జానపద గేయాలు తెలుగువారి జీవనవిశేషాలను పుష్కలంగా అందించు నిధులు. జానపద గేయాలలో తెలుగువారి లోగిళ్ళ ప్రస్తావనలు, తెలుగువారు మచ్చిక చేసుకున్న జంతువులు, పక్షులు, అక్కడ పెరిగిన చెట్లు, సరీసృపాలు, పంటలు, జలవనరులు, కొండలు, నదులు, చెఱువులు, కాలువలు, తెలుగువారు పెంచుకున్న చెట్లు, చేమలు, పొదలు, తీగలు, మొక్కలు, మాన్లు, పుష్కలంగా లభిస్తాయి. ఇకపోతేతెలుగువారు భోజన ప్రియులు. వారు చేసే భోజన సంబంధ వంటకాలలో వినియోగించే వస్తువులు ఇన్నన్ని కావు. అలాగే వంట సమయంలో వంటకాలకు వినియోగపడే కూరగాయలు, దుంపలు, ఆకులు, పండ్లు, కొమ్ములు, పప్పులు, ఇంకా ఇతరాలు. నీళ్ళ నిల్వ ప్రదేశాలు, పంట పొలాలు, పంట రకాలు, మట్టినేల రకాలు వాతావరణ సంబంధ అంశాలు ఇలా తమతో మమేకమైన వాటనన్నింటినీ కలుపుకొని జీవించే జీవన విధానంతో ముడిపడినంతటినీ ప్రాకృతిక విజ్ఞానంగా పరిగణించవచ్చు.

డిండి మండల జానపద గేయాలలో లభ్యమయిన ప్రాకృతిక విజ్ఞానాన్ని పరిశీలించినప్పుడు ఈ అంశాలు జానపద గేయాలలో లభ్యమయ్యాయి. వానిలో ముఖ్యంగా సంస్కృతి సంబంధంగా పాడుకునే పాటలో వీటి ప్రస్తావన అధికంగా కనపడుతుంది.

5.1. సహజాలు

### 5.1.1. జలవనరులు

బాయి : బాయికాడికిపోయిరంటఢిల్లీకాంతో

బావి : రామలక్ష్మలుకూడి బావితవ్వెరె

తుంగమడుగు : జగమెల్లపారంగాతుంగమడుగులునిండయోఈవానముల్ల
మడుగు గుప్పితేసేపలేవిర

చెలమలు : చెరువుకుంటలు నిండి సెలమలుపారంగా ఓ వానముల్ల

గంగ బావులు : తుంగమడుగులు నిండి గంగబావులునిండాయో ఈ వానముల్ల

చెరువులు : గనుమెల్లిపారంగాచెరువుకుంటలునిండాయో ఈ వానముల్ల

కాలువలు : జెలజెలవానగొట్టెజలతి కాల్వలు నిండాయో ఈ వానముల్ల

కుంటలు : మా కడుపు నిండాలి వానదేవుడా మా కుంటలు చెరువుల నిండాలి వానదేవుడా

### 5.1.2. జలసంబంధాలు

వానలు : ఆనాలుకురవంగా వరదాలుపారంగా ఏట్లా పోతావు పెండ్లికొడకా

వరదలు : ఆనాలుకురవంగా వరదాలుపారంగా ఏట్లా పోతావు పెండ్లికొడకా

ముత్యాలవాన : ముత్యాల వాన కురిసే

వజ్రాల వాన : వజ్రాల వాన కురిసే

పగడాల వాన : పగడాల వాన కురిసే

### 5.1.3. చెట్లు

గన్నేరు : గన్నేరు చెట్లల్లరో యాదయ్యా..

వంకాయచెట్లు : వంకాయ చెట్లల్లరోయాదయ్యా- - -.

పల్లేరు : పుల్చేరు చెట్లల్లరో యాదయ్యా- - -

పుల్చేరు : పల్లేరు చెట్లల్లరో యాదయ్యా..

వెంపలి : ఎర్రగా కూర్చొన్న వెంపలి

సిరిపొన్నచెట్టు : అ ఇంటిముందళ్ళ సిరిపొన్నచెట్టు

నల్లజిల్లెడి : అందుట్లో జేరింది నల్లజిల్లెడి కొమ్మ

### 5.1.4. పూలు

మల్లెపూలు : మల్లెపూలు తెచ్చి మాల అల్లినాడో

: మరిదిపేరు మల్లెపూవు డిల్లికాంతో

: మామపేరు మల్లెమొగ్గ ఢిల్లీ కాంతో

: మల్లెపూల జల్లెండ్ల

: మల్లె పువ్వుల మంచేల మల్లి వద్దురా

: మాలెక్కి మల్లెలు అల్లెటోళ్లెవరే

శనిగపూలు : శనగపూలు తెచ్చ శెండు అల్లినాడో

కోరెంగా పూలు : కొరింగ పూలు తెచ్చి గొలుసు అల్లినాడో

ఒద్దిపూలు : వాచ్చి మీద వొద్ది పువ్వురో చిన్నోడా

ఉల్లిపూలు : ఉంగరం మీద ఉల్లిపువ్వురో చిన్నోడా

మొగలి పూలు : మొగని పేరు మొగలిపువ్వు డిల్లికాంతో

బంతిపూలు : బావ పేరు బంతి పువ్వు డిల్లి కాంతో

అల్లిపూలు : అత్త పేరు అల్లిపువ్వు డిల్లి కాంతో

సన్నజాజులు : సన్నజాజుల చీరకట్టు సీతమ్మ

## 5.1.5. కాయలు

నిమ్మకాయ : నిమ్మకాయ నిచ్చెన వంపెరా

: ఒయ్యారి ఒయ్యారి నిమ్మళ్లకిందా

జాజికాయ : జాజికాయ జల్లెడ వంపెరా

వంకాయ : వంకాయ చెట్లల్లరో యాదయ్యా

గుమ్మడికాయ : గుజ్జారిగుజ్జారి గుమ్మళ్లకిందా

## 5.1.6. పండ్లు

దొండ : దొండ పండు కోరే సెలియ

ములగ : ములగ పండు అడిగే సెలియా

నల్లఈత : నల్ల ఈత పండు అడిగే సెలియా

అరటి : అరటి పండు అడిగే సెలియా

అల్లనేరడి : అల్లా నేరడి పండ్లు అడిగే సెలియా

| | |
|---|---|
| వెలగ | : వెలగ పండ్లు అడిగే సెలియా |
| నారింజ | : నారింజ పండ్లు అడిగే సెలియా |

### 5.1.7. పంటలు

| | |
|---|---|
| సద్దలు | : పాల సద్దలు పెడతారోఎల్లన్నా |
| జొన్నలు | : "పచ్చిజొన్నలుపెడతారోఎల్లన్నా" |
| | "తెల్లజొన్న లెయ్యబోతేనాగుమల్లెదారిలో" |
| | "పచ్చజొన్న లెయ్యబోతేనాగుమల్లెదారిలో" |
| | "ఎఱ్రజొన్నలెయ్యబోతేనాగుమల్లెదారిలో" |
| | "ఎడ్లుపోయినవిరాఎఱ్రజొన్నసేను పట్ట" |
| గోధుమ | : కొండ కింద గోధుమ కొయ్యనయ్యింది. |
| ఆముదాలు | : అన్ని ధాన్యాలు పండు అంద్యాలు పండు |
| నూగులు | : నూరు ధాన్యము పండు నూగుళ్ళు పండు |
| సద్దలు | : సగుళ ధాన్యము పండు సద్దళ్ళు పండు |
| | : పాల సద్దలు పెడతరారో ఎల్లన్నా |
| బియ్యం | : డబ్బుకు తవ్వెడు బియ్యం వానదేవుడా |
| శనిగలు | : మేము వచ్చినాము శనిగలుదెచ్చారా |
| కొఱ్రలు | : కోడెలు పోయినవిరాకొఱ్రసేను పట్ట |
| పెసర్లు | : పెయ్యలు పోయినవిరాపెసరసేను పట్ట |
| కందులు | : కరణంవారి కంది సేను |

### 5.1.8. తోటలు :

| | |
|---|---|
| ఉల్లి | : ఊరి ఉన్ననీళ్ళకు ఉల్లితోటల్లు |
| మామిడి | : మామిడి వనముల తిరిగే టోలేవ్వారే |
| సంపంగి | : సంపంగి వనముల తిరిగేటోలేవ్వారే |
| నిమ్మ | : నిలబడ్డ నీళ్ళకు నిమ్మ తోటల్లు |
| పసుపు | : పారి ఉన్న నీళ్ళకు పసుపు తోటల్లు |

| | |
|---|---|
| ఆకులు | : అత్తరోకు కవుసలియా సీతకు ఆకులేమో పంపినాది |
| | : ఆకన్నాగానైతి మేకన్నామేసు |

**5.1.9. చేన్లు :**

| | |
|---|---|
| అనపసేను | : ఆవులుపోయినవిరా అనపసేను పట్ట |
| నేరేళ్ల వనములు | : నేరేళ్ళవనములోన కొగుళ్లపుట్టో గొబ్బిల |
| పెసరసేను | : పెయ్యలు పోయినవిరా పెసరసేను పట్ట |
| కొఱ్రసేను | : కోడెలుపోయినచిరా కొఱ్రసేను పట్ట |
| ఎఱ్రజొన్నసేను | : ఎడ్లుపోయినవిరా ఎఱ్రజొన్న సేనుపట్ట |

**5.1.10. అపరాలు:**

| | |
|---|---|
| తేనే | : కరణం వారి కందిసేను తేనె దాని తేట్టెలకు |
| మిరియాలు | : కొంగున మిరియాలు కస్తురాలు |
| కస్తురాలు | : కొంగున మిరియాలు కస్తురాలు |

**5.1.11. మణులు:**

| | |
|---|---|
| ముత్యాలు | : దొడ్డువి ముత్యాలు డోల్పుటోల్లెవ్వరే |
| | : ముత్యాల వాన కురిసే |
| | : దోసెడు ముత్యాలు  దోతుల్ల సాపే |
| | : సారేడు ముత్యాలు చేతుల్లా జూపే |
| | :పిడికెడు ముత్యాలు పిల్లున్న గొయ్య |
| | : సన్నని ముత్యాలు డొల్పెటోలెవ్వలె--- |
| | : దొడ్డువు ముత్యాలు డొల్పెటోళ్లెవ్వలే |
| వజ్రాలు | : వాన కురిసే ఆకిండ్లు ఉకించు వజ్రాలే పరపించి |
| పగడాలు | :పగడాలవాన కురిసేపందిళ్ళు ఉకించి పగడాలే పరపించి |

**5.1.12. జంతువులు**

| | |
|---|---|
| మేక | : ఆకన్నాగానైతిమేకళ్లుమేసు |

బర్రె : బర్రె పడ్డానిస్తాకొట్టుక పోరా చెల్లా

ఆవులు : ఆవులో ఎల్లన్న ఆవులు

దూల్లు : దూల్లుపోయినవిరాదుక్కిసేను పట్ట

కోడె : కోడెలు పోయినవిరాకొర్రసేను పట్ట

పెయ్యలు : పెయ్యలుపోయినవిరాపెసరసేను పట్ట

ఎద్లు : ఎద్లుపోయినవిరాఎర్రజొన్నసేనుపట్ట

ఏనుగు : ఎర్రగా కూర్చున్న వేంపలి క్రింద ఏనుగును డికొల్పి ఎక్కేబాలుడు.

### 5.1.13. జలచరాలు

చేపలు : మడుగు గుప్పితేసేపలేవిరా....

జెల్లలు : సీరంల జెల్లొచ్చె పట్టి గడ్డనవేసి ఈ వానముల్ల

### 5.1.14. పక్షులు :

కోయిల : కోట చుట్టూ రెండు కోయిలాలుకూయంగా

రామచిలుక : తల్లినైపోయివచ్చెదనమ్మా నా రామచిలుకా

### 5.1.15. సరీసృపాలు

బల్లి : బాయిల బల్లి కదానేఏన్నెలా

పాము : నాగన్న పెట్టిందు నలుగేయిల గుడ్లో గొబ్బిల

### 5.1.16. మైపూతలు :

గంధం : “గట్టి మెట్టెలు పెట్టి గంధములు పెట్టి
గంధంబుకస్తూరుగమగమవాసనలు”

సురగంధం : సుట్టుమెట్టెలు పెట్టి సురగంధం పెట్టి

కస్తూరు : గంధంబుకస్తూరు గమగమ వాసనలు.

### 5.2.0 నిర్మితాలు

### 5.2.1. ఇంటిలోపలి వస్తువులు

| | |
|---|---|
| పందిరి | : "పందిళ్ళుఊకించి పగడాలే పరపించి" |
| | "పన్నెండు గుంజల పందిరి కిందా" |
| | "పచ్చని పందిట్లో పెట్టుకొని చూస్కోపిల్లా" |
| గుంజలు | : పన్నెండు గుంజల పందిరికిందా |
| తలుపు | : తలుపు చెక్కల మీద తలాతలామెరవంగా |
| చెక్క | : తలుపు చెక్కల మీద తలాతలామెరవంగా |
| ఆకిలి | : ఆకిండ్లుఊకించి వజ్రాలే పరపించి |
| రొకలి | : ముత్తంపురొకండ్లు |
| కుందులు | : పగుడాంపు కుందెండ్లు |
| గిన్నె | : పాలుదాగే గిన్నె తెచ్చు పట్టంగీ తెచ్చు |
| పళ్ళెం | : బంగారిపళ్ళెంలోన పసుపుతో నలుగిడరె |

### 5.2.2. కొలమానాలు:

డిండిమండల కొలమానాలల్లో సారెడు, వద్దెడు, గిద్దెడు అనె ప్రాచీన కొలమానాల పేర్లు నేటికీ వాడుకలో ఉండడం విశేషంగా కనపడుతుంది.

| | |
|---|---|
| గిద్దెడు | : గిద్దెడుగిద్దెడు నూనె సిల్పిరే నూనె |
| సారెడు | : నావిలాగదాతమ్ముది కురులు సారెలు సారెడుసిల్పిరే నూనె |
| | : సారేడు ముత్యాలు చేతుల్లా జోడే |
| అద్దెడు | : అద్దెడుఅద్దెడుఅంటిరే నూనె |
| సోలెడు | : సోలెడుసోలెడుసోల్పిరే నూనె |
| తవ్వడు | : తవ్వడు తవ్వడుతాపిరే నూనె |
| వద్దెడు | : వద్దెడువద్దెడువంటిరె నూనె |
| దోసెడు | : దోసెడు ముత్యాలు దోతుల్ల సాపే |
| పిడికెడు | : పిడికెడు ముత్యాలు పిల్లున్నగొయ్య |
| పుట్టి | : పది పుట్లు కొలవంగా పగటి సురటిలోయి |

### 5.2.3. ద్రవ్యం :

| | |
|---|---|
| అర్ధ | : అర్ధ ఇత్తా తిస్కోపిల్ల అద్దం దువ్వెన తెచ్చుకోపిల్ల |
| పావలా | : పావలా ఇత్తా తిస్కోపిల్ల పట్టు చీర తెచ్చుకోపిల్ల |

### 5.2.4. ఆభరణాలు

| | |
|---|---|
| వడ్డానం | : నడుము వడ్డాణంతో |
| గజ్జెలు | : పిరికితానీను చెంబు పీటపై గజ్జెలు |
| | : గజ్జెలుతెచ్చు గంటలు తెచ్చు |
| కడెం | : నా కడెం పోయ్యిందిరో యాదయ్య |
| పుస్తె | : నా పుస్తె పోయ్యిందిరో యాదయ్య |
| మెట్టెలు | : "రఘురాముడు పెండ్లికొడుకు రమ్య సీతమ్మా సుట్టుమెట్టెలు పెట్టి |
| గట్టిమెట్టెలు | : "గట్టిమెట్టెలు పెట్టి గంధములు పెట్టి" |
| పట్టె గొలుసు | : నా పట్టెగొలుసు పోయ్యిందిరో యాదయ్యా |
| చేతి గొలుసుకట్టు | : గోలతీరా చేతిగొలుసు అందుకోవా |
| చేతి పట్టె | : పనాతీరా చేతిపట్టె అందుకోవా |
| బంగారి పళ్ళెం | : బంగారిపళ్ళెంలోనపసుపుతోననలుగిడలె |
| గంట | : గజ్జెలుతెచ్చు గంటలు తెచ్చు |
| సొమ్ములు | : పెట్టె సొమ్మిలిస్తాదండె నా చీరాలిస్తా |
| వెండి | : వెండి నురటీలోయ్ |

### 5.3.0. అంగీకృతాలు

### 5.3.1. స్థలనామాలు

| | |
|---|---|
| గొనకల్లు | : పేరైన గొనకల్లుపేటమాదిపుడు |
| జొన్నగడ్డ | : నామజొన్నగడ్డ నడుమ కురపాడు |
| కూరపాడు | : నామజొన్నగడ్డ నడుమ కురపాడు |

తాటికొండ : నడుమ కురపాడు పక్క తాటికొండ

నీరకొండ : కొండ పైన నీరుకొండ దానిమ్మా పుట్టినిల్లు దానకొండ

దేవరకొండ : దేవరకొండ అంగల్లోదేరముందల్లా...

నల్గొండ : నల్గొండ అంగల్లో నైరుముందల్లా..

జూపల్లి : జూపల్లిజుట్టుగాడు ఢిల్లీకాంతో

పోచంపల్లి : పోచంపల్లి పొట్టిగాడుఢిల్లీకాంతో

చిట్యాల : నేను పోదు చిట్యాలచూడ

నుదురు బైపల్లె : నవ్వుతా రామయ్య నుదురు బైపల్లె

ఢిల్లీ : ఢిల్లీకి పోయ్యేట్టుశివజంగమయ్య

## 5.3.2. సంఖ్యా వాచకాలు:

డిండిమండల సంఖ్యావాచకాలలో నేటికీ మున్నూరు, ఏన్నూరు అను ప్రాచీన సంఖ్యామానాలు వినియోగంలో కనపడుతున్నాయి.

ఏడు ఘడియలు :ఈశ్వరి లగ్గాలు విడిచి పోవయ్య విడలేని లగ్గంబు ఏడు గడియలు

మున్నూరు :ముత్యమా చూసిరావే మాకెంతో మూక ముంగల్లు మున్నూరు ఎనక ఏన్నూరు

ఏన్నూరు :ముత్యమా చూసిరావే మాకెంతో మూక ముంగల్లు మున్నూరు ఎనక ఏన్నూరు

పది : పది పుట్లు కొలవంగా పగటి సురటిలోయి

ఏడుగురు : ఏడుగురు ఎరండ్లు ఢిల్లీకాంతో

నూరు : నూరు దాన్యము పండు నూగుల్లు పండు

కోటి : కోటి ధాన్యాలుపండు కొర్రలుపండు

రెండు : రెండో మాసము నెల తన గర్భిని

మూడు : మూడో మాసము నెల తనగర్భిని

నాలుగు : నాలుగో మాసము నెల తన గర్భిని

ఐదు : ఐదో మాసము నెల తన గర్భిని

ఆరు : ఆరో మాసమునెల తన గర్భిని

| | |
|---|---|
| ఏడు | : ఏడో మాసము నెల తన గర్భిని |
| ఎనిమిది | : ఎనిమిది మాసమునెల తన గర్భిని |
| తొమ్మిది | : తొమ్మిదో మాసము నెల తన గర్భిని |
| పది | : పదో మాసము నెల తన గర్భిని |
| పన్నెండు | : పన్నెండు ధాన్యాలు వానదేవుడా బండ మీద పండాలి వానదేవుడా |

డిండిమండలంలో లభించిన జానపదగేయాలలోని ప్రకృతివిజ్ఞానాన్ని పరిశీలించినపుడు సహజంగా లభించేవి అవసరార్థం నిర్మించుకున్నవి అని రెండురకాలుగా గుర్తించడం జరిగింది. సహజంగా లభించే వాటిలో జలసంబంధాలు, జలవనరులు, చెట్లు, పూలు, కాయలు, పండ్లు, పంటలు, తోటలు, చేన్లు, అపరాలు, మణులు, జంటువులు, పక్షులు, సరీసృపాలు, మైపూతలు వంటివి ఈ ప్రాంతపు పాటల్లో లభించాయి. నిర్మితాలు అంగీకృతాలులో ఇంటి నిర్మాణ వస్తువులు, ఇంటిలో వినియోగించే వస్తువులు, స్థలనామాలు, కొలమానాలు, ద్రవ్యరూపాలు, ఆభరణాలు, సంఖ్యావాచకాలు వంటివి లభ్యం అయ్యాయి. వీటిలో డిండిమడలానికీ దానికి అటు ఇటుగా ఉన్న ఊర్లపేర్లు, ఈ ప్రాంతంలో వాడుకలో ఉన్న సంఖ్యావాచకాలు, ఆభరణాలపేర్లు, ఈప్రాంతపు కొలమానాలు కనపడుతున్నాయి. చేపలు పట్టేవిధానం, చేపల రకాలు, తోటలూ చేన్లూ చెట్లు కాయలు పూలు వీటిలో ఈ ప్రాంతపు వాడుక విధానం కనపడుతుంది. సార్వజనీనత మధ్య అంతర్గతంగా దాగి ఉన్న ప్రాంతీయతను తెలిసుకొన వీలుకలిగినది.

**పరిశోధనాఫలితాలు**

డిండిమండల జానపద గేయాలు ప్రాకృతికవిజ్ఞానం అను అంశంతో పరిశీలన ప్రారంభించినపుడు మొదటగా డిండిమండల స్వరూపాన్ని పరిచయం చేయాలన్న తలంపుతో డిండిమండలంలోని భూభాగ వివరాలను, నీటి వనరులను, నీటి ప్రాజెక్టులను, అక్కడ పండే పంటలను, జనాభా వివరాలను, లభ్యమయ్యే ఖనిజాలను, విద్యాసౌఖర్యాలను, మార్కెటింగ్ బ్యాంకింగ్ సౌఖర్యాలను, ఆరోగ్యకేంద్రాలను, పారిశుద్ధ్య పనులతీరును, పర్యాటక కేంద్రాలను పరిచయం చేయడంద్వారా పరిశోధనాక్షేత్ర వైశిష్ట్యాన్ని, ఆ ప్రాంతపు విశిష్టతలను, అలవాట్లను విశేషాలతో తెలియజేయటం జరిగింది.

రెండవ అధ్యాయంలో జానపద విజ్ఞానాన్ని అందులోని ఉప విభాగమైన జానపద సాహిత్యాన్ని అందులో ఉపవర్గమైన జానపద గేయ సాహిత్యాన్ని పూర్వ పరిశోధకులు వర్గీకరించిన విధానాలను జానపద విజ్ఞానం వర్గీకరణ, జానపదసాహిత్య వర్గీకరణ, జానపద గేయసాహిత్యం వర్గీకరణ అన్న కోణంలో వివరించడం జరిగింది. ఈ అధ్యాయం ద్వారా జానపద విజ్ఞానంలోనుండి జానపద సాహిత్యం జానపద సాహిత్యంనుండి జానపద గేయ సాహిత్యం విభజించిన విధానం తెలియజేసి డిండి మండలంలో లభ్యమైన జానపదగేయాలు ఈ విభజనలో ఎంతమేరకు లభ్యమయ్యాయో తెలియజేయడం జరిగింది.

మూడవ అధ్యాయంలో డిండిమండల జానపద జీవన విధానంలో డిండి మండలంలోని ప్రజల జీవసస్థితి గతులను సోదాహరణంగా విశ్లేషించి చూపడం జరిగింది ఇందులో ఈ ప్రాంతపు కుటుంబ వ్యవస్థను, ఇక్కడి ప్రజల ఆచార వ్యవహారాలను, పాటించే పండుగలను, కొలిచే గ్రామదేవతలను, వ్యవసాయ విధానాలను, జనాభాలోని కులాలు, మతాలను, వారి ఆహారపు అలవాట్లను, అక్కడి ప్రజల విందులు వినోదాలను, పిల్లల ఆటలను విశ్లేషించి చెప్పడం జరిగింది. ఈ అధ్యాయంద్వారా డిండి మండల ప్రజల జీవనవ్యవస్థ, వారి ఆహారపు అలవాట్లు, అక్కడపండే పంటలు, పిల్లల ఆటపాటలు తెలియజేస్తూ ప్రాదేశిక జీవన విధానాన్ని అందించాను.

నాల్గవ అధ్యాయంలో డిండిమండల జానపదగేయాల వర్గీకరణలో డిండి మండలంలో సేకరించిన ప్రతిపాటను తీసుకుని అందులోని అంశం ఆధారంగా వర్గీకరించి ఉపశీర్షికలతో పరిచయం చేయటం జరిగింది. ఇందులో స్త్రీలపాటల్లో ఆరురకాల వేడుకపాటలు, కుటుంబసంబంధ గేయాలలో అత్తాకోడళ్ళు, బావామరదళ్లు, వదినామరదళ్లు, అన్నాచెల్లెళ్ళ తలుపుదగ్గర గేయాలనే సంవాదగేయాలు లభించాయి. ఈ అధ్యాయంద్వారా డిండి మండలంలో సేకరణద్వారా లభ్యమైన జానపదగేయాలను పరిచయం చేయడం జరిగింది. వీటిని ప్రత్యేకంగా పరిశీలించడంద్వారా ప్రాంతీయతా చిహ్నాలతో ఉన్న పాటలు ఉన్నాయని తెలియవచ్చింది.

అయిదవ అధ్యాయమైన డిండి మండల జానపదగేయాలు ప్రాకృతిక విజ్ఞానం అను అధ్యాయంలో ప్రాకృతిక విజ్ఞానం అంటే ఏమిటో పరిచయం చేసి డిండిమండలంలో జానపదగేయాలలో లభ్యమైన ప్రాకృతిక విజ్ఞానాన్ని జలవనరులు, జలసంబంధాలు, జలచరాలు, చెట్లు, పూలు, కాయలు, పండ్లు, పంటలు, తోటలు, చేన్లు, అపరాలు, మణులు, జంతువులు, సరీసృపాలు, మైపూతలు అనే సహజాలనూ, నిర్మితాలలో ఇంటిలోపలి వస్తువులు, స్థలనామాలు, కొలమానాలు, ఆభరణాలు, అంగీకృతాలలో సంఖ్యావాచకాలు ఇవ్వడం జరిగింది. ఈ అధ్యాయంద్వారా స్థానికమైన పండే పంటలు, లభ్యమయ్యే మణులు, పారాడే జీవరాశులు వాటిపేర్లు తెలుసుకొనవీలయింది. జలసంబంధ నిర్మితాలు, ఇండ్లలో వాడే వస్తువులు, అలంకరణసామగ్రిలో ఆభరణాలు వాటిపేర్లు తెలుసుకొనవీలయింది. ఇలా డిండిమండలంలోని జానపద జీవనం స్పష్టంగా తెలుసుకోడానికి ఈ అధ్యయనం ఉపకరిస్తుంది.

## ఉపయుక్త గ్రంథ సూచి


1. ఎల్లోరా, జానపద సాహిత్యం, హైదరాబాద్, దీప్తి పబ్లికేషన్స్.
2. కృష్ణకుమారి, నాయని, తెలుగు జానపద విజ్ఞానం – సంస్కృతి సాహిత్యం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. దొణప్ప, తూమాటి, జానపద కళాసంపద, ఆంధ్ర విశ్వకళా పరిషత్ హైదరాబాద్ 1972.
4. నాగభూషణం సిద్ధాని, రచన జలవనరులు, ఆరవ ముద్రణ (2004)
5. ప్రేమలత రావి, తెలుగు జానపద సాహిత్యము – పురాగాథలు, సికింద్రాబాద్, అవేర్ప్రిటింగ్ ప్రెస్, 1983.
6. మోహన్, జి.ఎస్, జానపద విజ్ఞానాధ్యయనం, ద్రావిడ విశ్వవిద్యాలయం, శ్రీనివాస పబ్లికేషన్, కుప్పం, 2010.
7. మోహన్, జి. ఎస్, అనంతపురం మండలం స్త్రీ పాటలు, శ్రీనివాస పబ్లికేషన్స్, కుప్పం – 1982.
8. రామరాజు, బిరుదురాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, జానపద విజ్ఞాన **ప్రచురణ**, హైదరాబాద్, 1990.
9. లింగా రెడ్డి, గోపు, తెలంగాణ శ్రామిక గేయాలు, సుషమా పబ్లికేషన్స్, –కరీంనగర్ 1982.
10. వసుంధరారెడ్డి, సి.హెచ్, తెలుగు జానపద సాహిత్యము స్త్రీల గేయములలో సాంప్రదాయములు, మహాత్మ ప్రింటింగ్ ప్రెస్, న్యూ నల్లకుంట, హైదారాబాద్1984.
11. విజయలక్ష్మి.డి. తెలుగుతమిళ లాలిపాటలు : సామజిక భాషాపరిశీలన, హేమంత్ ప్రచురణలు, నెడుంబరం. 2014
12. విజయలక్ష్మి మూలె, జనపదగేయగాథల్లో స్త్రీ, ఎమ్బి ఎమ్మార్ ప్రచురణలు, కడప

# అనుబంధం –1

డిండి మండలంలో జానపదగేయ సేకరణకు వెళ్ళినపుడు పాడి వినిపించిన జానపద గాయకుల వివరాలు.

| క్రమ. సంఖ్య | పాడిన వారిపేరు | వయస్సు | పాడిన వారి ఊరి పేరు |
|---|---|---|---|
| 1. | నూనె ఎల్లమ్మ | 80 | గోనకోల్ |
| 2. | విభూది అలివేల | 45 | గోనకోల్ |
| 3. | విభూది లక్ష్మయ్య | 55 | గోనకోల్ |
| 4. | యాదమ్మ | 60 | గౌరారం |
| 5. | వెంకటమ్మ | 60 | తాక్లాపూర్ |
| 6. | నూనె వెంకటమ్మ | 50 | తాక్లాపూర్ |
| 7. | గోరేటి లక్ష్మమ్మ | 45 | చెరుకుపల్లి |
| 8. | అంజమ్మ | 70 | ఖానాపూర్ |
| 9. | రాములమ్మ | 40 | రామంతాపూర్ |
| 10. | రామచంద్రమ్మ | 65 | గౌరారం |
| 11. | లక్ష్మమమ్మ | 50 | డిండి |
| 12. | భాగ్యమ్మ | 60 | డిండి |
| 13. | వరికుప్పల అంజమ్మ | 66 | గౌనబోయినపల్లి |

| | | | |
|---|---|---|---|
| 14. | నసరమ్మ | 70 | ప్రతాప్ నగర్ |
| 15. | అనసూయ | 40 | కామేపల్లి |
| 16. | గట్టుదాసు మంజుల | 55 | వావిల్కోల్ |
| 17. | రాగం ఇరమ్మ | 60 | చెర్కుపల్లి |
| 18. | కూతటి లక్షమ్మ | 62 | డిండి |
| 19. | మల్లీశ్వరమ్మ | 45 | బొగ్గులదోన |
| 20. | శ్రీపతి చంద్రకళ | 40 | రామంతాపూర్ |
| 21. | శంకరమ్మ | 65 | దాసరి నెమలిపూర్ |
| 22. | అంజమ్మ | 52 | సింగరాజుపల్లి |
| 23. | అలివేల | 53 | బొల్లనపల్లి |
| 24. | కేశమ్మ | 63 | గౌరారం |
| 25. | ఖరిమమ్మ | 54 | గోనకోల్ |

# అనుబంధం –2

## క్షేత్ర పర్యటనలోని ఛాయాచిత్రాలు



పాటలకు అర్థాలు తెలుసుకుంటూ







పాటలు సేకరిస్తున్న సందర్భంలో